ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

epaper.vaartha.com WWW.VAARTHA.COM హైదరాబాద్ : fb.com/vaartha Digital

Published from Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Ongole, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

8-8-2026 శనివారం సంపుటి: 32 సంచిక: 189 పేజీలు: 10+4 వెల: 6.50

బిజెపి-అకాలీదళ్ మళ్లీ జట్టుకు యత్నం 3లో

నీట్ : 13 మందిపై సిబిఐ ఛార్జిషీటు 5లో



# ఉచితాలు

## సామాన్యులకా! సంపన్నులకా?

### రైతుబంధు వంటి పథకాలతో ఎందరో ధనికులకూ లబ్ధి

### గ్రామాల్లో కూలీలు దొరకని పరిస్థితి

### హైకోర్టు సంచలన వ్యాఖ్యలు

### సందీప్ కుమార్‌పై ఎన్నో కోర్టు ధిక్కరణ కేసులు

**హైదరాబాద్, అగస్టు 7, ప్రభాతవార్త:** ఉచిత పథకాలు, ప్రభుత్వ పాలనా తీరుపై తెలంగాణ హైకోర్టు సంచలన వ్యాఖ్యలు చేసింది. సమాజంలో భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని, పెరిగిపోతున్న ప్రమాదకర పరిస్థితులను హెచ్చరించేఉద్దేశంతోనే ఈ వ్యాఖ్యలు చేస్తున్నట్లు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నగేష్ బీమాపాక స్పష్టం చేశారు. రూ.33 కోట్ల బకాయిలకు సంబంధించి కోర్టు ధిక్కరణ కేసుతో పాటు, ఉచితాలకు సంబంధించిన కేసును కూడా శుక్రవారం ధర్మాసనం విచారించింది. సికింద్రాబాద్ కంటో >>2



శుక్రవారం కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న మంత్రులు ఉత్తమ్, తుమ్మల, జూపల్లి, సిఎస్ సంజయ్ జాజు

# రైతుకు చేయూత

### జిల్లా నీటిపారుదల సలహా మండలి పునరుద్ధరణ

### పంటల ప్రణాళికపై సకాలంలో రైతుకు సమాచారం

### ఇంకా నీరు చేరని ఎన్ఎస్‌పి, ఎస్సారెస్పీ

### 15 నుంచి స్మార్ట్ రేషన్ కార్డులు: మంత్రి ఉత్తమ్

**హైదరాబాద్, ఆగస్టు 7 ప్రభాతవార్త:** ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో రైతుల ప్రయోజనాల పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యత నిస్తూ జిల్లా నీటిపారుదల సలహా మండలని తక్షణమే రాష్ట్రంలోని అన్ని జిల్లాలలో పునరుద్ధరించాలని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖామంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. శుక్రవారం రాష్ట్ర కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, అటవీ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, ఉన్నతాధికారులతో కలిసి ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగామంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి జిల్లా కలెక్టర్ అధ్యక్షతన నీటిపారుదల, వ్యవసాయ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, ఇతర సంబంధిత వర్గాలతో కూడిన జిల్లా నీటిపారుదల సలహామండలి ఉండాలని సూచించారు. ప్రతి పంట కాలానికి ముందు, పంట సీజన్‌లో తప్పనిసరిగా సమావేశమై జలాశయాల నీటి నిల్వలు, ఆశించదగిన నీటి ప్రవాహాలు, స్థానిక వర్షపాతం, తాగునీటి అవసరాలు, కమాండ్ ఏరియాల్లోని సాగు పరిస్థితులను సమగ్రంగా సమీక్షించి రైతులకు శాస్త్రీయ, విశ్వసనీయమైన మార్గదర్శకాలు ఇవ్వాలని ఆదేశించారు.ప్రస్తుతం రాష్ట్రంలో నెలకొన్న ఎల్‌నినో పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని శనివారం నుంచే నీటిపారుదల సలహా మండలి సమావేశాలు జిల్లాలలో >>2



## జంతర్‌మంతర్‌ను 'బందీ'ని చేయొద్దు

### నిరసనలకు దూరంగా ఉంచండి: ఢిల్లీ హైకోర్టు

**న్యూఢిల్లీ, ఆగస్టు 7:** నిరసనల కారణంగా జాతీయ రాజధానిని 'బందీగా పెట్టలేం' అని వ్యాఖ్యానిస్తూ, జంతర్ మంతర్ వద్ద గానీ, నగరంలోపల గానీ నిరసనలు జరగకపోవడమే ఆదర్శప్రాయమని ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అమిత్ మహాజన్ కీలక వ్యాఖ్యలు చేశారు. నగరంలోపల నిరసనలు జరగడం వల్ల రోడ్లు, అంబులెన్సులు వంటి సాధారణ ప్రజల కార్యకలాపాలకు ఆటంకం కలుగుతుందని, అందువల్ల తాను వ్యక్తిగతంగా అలా భావించడం లేదని జస్టిస్ మహాజన్ పేర్కొన్నారు. దళిత క్రైస్తవులను షెడ్యూల్డ్ కులాల జాబితాలో చేర్చాలనే డిమాండ్‌పై ఆగస్టు 10న జంతర్ మంతర్ వద్ద శాంతియుత నిరసనకు అనుమతి కోరుతూ దాఖలైన పిటి >>2

# ఇక అధికారం బిజెపికే

### రాష్ట్రంలో 119 నియోజకవర్గాల్లో బాగా మెరుగుపడిన పార్టీ ఓటు బ్యాంకు

### గ్రాడ్యుయేట్ నియోజకవర్గాలు పార్టీకే

### రిజర్వేషన్, డీలిమిటేషన్ బిల్లులు ఈ సారి కచ్చితంగా ఆమోదం

### రాష్ట్ర బిజెపి ఎంపీలు, నేతలతో పార్టీ చీఫ్ నితిన్ నబీన్ భేటీ



శుక్రవారం న్యూఢిల్లీలో బిజెపి చీఫ్ నితిన్ నబీన్‌తో భేటీ అయిన కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్, పార్టీ రాష్ట్ర చీఫ్ రాంచందర్ రావు, కె. లక్ష్మణ్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఆగస్టు7:** సంస్థాగత బలంతో తెలంగాణలో రాబోయే ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ విజయం సాధించి, సొంతంగా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని బిజెపి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు ధీమా వ్యక్తం చేశారు. శుక్రవారం ఢిల్లీలో బిజెపి జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ అధ్యక్షతన జరిగిన పార్టీ ఉన్నతస్థాయి సమావేశంలో రాంచందర్‌రావుతో పాటు బిజెపి రాష్ట్ర ఇంఛార్జ్ అభయ్ పాటిల్, రాష్ట్ర సంస్థాగత ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ తివారీ, పార్టీ లోక్‌సభ, రాజ్యసభ ఎంపీలు పాల్గొన్నారు. ఈ సమావేశం అనంతరం రాంచందర్‌రావు మీడియాతో మాట్లాడారు. అత్యంత స్నేహపూర్వక వాతావరణంలో నితిన్ నబిన్ దిశానిర్దేశం పొందామని తెలిపారు. గతంలో తెలంగాణ రాష్ట్రంలోని 119 అసెంబ్లీ నియోజకవర్గాల్లో పోటీ చేసి మెరుగైన ఓటు బ్యాంకు సాధించామని, పార్లమెంటు ఎన్నికల్లోనూ ప్రజలు బిజెపిని ఆదరించారని గుర్తుచేశారు. ఎన్నికలకు ఇంకా వ్యవధి ఉన్నందున పలు పార్టీల నుంచి నాయకులు బిజెపిలో చేరేందుకు సిద్ధంగా >>2

## 40 యేళ్ల 'బోఫోర్స్'కు ముగింపు

### చివరి పిటిషన్‌నూ కొట్టేసిన సుప్రీం కోర్టు 5లో

## అమిత్‌షాతో స్పీకర్ ఓంబిర్లా భేటీ 5లో

## బిజెపి, ఆర్ఎస్ఎస్ మధ్య సమన్వయ లోపం

### -సిజెపి చీఫ్ అభిజిత్ దీప్కే



**ముంబయి, ఆగస్టు 7:** బిజెపి, రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆరెస్సెస్) మధ్య సమన్వయం లోపించిందని కాక్రోచ్ జనతా పార్టీ (సిజెపి) వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే విమర్శించారు. జెన్‌జీ యువతపై ఆరెస్సెస్ చీఫ్ మోహన్ భగవత్ చేసిన వ్యాఖ్యలను బిజెపి నేతలు పరిగణనలోకి తీసుకోవాలని ఆయన సూచించారు. శుక్రవారం మహారాష్ట్రలోని ఛత్రపతి శంభాజీనగర్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు.

ముంబైలో జెన్‌జీ, జెన్‌ఆల్ఫా విద్యార్థులతో జరిగిన కార్యక్రమంలో మోహన్ భగవత్ చేసిన ప్రసంగాన్ని ఈ సందర్భంగా దీప్కే ప్రస్తావించారు. "నిరసనలు తెలుపుతున్న జెన్‌జీ యువత దేశ వ్యతిరేకులు కాదు, వారి ఆందోళనల్లో నిజాయతీ ఉంది, వారికి నిరసన తెలిపే హక్కు ఉందని మోహన్ భగవత్ స్పష్టం చేసిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. బిజెపికి మార్గదర్శిగా ఉన్న భగవత్ మాటలను ఆ పార్టీ నాయకత్వం వినాలని హితవు పలికారు.

# నేతన్నకు ఏదీ భరోసా?

### గతంలోని బిఆర్ఎస్ ప్రభుత్వ పథకాలను పునరుద్ధరించాలి

### ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కెటిఆర్ బహిరంగ లేఖ



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఆగస్టు7:** జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె. తారకరామారావు (కెటిఆర్) శుక్రవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి బహిరంగ లేఖ రాశారు. తెలంగాణ సంస్కృతి, అస్తిత్వానికి వెన్నెముకగా నిలిచిన చేనేత కార్మికుల పరిస్థితి కాంగ్రెస్ పాలనలో తీవ్రంగా దిగజారిందని ఆందోళన వ్యక్తం చేశారు. బిఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో కెసిఆర్ నాయకత్వంలో అమలైన నేతన్న బీమా, నేతన్నకు చేయూత వంటి అనేక నేతన్నల కోసం ప్రత్యేకంగా అమలు చేసిన సంక్షేమ పథకాలను నిలిపివేసి నేతన్నలను తీవ్ర ఇబ్బందుల్లోకి నెట్టారని విమర్శించారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ చేనేత కార్మికులకు ఇచ్చిన హామీల్లో ఒక్కటీ అమలు కాలేదని ఆరోపించిన కెటిఆర్, వెంటనే అన్ని పథకాలను పునరుద్ధరించి నేతన్నలకు భరోసా కల్పించాలని డిమాండ్ చేశారు. జాతీయ చేనేత దినోత్సవం కేవలం ఉత్సవాలు నిర్వహించుకునే రోజు కాదని, చేనేత కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించే విధానాలు అమలు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందని కేటీఆర్ పేర్కొన్నారు. కానీ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం, రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం రెండూ కలిసి చేనేత రంగాన్ని సంక్షోభం వైపు నెడుతున్నాయని విమర్శించారు. బిఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో దేశంలో ఎక్కడా లేని విధంగా చేనేత రంగానికి అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేశామని >>2

# త్వరలో డిజిటల్ అసెంబ్లీ, కౌన్సిల్

### పౌరుల డేటా భద్రతకు బ్లాక్‌చెయిన్ ఆధారిత సర్టిఫికెట్ల జారీ: మంత్రి శ్రీధర్‌బాబు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఆగస్టు7:** త్వరలోనే రాష్ట్రంలో డిజిటల్ అసెంబ్లీ, డిజిటల్ కౌన్సిల్‌ను అందుబాటులోకి తీసుకొచ్చేందుకు ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తున్నామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పేర్కొన్నారు. పౌర సేవల్ని మరింత సమర్థవంతంగా... ప్రజల ముంగిటకే చేర్చేలా ఎఐ, బ్లాక్ చెయిన్ టెక్నాలజీ, డేటా అనలిటిక్స్, క్వాంటం కంప్యూటింగ్ లాంటి ఎమర్జింగ్ టెక్నాలజీలకు పాలనలో పెద్ద పీట వేస్తున్నామన్నారు.

గవ్ కనెక్ట్ (జివిఐ కనెక్ట్), ఎలక్ట్రానిక్ సర్వీసెస్ డెలివరీ (మీసేవ) సంయుక్తాధ్వర్యంలో శుక్రవారం బేగంపేటలోని ఐటిసి కాకతీయలో నిర్వహించిన "ఏఐ ట్రాన్స్‌ఫర్మేషన్ కాంక్లేవ్ (తెలంగాణ)"ను ఆయన లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ... మారుతున్న కాలానికి అనుగుణంగా ప్రభుత్వ పాలనలోనూ మార్పులు రావాల్సిన అవసరం ఉందని, ఆ దిశగా తమ ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందన్నారు. డిజిటల్ క్యాబినేట్, 20 ప్రభుత్వ శాఖలను ఒకే తాటిపైకి తెచ్చేలా రియల్




శుక్రవారం హైదరాబాద్‌లో జరిగిన ఎఐ ట్రాన్స్ఫర్‌మేషన్ కాంక్లేవ్‌లో మంత్రి శ్రీధర్‌బాబు

టైమ్ గవర్నమెంట్ డ్యాష్ బోర్డు, దేశంలోనే తొలి ఎఐ ఆధారిత డేటా ఎక్స్ఛేంజ్, వాట్సాప్ ద్వారా పౌర సేవల డెలివరీ, మీ టికెట్ లాంటి ఎన్నో విప్లవాత్మక సంస్కరణల ద్వారా డిజిటల్ గవర్నెన్స్‌లో తెలంగాణను దేశంలోని ఇతర రాష్ట్రాలకు రోల్ మోడల్‌గా నిలిపామన్నారు. పౌరుల డేటా భద్రతకు పెద్దపీట వేసేలా త్వరలోనే బ్లాక్‌చెయిన్ ఆధారిత సర్టిఫికెట్ల జారీకి శ్రీకారం చుడతామన్నారు.

రాష్ట్రంలోని అన్ని గ్రామీణ ప్రాంతాలకు టీ ఫైబర్ ద్వారా హైస్పీడ్ డిజిటల్ కనెక్టివిటీని అందించాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నామన్నారు. వృద్ధులు, దివ్యాంగులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా ప్రభుత్వ పౌర సేవలను నేరుగా వారి ఇంటి ముంగిటకే అందించేలా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.

డిజిటల్ ఆఫీస్ ప్రాజెక్ట్ ద్వారా రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లోనూ పూర్తిస్థాయిలో పేపర్‌లెస్ అడ్మినిస్ట్రేషన్‌ను అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో మహారాష్ట్ర సిఎంవో చీఫ్ ఎకనామిక్ అడ్వైజర్, మిత్రా సిఇఒ ప్రవీణ్ పరదేశి, సెంటర్ ఫర్ రైల్వే ఇన్ఫర్మేషన్ సిస్టమ్స్ ఎండీ జివిఎల్ సత్య కుమార్, నేషనల్ ఇంటర్నెట్ ఎక్స్ఛేంజ్ ఆఫ్ ఇండియా సిఇఒ డా. దేవేష్ త్యాగి, డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్ఫర్ అడిషనల్ సెక్రటరీ సౌరభ్ కె. తివారీ తదితరులు పాల్గొన్నారు.



జూరాల 26 గేట్లు ఎత్తి నీటిని దిగువకు విడుదల చేస్తున్న దృశ్యం

## జూరాలకు పోటెత్తిన వరద

### 26 గేట్లు ఎత్తి నీటి విడుదల, 162 టిఎంసిలకు చేరిన శ్రీశైలం డ్యామ్

**మహబూబ్ నగర్ బ్యూరో, ఆగస్టు 7, ప్రభాతవార్త :** జూరాలకు కృష్ణమ్మ పరవళ్ళు తొక్కుతున్నది. శుక్రవారం సాయంత్రం 6గంటలకు అందిన సమాచారం మేరకు ప్రాజెక్టులో పూర్తిస్థాయి నీటిమట్టం 9.657 టిఎంసిలకు గాను ప్రస్తుతం 8.651 టిఎంసిలుగా నమోదు అయింది. జూరాల ప్రాజెక్టుకు 2,25,000క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదు కాగా 33గేట్లు ఎత్తి స్పీల్ వే ద్వారా 1,81,766 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. పవర్ హౌస్ ద్వారా 30,559క్యూసెక్కులు దిగువకు విడుదల చేశారు. మొత్తంగా జూరాల నుంచి 2,16,870 క్యూసెక్కుల అవుట్ ఫ్లో నమోదు అయింది. కర్ణాటకలోని ఆల్మట్టి రిజర్వాయర్‌కు 1,07500 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదు కాగా, అదే మొత్తంలో దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. ఆల్మట్టి పూర్తిస్థాయి సామర్థ్యం 123.081 టిఎంసి కాగా ప్రస్తుతం 106.473 టిఎంసిల నీరు నిల్వఉన్నది.అదేవిధంగా నారాయణపూర్ జలాశయానికి ఎగువనుంచి లక్షకుల ఇంట్లో నమోదు కాగా 20 గేట్లు ఎత్తి 62,200 క్యూసెక్కుల నీటిని దిగువన జూరాలకు విడుదల చేస్తున్నారు. నారాయణపూర్ పూర్తి నీటి సామర్థం 33. 313 టిఎంసిలు కాగా ప్రస్తుతం 29.40 టిఎంసిలు నిల్వ ఉన్నది. 162 టిఎంసిలకు శ్రీశైలం ఎగువన జూరాల నుంచిభారీ ఎత్తున వరద వస్తుండడంతో శ్రీశైలం జలాశయానికి జలకళ సంతరించుకున్నది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 885 అడుగులు 215.8070 టిఎంసిలకు గాను ప్రస్తుతం 874.80 అడుగులకు చేరి 162.8190టిఎంసిలుగా నమోదు అయింది. జూరాల పవర్ హౌస్ నుంచి 30,559 క్యూసెక్కుల ఇన్ ఫ్లో నమోదు కాగా గేట్ల ద్వారా 1,81,766 క్యూసెక్కుల ఇన్ ఫ్లో నమోదు అయింది.

# ప్రసవాలు

## వైద్యమా! వ్యాపారమా?

### కాసులకోసం కత్తెర..

### తల్లుల ప్రాణాలతో చెలగాటం!

### కుటుంబాలపై లక్షల్లో భారం..

### ప్రభుత్వ లక్ష్యానికి గండికొడుతున్న ప్రైవేటు ఆసుపత్రులు



**యాదాద్రి భువనగిరి బ్యూరో, ప్రభాతవార్త:** ప్రసవం వైద్య అవసరమా... లేక వ్యాపార అవకాశమా? యాదాద్రి భువనగిరి జిల్లాలో గత పదేళ్ల ప్రసవాల గణాంకాలు ఈ ప్రశ్నను బలంగా ముందుకు తెస్తున్నాయి. ప్రభుత్వం సాధారణ ప్రసవాలను ప్రోత్సహిస్తూ ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఆధునిక వైద్య సేవలు, ఉచిత చికిత్స, ప్రత్యేక వైద్య బృందాలు అందుబాటులోకి తీసుకొస్తున్నప్పటికీ, ప్రైవేట్ ఆసుపత్రుల్లో మాత్రం సిజేరియన్ కాన్పులే ఆదాయ వనరుగా మారాయనే ఆరోపణలు అధికారిక గణాంకాలతోనే బలపడుతున్నాయి. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఈ బర్త్ పోర్టల్‌లో నమోదైన వివరాల ప్రకారం 2016-17 నుంచి 2025-26 వరకు ప్రైవేట్ ఆసుపత్రుల్లో జరిగిన ప్రతి 100 ప్రసవాల్లో దాదాపు 87 ప్రసవాలు సిజేరియన్‌లే కావడం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. వైద్య అవసరం ఉన్నప్పుడే చేయాల్సిన శస్త్రచికిత్సలు ఇప్పుడు సాధారణ ప్రక్రియగా మారిపోయాయా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.పదేళ్లకాలంలో ప్రభుత్వ ఆసుపత్రుల్లో మొత్తం 33,935 ప్రసవాలు జరిగాయి. అందులో 13,527 సాధారణ ప్రసవాలు, 20,408 సిజేరియన్ ప్రసవాలు నమోదయ్యాయి. మరోవైపు ప్రైవేట్ ఆసుప >>2

# సజ్జనార్ నన్ను ఎన్‌కౌంటర్ చేస్తానన్నారు..

### కోర్టులో ఉదయ్ సంచలన ఆరోపణలు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఆగస్టు7:** ట్రైనీ ఐపిఎస్ ఉదయ్ కృష్ణారెడ్డి రెండు రోజుల పోలీసు కస్టడీ ముగిసింది. లైంగిక వేధింపుల కేసు విచారణ సందర్భంగా కస్టడీలో కృష్ణారెడ్డి నోరు మెదపలేదని తెలుస్తోంది. పోలీసులు అడిగిన చాలా ప్రశ్నలకు ఆయన సమాధానాలు చెప్పేందుకు నిరాకరించినట్లు సమాచారం. దీంతో మరోసారి కస్టడీకి కోరుతూ ఉప్పర్‌పల్లి కోర్టులో పోలీసులు పిటిషన్ దాఖలు చేశారు. విచారణకు కృష్ణారెడ్డి సహకరించలేదని, మరికొన్ని కీలక విషయాలు తెలుసుకునేందుకు నిందితుడిని కస్టడీకి అప్పగించాలని పిటిషన్‌లో పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం నాడు కోర్టులో ఈ పిటిషన్ విచారణకు వచ్చే అవకాశం ఉంది.కాగా, సర్దార్ వల్లభాయ్ పటేల్ జాతీయ పోలీసు అకాడమీలో మహిళా ట్రైనీ ఐపిఎస్‌పై లైంగిక వేధింపులు, దాడికి పాల్పడ్డారన్న ఆరోపణలపై >>2




శుక్రవారం న్యూఢిల్లీలో జాతీయ చేనేత దినోత్సవాల్లో పాల్గొన్న రాష్ట్రపతి ముర్ము

# జంతర్‌మంతర్‌ను 'బందీ'ని చేయొద్దు

>> షన్‌పై విచారణ సందర్భంగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ విషయంలో జోక్యం చేసుకోవడానికి నిరాకరిస్తూ, శాంతిభద్రతలు తమ పరిధిలోకి వస్తాయి కాబట్టి ఈ విషయంపై ఢిల్లీ పోలీసులే నిర్ణయం తీసుకుంటారని కోర్టు పేర్కొంది. ఆల్ ఇండియా దళిత క్రిస్టియన్ రైట్స్ ప్రొటెక్షన్ కమిటీ (ఎడిసిఆర్‌పిసి) దాఖలు చేసిన పిటిషన్‌ను కోర్టు విచారిస్తోంది. ఈ కమిటీ తరఫున సీనియర్ న్యాయవాది సంజయ్ ఘోస్ వాదించారు. జంతర్ మంతర్ వద్ద శాంతియుత నిరసన కోసం గుమిగూడనున్న 75 మంది వ్యక్తుల బృందం కోసం అనుమతి కోరుతున్నామని, ఈ అనుమతి దరఖాస్తుపై ఢిల్లీ పోలీసులు నిర్ణయం తీసుకోవాలని మాత్రమే తాను అభ్యర్థిస్తున్నానని ఘోస్ సమర్పించారు. "నగరాన్ని బందీగా పెట్టవద్దు. ఈ విషయంపై పోలీసులను నిర్ణయం తీసుకోనివ్వండి" అని జస్టిస్ మహాజన్ వ్యాఖ్యానించారు.
తాను ప్రజాస్వామ్య నిరసనలకు వ్యతిరేకం కాదని, వాటి వల్ల సాధారణ ప్రజా జీవనం స్తంభించకూడదనే అంశాన్నే ప్రస్తావిస్తున్నానని జస్టిస్ మహాజన్ చెప్పారు. షాహీన్‌బాగ్ కేసులో సుప్రీంకోర్టు శాంతియుత నిరసన హక్కును గుర్తించిందని సంజయ్ ఘోష్ గుర్తు చేయగా.. 'అవును.. కానీ నగరాన్ని బందీగా మార్చకూడదు కదా' అని న్యాయమూర్తి వ్యాఖ్యానించారు. అనంతరం ఆల్ ఇండియా దళిత్ క్రిస్టియన్ రైట్స్ ప్రొటెక్షన్ కమిటీ దాఖలు చేసిన నిరసన అనుమతి దరఖాస్తుపై ఆగస్టు 8లోగా నిర్ణయం తీసుకోవాలని ఢిల్లీ పోలీసులను హైకోర్టు ఆదేశించింది.

# 10, 11, 12.. కీలకం

## ఆ మూడు రోజులు సభకు హాజరవ్వాల్సిందే..

## ఎంపీలకు విప్ జారీ చేసిన కాంగ్రెస్

**న్యూఢిల్లీ, ఆగస్టు 7:** పార్లమెంట్‌లో వచ్చే వారం కీలకమైన అంశాలు చర్చకు రానున్న నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ తమ ఎంపీలకు విప్ జారీ చేసింది. ఈ నెల 10, 11, 12న సభ్యులందరూ తప్పనిసరిగా సభకు హాజరుకావాలని ఆదేశించింది. రాజ్యసభ కాంగ్రెస్ చీఫ్ విప్ జైరామ్ రమేష్ తమ సభ్యులకు మూడు లైన్ల విప్ జారీ చేశారు. ఉదయం 11 గంటల నుంచి సభ ముగిసే వరకు ఉండి పార్టీ వైఖరికి మద్దతు ఇవ్వాలని అందులో పేర్కొన్నారు. లోక్‌సభలో కాంగ్రెస్ సభ్యులకు కూడా ఇదే విధమైన విప్‌ను జారీ చేశారు. వచ్చే వారం పార్లమెంట్‌లో విదేశీ విరాళాల చట్ట సవరణ బిల్లు చర్చకు వచ్చే అవకాశం ఉండటంతో కాంగ్రెస్ ఈ నిర్ణయం తీసుకుంది. నియోజకవర్గాల పునర్విభజనకి సంబంధించిన రాజ్యాంగ సవరణ బిల్లును కూడా ప్రభుత్వం సభ ముందుకు తీసుకొచ్చే అవకాశం ఉందని తెలిసింది. పార్లమెంటరీ వ్యవహారాల సహాయ మంత్రి వెల్లడించిన తాత్కాలిక ప్రభుత్వ కార్యక్రమాల జాబితాలో ఎఫ్‌సిఆర్ఎసవరణ బిల్లు, డీలిమిటేషన్‌కు సంబంధించిన మహిళా రిజర్వేషన్ బిల్లు ప్రస్తావన లేదు. మరోవైపు పార్లమెంటుకు హోంమంత్రి అమిత్ షా నిరంతరం గైర్హాజరవుతున్నారని కాంగ్రెస్ ఎంపీ కెసి వేణుగోపాల్ ఆరోపించారు. పార్లమెంటులో కార్యకలాపాలు సరిగ్గా జరగకపోవడానికి ప్రతిపక్షాలే కారణమన్న పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజును ఆయన ప్రశ్నించారు. ఈ పార్లమెంటులో అతిపెద్ద హాస్యాస్పదం కిరణ్ రిజిజు ప్రకటన. కేంద్ర హోం మంత్రి అమిత్ షాను పార్లమెంటుకు రాకుండా ఎవరు ఆపారని వేణుగోపాల్ అన్నారు. ప్రతిపక్షాల ఆటంకాలు ఉన్నప్పటికీ పార్లమెంటు సజావుగా సాగుతోందని, బిల్లులు ఆమోదం పొందుతున్నాయని కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు స్పష్టం చేశారు. కాంగ్రెస్, ఇతర ప్రతిపక్ష పార్టీల ఆటంకాలు, నినాదాల కారణంగా సభలో చర్చలు తగ్గాయని రిజిజు తెలిపారు. లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు సభను తప్పుదారి పట్టిస్తున్నారు. సభాపతి నుంచి ఎలాంటి ఆదేశం రాలేదు. నేను ఈ విషయాన్ని అధికారికంగా చెబుతున్నాను: ఉదయం పార్లమెంట్ ప్రారంభమైనప్పటి నుంచి రాత్రి ముగిసే వరకు హోం మంత్రి పార్లమెంట్‌లోనే ఉంటారు. సభ కార్యకలాపాలకు బాధ్యత వహించే మంత్రి సమాధానం ఇస్తారు.

# రైతుకు చేయూత

>> నిర్వహించాలని కలెక్టర్లను ఆదేశించారు. జిల్లా నీటిపారుదల సలహా మండలి కేవలం నీటి విడుదలలపై నిర్ణయాలు తీసుకునే వేదికలు మాత్రమే కాకుండా రైతులు ఏ పంట వేస్తే భవిష్యత్తులో నష్టపోకుండా ఉంటారో ముందుగానే తెలియజేసే బాధ్యతాయుతమైన వ్యవస్థగా పనిచేయాలని స్పష్టం చేశారు. ప్రస్తుతం ఉన్న జలాశయాల నీటి నిల్వలు, రుతుపవనాల మిగిలిన కాలంలో వర్షపాతం అంచనాలను పరిశీలిస్తే అత్యంత జాగ్రత్తతో పంటల ప్రణాళిక రూపొందించాల్సిన అవసరం ఉందన్నారు. నీటి లభ్యత తక్కువగా ఉన్న ప్రాజెక్టుల కింద రైతులు వరి వంటి అధిక నీటి అవసరమున్న పంటలను సాగు చేయవద్దని ఆయన స్పష్టంగా హెచ్చరించారు. ఆగస్టు తొలి వారంలో కురిసిన వర్షాలతో కొంత ఉపశమనం లభించినప్పటికీ, ఆ వర్షాలను ఆధారంగా చేసుకుని రైతులు వరి సాగుకు వెళ్లడం సముచితం కాదన్నారు. ఒకసారి తడిపే అవకాశం లభించినా, రెండోసారి నీరు అందించే పరిస్థితి అనిశ్చితంగా మారే అవకాశం ఉందని, ప్రస్తుతం ప్రోత్సహించి రైతులను పంట వేయించి రెండు మూడు నెలల తర్వాత ఇబ్బందులకు గురిచేయడం ప్రభుత్వ ఉద్దేశం కాదని స్పష్టం చేశారు. ప్రతి కమాండ్ ఏరియాలో ఎంత మేరకు సాగునీరు అందించగలమో, ఎక్కడ పరిమితులు ఉన్నాయో కలెక్టర్లు, నీటిపారుదల ఇంజినీర్లు, వ్యవసాయ అధికారులు రైతులకు అధికారికంగా తెలియజేయాలని సూచించారు. రాష్ట్రంలోని ప్రధాన జలాశయాల ప్రస్తుత పరిస్థితిపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని కలెక్టర్లకు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సూచించారు. ముఖ్యంగా నాగార్జునసాగర్, శ్రీరాంసాగర్ ప్రాజెక్టుల్లో నీటి మట్టాలు ఇంకా ఆశించిన స్థాయికి చేరుకోలేదని వివరించారు. స్థానిక లేదా రాజకీయ ఒత్తిళ్లకు లోనై విచక్షణారహితంగా నీటిని విడుదల చేయరాదని హెచ్చరిస్తూ, గ్రామీణ నీటి సరఫరా శాఖ ఇంజినీర్ఇన్‌చీఫ్, నీటిపారుదల శాఖ ఇంజినీర్ఇన్‌చీఫ్ ఓ.వి. రమేష్ బాబుతో సమన్వయం చేసుకుని భవిష్యత్తు తాగునీటి అవసరాలకు తప్పనిసరిగా ఎంత నీటిని నిల్వ ఉంచాలనే అంశాన్ని నిర్ణయించాలని ఆదేశించారు. అదే వీడియో కాన్ఫరెన్స్‌లో పౌర సరఫరాల శాఖ పనితీరును సమీక్షించిన మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎన్నో సంవత్సరాల అనంతరం అర్హులైన కొత్త లబ్ధిదారులను ప్రజాపంపిణీ వ్యవస్థలో చేర్చి రేషన్ కార్డుల జారీ ప్రక్రియను వేగవంతం చేసిందన్నారు. ఈ క్రమంలో సుమారు 61 లక్షల మంది కొత్త లబ్ధిదారులను చేర్చి దాదాపు 16 లక్షల కొత్త రేషన్ కార్డులు జారీ చేసినట్లు తెలిపారు. ప్రస్తుతం తెలంగాణలో సుమారు 1.06 కోట్ల రేషన్ కార్డుల ద్వారా 3.42 కోట్ల మంది లబ్ధిదారులకు ప్రజాపంపిణీ వ్యవస్థ సేవలు అందుతున్నాయని, ప్రతి నెల సుమారు 2.16 లక్షల మెట్రిక్ టన్నుల సన్నబియ్యాన్ని ఉచితంగా పంపిణీ చేస్తున్నామని పేర్కొన్నారు. గతంలో పంపిణీ చేసిన దొడ్డు బియ్యం స్థానంలో ప్రతి అర్హుడికి నెలకు ఆరు కిలోల నాణ్యమైన సన్నబియ్యాన్ని ప్రభుత్వం ఉచితంగా అందిస్తోందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా రేషన్ స్మార్ట్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని ఆగస్టు 15న సంగారెడ్డి జిల్లా కేంద్రంలో ముఖ్యమంత్రిఏ. రేవంత్ రెడ్డి అధికారికంగా ప్రారంభిస్తారని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడించారు. అదే రోజు రాష్ట్రవ్యాప్తంగా అర్హులైన లబ్ధిదారులకు రేషన్ స్మార్ట్ కార్డుల పంపిణీ కార్యక్రమం ప్రారంభమవుతుందని ఆయన తెలిపారు.

# నేతన్నకు ఏదీ భరోసా?

కెటిఆర్ గుర్తు చేశారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 55,072 మంది చేనేత కార్మికులకు రూ.5 లక్షల జీవిత బీమా కల్పిస్తూ నేతన్న బీమా అమలు చేశామని తెలిపారు. ఒక్కో కార్మికుడికి ప్రీమియం ప్రభుత్వమే భరించిందని వివరించారు. నేతన్నకు చేయూత పథకం ద్వారా కార్మికుల పొదుపును ప్రోత్సహిస్తూ, కార్మికుడు ప్రతినెల రూ.1,200, అనుబంధ కార్మికుడు రూ.800 చెల్లిస్తే ప్రభుత్వం రూ.4,000 వరకు వాటా జమ చేసే వినూత్న విధానాన్ని అమలు చేశామని తెలిపారు. అదేవిధంగా చేనేత సహకార సంఘాలకు పావలా వడ్డీ రుణాలు, 20 శాతం మార్కెటింగ్ రిబేట్ అందించడంతో పాటు బతుకమ్మ చీరలు, ప్రభుత్వ పాఠశాల యూనిఫారాల తయారీ వంటి భారీ ప్రభుత్వ ఆర్డర్లను చేనేత రంగానికే అప్పగించి వేలాది కుటుంబాలకు నిరంతర ఉపాధి కల్పించామని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కెసిఆర్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన చేనేత సంక్షేమ పథకాలను ఒక్కొక్కటిగా నిలిపివేసిందని కెటిఆర్ ఆరోపించారు. ప్రస్తుతం నేతన్న బీమా అమలు కావడం లేదని, నేతన్నకు చేయూత పథకం చెల్లింపులు పూర్తిగా ఆగిపోయాయని పేర్కొన్నారు. చేనేత సహకార సంఘాలకు ఇవ్వాల్సిన పావలా వడ్డీ రుణాలు, మార్కెటింగ్ రిబేట్లు నిలిచిపోయాయని, బతుకమ్మ చీరలు, ప్రభుత్వ యూనిఫారాల వంటి ప్రభుత్వ ఆర్డర్లలో నేతన్నలకు గతంలో ఇచ్చిన ప్రాధాన్యతను తగ్గించారని విమర్శించారు. నేతన్నల కోసం గత ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలన్నీ ఏమయ్యాయనీ కెటిఆర్ ప్రశ్నించారు.
చేనేత భరోసా కింద ప్రతి యేడాది రూ.18 వేల ఆర్థిక సాయం, అనుబంధ కార్మికులకు రూ.6 వేల సహాయం, లక్ష రూపాయల వరకు వ్యక్తిగత రుణమాఫీ, చేనేత సహకార సంఘాల క్యాష్ క్రెడిట్ రుణాల మాఫీ, కేంద్రం విధిస్తున్న 5 శాతం జీఎస్టీ భారాన్ని రాష్ట్ర ప్రభుత్వమే భరిస్తుందన్న హామీల్లో ఒక్కటీ అమలు కాలేదని విమర్శించారు. రెండున్నరేళ్లు గడిచినా నేతన్నలకు ఇచ్చిన హామీలు కాగితాలకే పరిమితమయ్యాయని మండిపడ్డారు.
కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కూడా చేనేత రంగానికి తీవ్ర అన్యాయం చేసిందని కెటిఆర్ విమర్శించారు. ఆల్ ఇండియా హ్యాండ్లూమ్ బోర్డు, హ్యాండీక్రాఫ్ట్స్ బోర్డు, పవర్‌లూమ్ బోర్డులను రద్దు చేయడం, హౌస్ కమ్ వర్క్‌షెడ్ వంటి పథకాలను ఎత్తివేయడం, చేనేత ఉత్పత్తులపై 5 శాతం జిఎస్టీ విధించడం వంటి నిర్ణయాలు చేనేత రంగాన్ని తీవ్రంగా దెబ్బతీశాయని పేర్కొన్నారు. పార్టీలు వేరైనా చేనేత విషయంలో కేంద్రంలోని బిజెపి, రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వాల వైఖరిలో ఎలాంటి తేడా లేదని ఆరోపించారు.



భారీ వర్షాల కారణంగా హిమాచల్‌ప్రదేశ్‌లోని కులూలో బియాస్ నదికి పోటెత్తిన వరద

## తెలంగాణకు తక్షణమే డిఎపి

# ఎరువులను సరఫరా చేయండి

## కేంద్ర మంత్రి జెపి నడ్డాతో తెలంగాణ కాంగ్రెస్ ఎంపీల భేటీ

**హైదరాబాద్, ఆగస్టు 7,ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రంలోని రైతులకు తక్షణమే తగినంత పరిమాణంలో డిఎపి ఎరువులను సరఫరా చేయాలని మల్లు రవి నాయకత్వంలో కాంగ్రెస్ ఎంపిలు శుక్రవారం న్యూఢిల్లీలోని పార్లమెంట్ భవనంలో కేంద్ర రసాయనాలు, ఎరువుల శాఖ మంత్రి జగత్ ప్రకాష్ నడ్డాను కలిసి డిమాండ్ చేశారు. ఎంపిలు మల్లు రవి, సురేష్‌లు ఎరువుల సరఫరా సాఫీగా జరగకపోవడంతో రైతులు ఇబ్బంది పడుతున్నారని వారికి వినతిపత్రం సమర్పించారు. రాష్ట్రంలో ప్రస్తుతం వ్యవసాయ సీజన్ జోరుగా సాగుతున్నందున, పంటలకు కీలకమైన డిఎపి ఎరువుల కొరత ఏర్పడకుండా తగినంత లభ్యత ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు. తెలంగాణకు చెందిన ఎంపి లందరూ సంతకాలు చేసిన ప్రతిపాదన పత్రాన్ని కేంద్ర మంత్రికి అందజేశారు. ఈ వినతిపై స్పందించిన కేంద్ర మంత్రి జెపి నడ్డా సానుకూలంగా సమాధానమిచ్చారు. తెలంగాణలోని రైతాంగ అవసరాలను దృష్టిలో ఉంచుకుని, డిఎపి సరఫరా అంశాన్ని ప్రాధాన్యతా క్రమంలో పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని ఎంపిల బృందానికి హామీ ఇచ్చారు.

# ఎన్‌కౌంటర్ చేస్తానన్నారు..

>> కృష్ణారెడ్డిపై కేసులు నమోదు అయ్యాయి. అత్తాపూర్ పోలీసులు ఆయనపై భారతీయ న్యాయ సంహిత (బిఎన్ఎస్), ఐటీ చట్టం కింద కేసులు నమోదు చేశారు. విచారణలో భాగంగా కృష్ణారెడ్డిని తమకు రెండు రోజుల పాటు కస్టడీకి ఇవ్వాలని ఉప్పర్‌పల్లి కోర్టులో పోలీసులు ఇటీవల పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారణ జరిపిన న్యాయస్థానం గత బుధవారం కస్టడీకి అనుమతించింది. కోర్టు ఆదేశాల మేరకు గురు, శుక్రవారాల్లో అత్తాపూర్ పోలీస్ స్టేషన్, ఉమెన్ సేఫ్టీ వింగ్ అధికారుల పర్యవేక్షణలో విచారణ జరిగింది. ట్రైనీ ఐపిఎస్ ఉదయ్‌కృష్ణారెడ్డి పోలీసు కస్టడీ పూర్తయింది. దీంతో పోలీసులు ఉప్పరపల్లి కోర్టులో ప్రవేశపెట్టి న్యాయమూర్తి ఆదేశాల మేరకు చర్లపల్లి జైలుకు తరలించారు. లైంగిక వేధింపుల కేసులో ఉదయ్‌కృష్ణారెడ్డిని పోలీసులు 2రోజుల పాటు విచారించారు. అయితే, కృష్ణారెడ్డి సహకరించకపోవడంతో పోలీసులు మరోసారి కోర్టును ఆశ్రయించారు. కాగా, తొలి రోజు మహిళా ట్రైనీ ఐపిఎస్‌తో పరిచయం, వేధింపులు, కేసు పరిణామాలపై ప్రశ్నలు అడిగారు.
బాధితురాలితో సన్నిహిత సంబంధం ఉందని పోలీసులకు ఉదయ్ చెప్పినట్లు తెలిసింది. మరొకరిని పెళ్లి చేసుకోవడాన్ని సహించలేకే అలా చేశానని ఉదయ్ కృష్ణారెడ్డి చెప్పినట్లు సమాచారం. మరిన్ని ప్రశ్నలు అడగ్గా తనను ఎందుకు విసిగిస్తున్నారని విచారణ అధికారులనే ఉదయ్ ప్రశ్నించినట్లు తెలిసింది. ఇదిలా ఉండగా, రెండు రోజుల కస్టడీ ముగియడంతో అత్తాపూర్ పోలీసులు ఆయనను శుక్రవారం ఉప్పరపల్లి మేజిస్ట్రేట్ ఎదుట హాజరుపరుచగా, ఈ సందర్భంగా కోర్టు హాలులోనే ఉదయ్ కృష్ణారెడ్డి బోరున విలపించారు. సిపి సజ్జనార్‌పై ఆయన మేజిస్ట్రేట్‌కు రాతపూర్వకంగా పిర్యాదు చేశారు.
విచారణ పేరుతో తనను సిపి సజ్జనార్ తీవ్రంగా బెదిరించారని 'నిన్ను ఎన్‌కౌంటర్ చేస్తా' అంటూ అభ్యంతకర వ్యాఖ్యలు చేశారని ఉదయ్ ఆరోపించారు. న్యాయస్థానానికి సమర్పించిన ఫిర్యాదులో ఉదయ్ పలు కీలక అంశాలను పేర్కొన్నారు. నన్ను సిసి కెమెరాలు లేని చోటుకు తీసుకెళ్లి విచారించారు. టాస్క్‌ఫోర్స్ ఆఫీసులో ఉంచి తీవ్రంగా హింసించారు అని వాపోయారు. నిందితుడి ఆరోపణలను తీవ్రంగా పరిగణించిన మేజిస్ట్రేట్ సిసి కెమెరాలు లేని చోట విచారణ ఎలా జరుపుతారంటూ పోలీసులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఘటనపై రెండు రోజుల్లోగా పూర్తి విచారణ ఇవ్వాలంటూ అత్తాపూర్ ఇన్‌స్పెక్టర్‌కు కోర్టు షోకాజు నోటీసులు జారీ చేసింది.

## మొజ్తబ ఖమేనీ ఆరోగ్యంపై తీవ్ర ఊహాగానాలు..

**టెహ్రాన్,ఆగస్టు 7:** ఇరాన్ సుప్రీం లీడర్ మోజ్తబా ఖమేనీ ఆరోగ్య పరిస్థితి అత్యంత విషమంగా ఉందని, ఆయనను ఆస్పత్రికి తరలించినట్లు ఇజ్రాయెల్ మీడియా కథనాలు వెల్లడించాయి. అయితే ఈ వార్తలను ఇరాన్ అధికారికంగా ధ్రువీకరించలేదు. ఇజ్రాయెల్‌కు చెందిన ఛానల్ 14 ఇరాన్‌లోని తమ వర్గాలను ఉటంకిస్తూ, దేశంలోని ఉన్నత రాజకీయ వర్గాల్లో ఖమేనీ ఆరోగ్య పరిస్థితిపై తీవ్ర ఆందోళన నెలకొందని తెలిపింది. ఆయన పరిస్థితి అత్యంత విషమంగా ఉందన్న ప్రచారం జరుగుతోందని పేర్కొంది. ఇదే తరహాలో గతంలో జెరూసలెం పోస్ట్ కూడా ఇరాన్‌వైర్ కథనాన్ని, అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్ ప్రభుత్వానికి సన్నిహిత వర్గాలను ఉటంకిస్తూ వార్తను ప్రచురించింది. త్వరలో ఆయన మరణించినట్లు వార్త విన్నా ఆశ్చర్యపోం అని ఓ వర్గం జెరూసలెం పోస్ట్‌తో పేర్కొన్నట్లు సమాచారం. 2026 ఫిబ్రవరి 28న జరిగిన అమెరికాఇజ్రాయెల్ సంయుక్త సైనిక దాడుల్లో తన తండ్రి మరణించిన అనంతరం మోజ్తబా ఖమేనీ ఇరాన్ సుప్రీం లీడర్‌గా బాధ్యతలు చేపట్టినప్పటినుంచి ఆయన బహిరంగంగా కనిపించలేదు. కేవలం రాతపూర్వక ప్రకటనల ద్వారానే సందేశాలు వెలువరిస్తున్నారు. తన తండ్రి నివాస సముదాయంపై జరిగిన దాడుల్లో మోజ్తబా ఖమేనీ తీవ్రంగా గాయపడ్డారని, దీంతో ఆయన బహిరంగ కార్యక్రమాలకు దూరంగా ఉంటూ ఉన్నతాధికారులతో మధ్యవర్తుల ద్వారా సమాచారాన్ని చేరవేస్తున్నారని గతంలో పలు కథనాలు వెలువడ్డాయి. అయితే ఈ వాదనలకు స్వతంత్ర ధ్రువీకరణ లభించలేదు. ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్ ఇటీవల ప్రభుత్వ టెలివిజన్ ఇంటర్వ్యూలో ఖమేనీతో ప్రత్యక్షంగా సంప్రదింపులు జరపడం "చాలా కష్టంగా మారింది" అని పేర్కొన్నట్లు సమాచారం. దీంతో ఆయన ఆరోగ్యం, ఆచూకీపై ఊహాగానాలు మరింత పెరిగాయి.

# ఇక అధికారం బిజెపికే

>> ఉన్నారని, సరైన సమయం చూసుకుని వారంతా పార్టీలోకి వస్తారని స్పష్టం చేశారు. రాబోయే డీలిమిటేషన్ తర్వాత స్థానాలు పెరిగినప్పటికీ, బిజెపి తెలంగాణలో మెజారిటీ సాధించి ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. 2014 తర్వాత బెంగాల్, ఒడిశా వంటి రాష్ట్రాల్లో తొలిసారి అధికారం సాధించి, బలమైన శక్తిగా ఎదిగామో, ఆ రాష్ట్రాల కంటే తెలంగాణలో సంస్థాగతంగా బిజెపి చాలా బలంగా ఉందని ఆయన పేర్కొన్నారు. తెలంగాణలో అధికారమే లక్ష్యంగా పనిచేయాలని, ముఖ్యంగా రాష్ట్రంలోని అన్ని మండలాల్లో క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతం దిశగా విస్తృతంగా పనిచేయాలని నితిన్ నబిన్ స్పష్టమైన మార్గనిర్దేశం చేశారని తెలిపారు. సెప్టెంబర్ నెలలో నోటిఫికేషన్ వచ్చే అవకాశం ఉన్న గ్రాడ్యుయేట్ ఎన్నికలపై ఉన్నత స్థాయి సమావేశంలో చర్చించామని రాంచందర్ రావు వెల్లడించారు. వరంగల్-ఖమ్మం-నల్గొండ, హైదరాబాద్-రంగారెడ్డి-మహబూబ్‌నగర్ పట్టభద్రుల (గ్రాడ్యుయేట్) నియోజక వర్గాల స్థానాలను బిజెపి కైవసం చేసుకునేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని తెలిపారు. జీహెచ్ఎంసీ ఎన్నికల్లో బిజెపి ఎవరితోనూ పొత్తు పెట్టుకోదని, ఒంటరిగానే పోటీ చేస్తుందని స్పష్టం చేశారు. జనసేన వంటిపార్టీలు జాతీయ స్థాయిలో ఎన్డీయేలో భాగస్వామిగా ఉన్నందున జాతీయ స్థాయి నాయకత్వం నిర్ణయిస్తుందని, తెలంగాణలో మాత్రం ఏ పార్టీతోనూ పొత్తు ఉండదని తేల్చిచెప్పారు.
మహిళా రిజర్వేషన్లు, డీలిమిటేషన్ బిల్లులు పార్లమెంటులో ఖచ్చితంగా ఆమోదం పొందుతాయని, కాంగ్రెస్ పార్టీలో ఉన్న డీలిమిటేషన్ మద్దతుదారులు కూడా వీటికి అనుకూలంగా ఓటు వేసే అవకాశం ఉందన్నారు. భారతీయ జనతా పార్టీ నాయకుల మధ్య ఎలాంటి విభేదాలు లేవని, చిన్న చిన్న అభిప్రాయ భేదాలు ఉంటే కూర్చొని చర్చించుకుని పరిష్కరించుకుంటామని రాంచందర్ రావు తెలిపారు. ప్రస్తుతం ఈ నెల 10వ తేదీ వరకు ఎస్ఐఆర్ కార్యక్రమం జరుగుతున్నందున ఇతర కార్యక్రమాలను వేగవంతం చేయలేకపోయామని, అయినప్పటికీ జిల్లా ఎగ్జిక్యూటివ్ మీటింగ్స్, స్టేట్ లెవల్ మీటింగ్స్ విజయవంతంగా నిర్వహించామని చెప్పారు. రాష్ట్రంలోని రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన గ్యారెంటీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని మండిపడ్డారు. ప్రజా సమస్యలపై నిరంతరం ప్రజా పోరాటాలు చేయడమే బిజెపికి నిజమైన రోడ్ మ్యాప్ అని నితిన్ నబిన్ స్పష్టం చేశారని తెలిపారు.
రాబోయే రోజుల్లో ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కోర్ కమిటీ సభ్యులతో చర్చించి పాదయాత్రలు, బస్సు యాత్రలు వంటి ప్రజా చైతన్య కార్యక్రమాలను రూపొందించి ప్రజల్లోకి మరింత విస్తృతంగా వెళ్తామని వెల్లడించారు. ఢిల్లీలోని బిజెపి కేంద్ర కార్యాలయంలో జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ అధ్యక్షతన తెలంగాణ ప్రాంత నాయకులతో సమీక్షా సమావేశం జరిగింది. ఈ భేటీలో బిజెపి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రాంచందర్ రావు, కేంద్రమంత్రులు జి. కిషన్ రెడ్డి, బండి సంజయ్ కుమార్, బిజెపి ఓబిసి మోర్చా జాతీయ అధ్యక్షులు బిజెపి పార్లమెంటరీ బోర్డు సభ్యులు డాక్టర్ కె లక్ష్మణ్, రాష్ట్ర ఇంఛార్జ్ అభయ్ పాటిల్, బిజెపి రాష్ట్ర సంస్థాగత ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ తివారీ పార్టీ ఎంపీలు, ముఖ్య నాయకులు పాల్గొన్నారు. తెలంగాణలో పార్టీ బలోపేతం, క్షేత్రస్థాయి పటిష్టత, మరియు రాబోయే ఎన్నికల్లో బిజెపి అధికారంలోకి రావడానికి అనుసరించాల్సిన రాజకీయ కార్యాచరణపై జాతీయ నాయకత్వం దిశానిర్దేశం చేసింది. రాష్ట్రంలో పార్టీ సంస్థాగతంగా బలంగా ఉందని సమావేశంలో నితిన్ నబీన్ పేర్కొన్నారు.

# ప్రసవాలు

>> త్రుల్లో 39,181 ప్రసవాలు జరగగా, కేవలం 5,048 మాత్రమే సాధారణ ప్రసవాలు, 34,133 సిజేరియన్ ప్రసవాలు నమోదయ్యాయి. అంటే ప్రైవేట్ ఆసుపత్రుల్లో సిజేరియన్ శాతం 87.1 శాతానికి చేరుకుంది.
2017-18లో ప్రభుత్వ ఆసుపత్రుల్లో 4,675 ప్రసవాల్లో 3,117 సిజేరియన్‌లు నమోదవగా, అదే యేడాది ప్రైవేట్ ఆసుపత్రుల్లో 3,322 ప్రసవాల్లో 2,704 సిజేరియన్‌లు జరిగాయి. 2018-19లో ప్రభుత్వంలో 4,405 ప్రసవాల్లో 3,267 సిజేరియన్‌లు, ప్రైవేట్‌లో 3,315 ప్రసవాల్లో 2,786 సిజేరియన్‌లు నమోదయ్యాయి. 2019-20లో ప్రభుత్వంలో 4,200 ప్రసవాల్లో 2,588 సిజేరియన్‌లు, ప్రైవేట్‌లో 4,250 ప్రసవాల్లో 3,649 సిజేరియన్‌లు జరిగాయి. 2020-21లో ప్రభుత్వ ఆసుపత్రుల్లో 3,788 ప్రసవాల్లో 2,341 సిజేరియన్‌లు నమోదుకాగా, ప్రైవేట్ ఆసుపత్రుల్లో 5,302 ప్రసవాల్లో అత్యధికంగా 4,752 సిజేరియన్‌లు జరిగినట్లు గణాంకాలు సూచిస్తున్నాయి. 2021-22లో ప్రభుత్వంలో 3,388 ప్రసవాల్లో 2,211 సిజేరియన్‌లు, ప్రైవేట్‌లో 5,688 ప్రసవాల్లో 5,147 సిజేరియన్‌లు నమోదయ్యాయి. 2022-23లో ప్రభుత్వంలో 3,552 ప్రసవాల్లో 2,015 సిజేరియన్‌లు, ప్రైవేట్‌లో 4,703 ప్రసవాల్లో 4,173 సిజేరియన్‌లు జరిగాయి.
అయితే 2023-24 నుంచి ప్రభుత్వ ఆసుపత్రుల్లో సాధారణ ప్రసవాల సంఖ్య పెరగడం గమనార్హం. 3,368 ప్రసవాల్లో 1,830 సాధారణ ప్రసవాలు, 1,538 సిజేరియన్‌లు నమోదయ్యాయి. 202425లో 2,469 ప్రసవాల్లో 1,379 నార్మల్ డెలివరీలు, 1,090 సిజేరియన్‌లు జరిగాయి. 2025-26లో 3,168 ప్రసవాల్లో 1,445 నార్మల్, 1,723 సిజేరియన్‌లు నమోదయ్యాయి. అయినప్పటికీ ప్రైవేట్ ఆసుపత్రుల్లో మాత్రం పరిస్థితిలో పెద్దగా మార్పు కనిపించలేదు. 2023-24లో 3,862 ప్రసవాల్లో 3,223 సిజేరియన్‌లు, 2024-25లో 4,040 ప్రసవాల్లో 3,515 సిజేరియన్‌లు, 202526లో 4,874 ప్రసవాల్లో 4,360 సిజేరియన్‌లు నమోదయ్యాయి.
వైద్య నిపుణుల సూచనల ప్రకారం తల్లి లేదా శిశువు ఆరోగ్యానికి ప్రమాదం ఉన్నప్పుడే సిజేరియన్ చేయాలి. అయితే జిల్లాలోని కొన్ని ప్రైవేట్ ఆసుపత్రుల్లో గర్భిణులను, వారి కుటుంబ సభ్యులను భయపెట్టి, అత్యవసర పరిస్థితి పేరుతో శస్త్రచికిత్సలకు ఒప్పించి భారీబిల్లులు వసూలుచేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. సాధారణ ప్రసవానికి బదులుగా సిజేరియన్ చేయడంతో కుటుంబాలపై లక్షల రూపాయల అదనపు భారం పడుతోందని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ సూచించే సురక్షిత ప్రమాణాలను మించి జిల్లాలో సిజేరియన్‌లు నమోదవుతున్న నేపథ్యంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ప్రత్యేక ఆడిట్ నిర్వహించి ప్రతి సిజేరియన్ కేసును సమీక్షించాలని, అవసరం లేని శస్త్రచికిత్సలకు పాల్పడుతున్న ఆసుపత్రులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజాసంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. ప్రసూతి వైద్యం సేవా రంగంగానే కొనసాగాలని, లాభాపేక్షకు వేదిక కాకూడదని ప్రజలు కోరుతున్నారు. అధికారిక గణాంకాలు బయటపెట్టిన ఈ వాస్తవాలు జిల్లాలో ప్రసూతి వైద్య సేవలపై సమగ్ర విచారణ అవసరాన్ని స్పష్టంగా సూచిస్తున్నాయి.

# ఉచితాలు

>> న్మెంట్ బోర్డుకు చెల్లించాల్సిన రూ.33 కోట్ల బకాయిల వ్యవహారంలో నమోదైన కేసులో తెలంగాణ రాష్ట్ర ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియాపై కోర్టు ధిక్కరణ చర్యల కింద అరెస్ట్ చేయాలంటూ హైకోర్టు అరెస్ట్ వారెంట్ జారీ అయిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో పోలీసులు ఆయనను తెలంగాణ హైకోర్టు ధర్మాసనం ఎదుట హాజరుపరిచారు. న్యాయస్థానం ఇచ్చిన స్పష్టమైన ఉత్తర్వులను సైతం లెక్కచేయకుండా ప్రవర్తించడం ఏంటని ధర్మాసనం సందీప్ కుమార్ సుల్తానియాను ప్రశ్నించింది. ఈ క్రమంలోనే ఆయన కోర్టుకు సమాధానమిస్తూ కంటోన్మెంట్ బోర్డుకు కేటాయించాల్సిన నిధుల్లో కొన్నింటిని ఇప్పటికే విడుదల చేశామని, మిగతా నిధులను పలు విడతల్లో త్వరలోనే విడుదల చేస్తామని కోర్టుకు విన్నవించారు. అనంతరం ధర్మాసనం మరో ఉచితాలకు సంబంధించిన విచారణ సందర్భంగా స్పందిస్తూ సంచలన వ్యాఖ్యలు చేసింది. ఉచిత పథకాలను కోటీశ్వరులు కూడా పొందుతున్నారని, రైతుబంధు వంటి పథకాల వల్ల ఎంతోమంది ధనికులు లబ్ధి పొందుతుండటంతో రాష్ట్ర ప్రభుత్వంపై విపరీతమైన ఆర్థిక భారం పడుతోందని పేర్కొంది. ఉచిత పథకాల కారణంగా పల్లెటూర్లలో పనిచేయడానికి కూలీలు దొరకని పరిస్థితి ఏర్పడిందని, రైతుల స్థితి ఘోరంగా తయారైందని తెలిపింది. ఉచితంగా లభిస్తుండటంతో నేనెందుకు పనిచేయాలనే అభిప్రాయానికి ప్రజలు వస్తున్నారని, ఇదే పరిస్థితి కొనసాగితే ఒకప్పుడు మనుషులు స్వయంగా పనిచేసేవారట అని చెప్పుకునే రోజులు వచ్చినా ఆశ్చర్యం లేదని పేర్కొంది. ప్రభుత్వాలు ఉచితాలను ఇలాగే ఇస్తూ పోతే చివరకు కుబేరుడి వద్ద ఉన్న ధనమంతా అయిపోయి, ఆయన కూడా పనికి ఆహార పథకం కింద కూలీకి రావాల్సిన పరిస్థితి వస్తుందని హెచ్చరించింది. కోటి 15 లక్షల కుటుంబాలకు ఉచిత పథకాలు ఇస్తే దేశాన్ని ఎలా నడుపుతారని ప్రశ్నించిన ఆయన, విద్యార్థులకు ఫీజుల చెల్లింపులోనూ అర్హులైన, బాగా చదువుకునే వారికి మాత్రమే ప్రభుత్వం ఆర్థిక సాయం అందించాలని సూచించింది. ఒకప్పుడు ఈ దేశానికి మనం ఏమి ఇచ్చామని ఆలోచించే వాళ్లమని, గాంధీ, నెహ్రూ, ప్రకాశం పంతులు వంటి మహనీయులను చూసి దేశానికి ఏదో ఒకటి చేయాలని తపించేవారని గుర్తుచేసింది. కానీ నేడు పరిస్థితులు మారిపోయి, ఈ దేశం మనకేమిచ్చింది లేదా నాకేమిచ్చారనే ధోరణి పెరిగిపోయిందని వ్యాఖ్యానించింది. అలాగే ప్రభుత్వాలు చేసే తప్పిదాల వల్ల ఉన్నతాధికారులు బలి అవుతున్నారని న్యాయమూర్తి వ్యాఖ్యానించారు. ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శిగా ఉన్నందుకే సందీప్ సుల్తానియాపై ఏకంగా 3 వేల నుంచి 4 వేల కేసులు నమోదు కావడం, వందకు పైగా కోర్టు ధిక్కరణ కేసులు పెండింగ్‌లో ఉండటంపై విచారం వ్యక్తం చేసింది. ఈ లెక్కన చూస్తే ఆయన జీవితకాలం జైల్లోనే ఉండాల్సి వస్తుందని, మీరు ముఖ్యమంత్రి అయితే ఈ కేసులపై ఏం చేస్తారని ప్రభుత్వ న్యాయవాదిని ప్రశ్నించింది. సందీప్ సుల్తానియా మంచి అధికారే అయినప్పటికీ, తప్పనిసరి పరిస్థితుల్లోనే కోర్టుకు పిలిపిస్తున్నామని తెలిపింది. ప్రభుత్వం చేస్తున్న కొన్ని పొరపాట్లు, తప్పుల వల్ల బాధ్యతాయుతమైన ఉన్నతాధికారులు ఇలాంటి కోర్టు ధిక్కరణ కేసులను ఎదుర్కోవాల్సి వస్తోందని.. భవిష్యత్తులో ఇలా పునరావృతం కాకుండదని మొట్టికాయలు వేసింది.

**హైకోర్టు చేసిన కీలక వ్యాఖ్యలు..**

అధికారులను పదే పదే కోర్టుకు పిలిపించడం బాధాకరమని, ఆర్థికశాఖ ముఖ్య కార్యదర్శిగా ఉన్న సందీప్ కుమార్ సుల్తానియాపై ఎన్నో కోర్టు ధిక్కరణ పిటీషన్లు ఉన్నాయని ధర్మాసనం పేర్కొంది. ఆయనపై ఉన్న అన్ని కోర్టు ధిక్కరణ కేసుల్లో శిక్ష విధిస్తే ఆయన జీవితకాలం జైలులోనే గడపాల్సి వస్తుందని వ్యాఖ్యానించింది. ప్రభుత్వాలు చేసే పొరపాట్లు, తప్పుల వల్ల బాధ్యతాయుతమైన అధికారులు కోర్టు ధిక్కరణ కేసులు ఎదుర్కోవాల్సి వస్తోందని న్యాయమూర్తి అభిప్రాయపడ్డారు. 'రైతుబంధు' మంచి పథకమే అయినప్పటికీ, సరైన వర్గీకరణ లేకపోవడం వల్ల కోటీశ్వరులు కూడా లబ్ధి పొందుతున్నారని వ్యాఖ్యానించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు కేవలం అర్హులకు మాత్రమే అందాలని, సమాజంలో ఎందరో అనర్హులు ఈ పథకాల ప్రయోజనాలు పొందుతున్నారని వ్యాఖ్యానించారు. కాగా, ఇప్పటికే రూ.25 కోట్లను కంటోన్మెంట్ బోర్డుకు విడుదల చేశామని మిగతా మొత్తం విడతల వారీగా విడుదల చెల్లిస్తామని కోర్టుకు తెలిపారు. అఫిడవిట్ దాఖలు చేయాలంటూ హైకోర్టు తదుపరి విచారణను ఈనెల 19వ తేదీకి వాయిదా వేసింది.

## వారం - వర్జ్యం

08-08-2026, శనివారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
ఆషాఢ మాసం, దక్షిణాయణం,
గ్రీష్మ ఋతువు, కృష్ణపక్షం, ఆశ్లేషకార్తె,
తి.దశమి మ.1.57 న.రోహిణి సా.4.49
వ.1. ఉ.9.26-ఉ.10.54
వ.2. రా.9.55-రా.11.23
దు.తె.5.49-ఉ.7.28
రాహు.ఉ.9.00-ఉ.10.30,
శుభ ఉ.7.00-8.00

## వార్తాఫలం

**మేషం :** ఎంతో కాలముగా వాయిదా పడుతున్న విషయములు పరిష్కారమవుతాయి. వస్తు కొనుగోలు.

**వృషభం :** విద్యా వాణిజ్య రంగములలో, ఆర్థిక విషయాలలో ప్రోత్సాహకర వాతావరణము సమకూరుతుంది.

**మిథునం :** విరాళములు, చందాలు, ఋణాలు, పన్నులు వీటి విషయాలలో ఒత్తిడి రావచ్చు. ప్రయాణాలు లాభిస్తాయి.

**కర్కాటకం :** అతిథి మర్యాదలకు అధిక ఖర్చులు చేస్తారు. సన్నిహితుల నుండి రహస్య సమాచారము అందుకుంటారు.

**సింహం :** మీ కార్యక్రమములకు, సంతానము యొక్క అభివృద్ధికి ఆటంకములను కల్పించే యత్నములు జరుగును.

**కన్య :** ముఖ్యముగా మీ ప్రతిష్ఠను దెబ్బతీసే యత్నములు అధికము కావచ్చును. విందు, వినోదాలలో పాల్గొంటారు.

**తుల :** ఆత్మీయులు, శ్రేయోభిలాషులతో కలిసి ఆనందంగా గడుపుతారు. ఇంటా బయటా అనుకూలము.

**వృశ్చికం :** ప్రయోజనములు తాత్కాలికముగా మీ చేతికి అందకపోయినా ఉనికికి మాత్రము ముప్పు లేదు.

**ధనుస్సు :** ఋణ సంబంధమైన చికాకులు తీరతాయి. కోర్ట్ వ్యవహారములు మీకే అనుకూలము. కాంట్రాక్ట్లు లభిస్తాయి.

**మకరం :** బంధువులకు సంబంధించిన కొన్ని వ్యవహారములను పర్యవేక్షించవలసి వస్తుంది. ఇంటా బయటా అనుకూలం.

**కుంభం :** గృహములోని ఖర్చులను తగ్గించుటకు చేసే యత్నములు అనుకూలించవు. ప్రముఖులతో పరిచయాలు ఏర్పడతాయి.

**మీనం :** మీతో విభేదించి సోదర వర్గీయుల నుండి, సన్నిహితుల నుండి వినూత్న రీతిలో రాజీ యత్నములు వస్తాయి.

-శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

## మత్స్య శాఖ అధికారి భాస్కర్‌నాయక్ సస్పెన్షన్

**మహబూబాబాద్ ప్రతినిధి,ప్రభాతవార్త:** మహబూబాబాద్ జిల్లాలో మత్స్యశాఖ అధికారి భాస్కర్‌నాయక్ ప్రభుత్వ నిధుల దుర్వినియోగానికి పాల్పడడంతో సస్పెన్షన్‌కు గురయ్యారు. జిల్లా మత్స్యశాఖ అధికారి నిధుల, అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారని మహబూబాబాద్ జిల్లాకు చెందిన ఎఫ్‌సిఎస్ సభ్యులు గత నెల జూలై 25న ఇచ్చిన ఫిర్యాదుతో వాటిపై వాస్తవాలను నిర్ధారించేందుకు జూలై 29న విచారణాధికారిగా మత్స్యశాఖ జాయింట్ డైరెక్టర్ ఆర్.లక్ష్మీనారాయణను నియమించారు. సంబంధిత దస్త్రాలను, అధికారి ఇచ్చిన లిఖితపూర్వక వివరణలను పరిశీలించిన అనంతరం ఆగస్టు 5న విచారణ నివేదిక సమర్పించారు. ఆ నివేదిక ఆధారంగానే శాఖ ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారు. అలాగే ముందస్తు అనుమతి లేకుండా వాహన అద్దె వార్లలను విడుదల చేసిన ఆరోపణ కూడా కొంతమేరకు రుజువైనట్లు నివేదిక వెల్లడించిన నేపథ్యంలో తీవ్రమైన ఆర్థిక అవకతవకలు, ఆర్థిక నిబంధనల ఉల్లంఘన, అధికార దుర్వినియోగం జరిగినట్లు నివేదికలో పేర్కొన్నారు. తెలంగాణ సివిల్ సర్వీసెస్ (సీసీఏ)1991 నిబంధనల మేరకు పట్టం8(8) ప్రకారం ఈ సస్పెన్షన్ తక్షణమే అమల్లోకి వచ్చినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ క్రమంలో సూర్యాపేటలో విధులు నిర్వహిస్తున్న ఏడీఎఫ్/ డీఎఫ్ఓ డి.అంజనేయస్వామికి మహబూబాబాద్ డీఎఫ్ఓగా ఎఫ్ఏసీ బాధ్యతలు అప్పగించారు.



సమావేశంలో నినాదాలు చేస్తున్న అసోసియేషన్ ప్రతినిధులు

## రైస్ మిల్లర్లపై విజిలెన్స్ దాడులు ఆపాలి

### సమస్యలకు పరిష్కారానికి నిపుణుల కమిటీ వేయాలి

### సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ కార్యవర్గసభ్యుడు రఫీ డిమాండ్

**హైదరాబాద్ (సైఫాబాద్), ఆగస్టు 7, ప్రభాతవార్త:** రాష్ట్రంలో అన్యాయంగా రైస్ మిల్లర్లపై కొనసాగుతున్న విజిలెన్స్ దాడులు, పోలీస్ చర్యలను వెంటనే నిలిపివేసి, వారి సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ఒక కమిటీని వేయాలని సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ కార్యవర్గ సభ్యుడు సయ్యద్ రఫీ, తెలంగాణ రాష్ట్ర రా రైస్ మిల్లర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రఫీ, అసోసియేషన్ నాయకులతో కలిసి మాట్లాడుతూ రైస్ మిల్లర్లను నేరస్తులుగా చూడకుండా వారి సమస్యలను పరిష్కరించాలని, వ్యవసాయానికి అనుబంధంగా ఉన్నా రైస్ మిల్లులను కాపాడాలని, లేకపోతే వ్యవసాయరంగం తీవ్రంగా నష్టపోతుందన్నారు. మూడు దశాబ్దాల నాటి 67 శాతం బియ్యం రికవరి ప్రమాణాలను కొనసాగించడం సరికాదని, రబీ, ఖరీఫ్ సిజన్లకు అనుగుణంగా ప్రతి జిల్లాలో టెస్ట్ మిల్లింగ్ నిర్వహించి వాస్తవ రికవరీ ఆధారంగా బియ్యం స్వీకరించాలని ఆయన సూచించారు. ఈ నెల 15వ తేదీలోగా ప్రభుత్వం మిల్లర్లతో సమావేశం నిర్వహించి, సమస్యలను పరిష్కరించాలని, ఇందుకు అవసరమైన నిపుణుల కమిటీని నియమించాలని ఆయన డిమాండ్ చేశారు. సమావేశంలో అసోసియేషన్ ప్రతినిధులు కరుణాకర్‌రెడ్డి, ధనలక్ష్మి, నాగరాజు, బుచ్చిరాములు, సత్యనారాయణ, చొక్కారెడ్డి, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## 13న కెఆర్ఎంబి త్రిసభ్య సమావేశం

**హైదరాబాద్, ఆగస్టు 7,ప్రభాతవార్త:** కృష్ణానది యాజమాన్య బోర్డు త్రిసభ్య సమావేశం ఈ నెల 13న కెఆర్ఎంబి మెంబర్ సెక్రటరీ సతీష్‌కాంబోజి కార్యాలయంలో ఏర్పాటు చేశారు. తెలంగాణ కాడా ఇన్ఎస్‌సి, ఆంధ్రప్రదేశ్ వాటర్ రిజర్వాయర్ డిపార్టుమెంట్ ఇఎన్‌సిలు హాజరుకావాలని కెఆర్ఎంబి సెక్రటరీ కాంబోజి సతీష్ మీటింగ్ నోటిసులు పంపారు. ఉమ్మడి రాష్టానికి చెందిన శ్రీశైలం, నాగార్జునసాగర్‌లో అందుబాటులో ఉన్న నీరు ఇరు రాష్ట్రాల అవసరాలు లెక్కించి దామాషా పద్ధతిలో నీటి పంపిణీ చేయడానికి ఈ మీటింగ్ ఏర్పాటు చేశారు. రాయసీమ సాగునీటి సాధన సమతి శ్రీశైలం నుంచి విద్యుత్ ఉత్పత్తిపేరుతో జలదోపిడి ఆపాలని జలాశయంలో 854 అడుగుల నీరు నిర్వహించాలని ముఖ్యమంత్రికి, నంద్యాల జాయింట్ కలెక్టర్‌కు వినతిపత్రాలుఇచ్చి ఒత్తిడి పెంచారు. ప్రస్తుతం ఎగువన కర్ణాటక పరివాహక ప్రాంతాలలో కురుస్తున్న వర్షాల వల్ల శ్రీశైలం జలాశయానికి వరద నీరు చేరుతోందని, ఈ తరుణంలో రాయలసీమ ప్రాజెక్టులకు తక్షణమే నీటిని వదలాలని అధికారలకు విజ్ఞప్తి చేశారు. పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ ద్వారా ఎస్ఆర్‌బిసి, కెసికెనాల్, తెలుగుగంగ, గాలేరునగరి ప్రాజెక్టులతో అనుసంధానమైన రిజర్వాయర్లు, బ్యాలెన్సింగ్ రిజర్వాయర్లు, గ్రామీణ చెరువులకు తక్షణమే నీటిని విడుదల చేయాలని నాయకులు అధికారులకు విజ్ఞప్తి చేశారు. రాయలసీమ ప్రజల చట్టబద్ధమైన జలహక్కులను పరిరక్షిస్తూ ప్రభుత్వం వెంటనే స్పందించి ఉత్తర్వులు జారీ చేయాలని, లేనిపక్షంలో రైతాంగం తరఫున పోరా టాన్ని ఉధృతం చేస్తామని నాయకులు హెచ్చరించారు.




## మెటాలో చిన్నారుల లైంగిక హింస విడియోలు వ్యాప్తి

### కేసులు నమోదు చేయాలని

### ఆరు రాష్ట్రాల డిజిపిలకు నోటీసులు

### తీవ్రంగా పరిగణించిన ఎన్‌హెచ్ఆర్‌సి

**న్యూఢిల్లీ, ఆగస్టు 7:** పోక్సో చట్టం పరిధిలో లైంగిక హింసకు సంబంధించిన సమాచారాన్ని ఇన్‌స్టాల్లో పోస్టులుచేయడంపై జాతీయ మానవ హక్కుల కమిషన్ సీరియస్ అయింది. ఇందుకు సంబంధించి ఆరు రాష్ట్రాల డిజిపిలకు మెటాకు నోటీసులు జారీచేసింది. బీహార్, చండీఘర్, హర్యానా, పశ్చిమబెంగాల్, ఒడిశా, న్యూఢిల్లీ పోలీసులకు నోటీసులు జారీచేసి ముందు మెటా ప్లాట్‌ఫామ్స్‌పై ఎఫ్ఐఆర్ నమోదుచేయాలని ఆదేశించింది. పోక్సో చట్టంపరిధిలోనే కేసులుండాలని స్పష్టం చేసింది. ఇన్‌స్టానగరామ్, ఫేస్‌బుక్ వంటిసోషల్‌మీడియాల్లో బాలల లైంగిక హిందసకు సంబంధించిన సమాచారం వ్యాప్తిచేయడంపై అభ్యంతరం వ్యక్తంచేసింది. బాలల లైంగిక హింస సమాచారం సిశామ్ ఎక్కువ గుర్తించినట్లు వెల్లడించింది. ఇందుకు సంబంధించి వెంటనే సంబంధిత అధికారులు దర్యాప్తుచేసి చట్టాల ఉల్లంఘటనలపై చర్యలు తీసుకోవాలని ఈనెల 3వ తేదీనే నోటీసులు జారీచేసింది. ఇక స్వచ్ఛంద సంస్థ దాఖలుచేసిన ఫిర్యాదుపై స్పందించిన ఎన్‌హెచ్ఆర్‌సి సిశామ్‌కు సంబంధించిన సమాచారం ఇన్‌స్టా, ఫేస్‌బుక్‌లలో ఎక్కువ వ్యాప్తిచెందుతున్నదన్న అంశాన్ని ఆరురాష్ట్రాల డిజిపిలకు అందచేసింది. ఈ ఫౌండేషన్ కొన్ని లింకులను కూడా విచారణకు అనుగుణంగా అందచేసింది. పోక్సో చట్టానికి లోబడి ఈ లింకులు దర్యాప్తుకోసం మాత్రమే అందచేస్తున్నట్లు ఎన్‌జిఒ వెల్లడించింది. అంతేకాకుండా కేంద్ర ఎలక్ట్రానిక్స్ మంత్రిత్వశాఖ మైయిటీ, ఆరురాష్ట్రాల డిజిపిలు కూడా తక్షణమే స్పందించి సమగ్ర కార్యాచరణ నివేదిక వారంరోజుల్లోపు అందచేయాలని ఆదేశించింది.

# బిజెపి-అకాలీదళ్ మళ్లీ జట్టు!

### మోడీ-సుఖ్‌బీర్‌బాదల్ భేటీతో పొలిటికల్ బజ్

### 2027 పంజాబ్ అసెంబ్లీ ఎన్నికలపై ఆసక్తి

**న్యూఢిల్లీ, ఆగస్టు 7:** వచ్చే యేడాది జరగనున్న పంజాబ్ అసెంబ్లీ ఎన్ని కలకు ముందు మాజీ మిత్రపక్షాలైన బీజేపీ, శిరోమణి అకాలీదళ్ (ఎస్ఏడీ) మళ్లీ చేతులు కలపనున్నాయి. ప్రధానమంత్రి నరేంద్ర మోడీతో శిరోమణి అకాలీదళ్ అధ్యక్షుడు సుఖ్‌బీర్ సింగ్ బాదల్ శుక్రవారం భేటీ కావడం రాజకీయ వర్గాల్లో ఈ చర్చకు మరింత ఊతమిచ్చింది. న్యూఢిల్లీలోని పార్లమెంట్ భవన్‌లో మోడీతో బాదల్ సమావేశమయ్యారు. ఈ భేటీలో ఇరు పార్టీల మధ్య పొత్తు అంశంపై చర్చ జరిగినట్లు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. బీజేపీ-అకాలీదళ్ మధ్య దాదాపు రెండున్నర దశాబ్దాలుగా కొనసాగిన పొత్తు 2020లో ముగిసింది. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన మూడు వివాదాస్పద వ్యవసాయ చట్టాల నేపథ్యంలో అకాలీదళ్ ఎన్డీయే నుంచి వైదొలగాలని నిర్ణయించింది. అప్పటి నుంచి ఇరు పార్టీలు విడివిడిగా రాజకీయ ప్రయాణం కొనసాగిస్తున్నాయి. 2022 పంజాబ్ అసెంబ్లీ ఎన్నికలతో పాటు 2024 లోక్‌సభ ఎన్నికల్లోనూ వేర్వేరుగా పోటీ చేశాయి. 2024 లోక్‌సభ ఎన్నికల్లో పంజాబ్‌లో బీజేపీ ఒక్క సీటు కూడా గెలుచుకోలేకపోగా, అకాలీదళ్ కేవలం ఒక స్థానానికే పరిమితమైంది.పొత్తు తెగిపోయినప్పటికీ ఇరు పార్టీలకు చెందిన సీనియర్ నేతల మధ్య అప్పుడప్పుడు జరుగుతున్న సమావేశాలు మళ్లీ పొత్తు పునరుద్ధరణపై ఊహాగానాలకు తావిస్తున్నాయి. తాజాగా మోడీ-సుఖ్‌బీర్ బాదల్ భేటీ కూడా ఈ అంశంపై రాజకీయంగా కీలక సంకేతంగా మారింది.పొత్తు పునరుద్ధరణకు అనుకూలంగా నేతలుఅకాలీదళ్, పంజాబ్ బీజేపీ రాష్ట్ర విభాగం, ఆర్ఎస్ఎస్.. మూడు వర్గాలూ ఇరు పార్టీల పొత్తును పునరుద్ధరించేందుకు అనుకూలంగా ఉన్నట్లు వర్గాలు వెల్లడించాయి. కాంగ్రెస్ నుంచి బీజేపీలో చేరిన కొందరు నేతలు కూడా అకాలీదళ్‌తో మళ్లీ పొత్తు పెట్టుకోవాలని కోరుకుంటున్నట్లు సమాచారం. తుది నిర్ణయం బీజేపీ కేంద్ర నాయకత్వానిదేనని సంబంధిత వర్గాలు తెలిపాయి. అయితే ఈ ఏడాది మార్చిలో మోగా పర్యటన సందర్భంగా కేంద్ర హోంమంత్రి అమిత్ షా మాత్రం అకాలీదళ్‌తో పొత్తు ఉండబోదని స్పష్టంగా ప్రకటించారు. దీంతో తాజా పరిణామాలు రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకున్నాయి. రాష్ట్రంలోని పట్టణ ప్రాంతాల్లో బీజేపీకి బలమైన ఉనికి ఉండగా, గ్రామీణ పంజాబ్‌లో అకాలీదళ్‌కు గణనీయమైన ప్రభావం ఉంది. ఈ రెండు బలాలను కలిపితే ఎన్నికల్లో ప్రయోజనం పొందవచ్చని విశ్లేషిస్తున్నారు. పంజాబ్‌లో పర్యటించిన బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ కూడా పొత్తుపై నిర్ణయం సరైన సమయంలో తీసుకుంటామని పేర్కొన్నారు. అయితే పొత్తు పునరుద్ధరణ జరిగితే గతంలో మాదిరిగా అకాలీదళ్‌కు జూనియర్ పార్ట్‌నర్‌గా ఉండేందుకు బీజేపీ సిద్ధంగా లేదని తెలుస్తోంది. పొత్తు కొనసాగిన సమయంలో బీజేపీ చిన్న భాగస్వామిగా వ్యవహరించగా, అకాలీదళ్ ఆధిపత్యం చెలాయించింది. ఇప్పుడు సమాన ప్రాతిపదికన పొత్తు పునరుద్ధరించాలని బీజేపీ కోరుకుంటున్నట్లు వర్గాలు తెలిపాయి. కేంద్ర మంత్రి హర్దీప్ సింగ్ పూరీ కూడా ఇకపై బీజేపీ చిన్న సోదరుడు పాత్ర పోషించబోదని స్పష్టం చేసినట్లు సమాచారం.



# భర్తను చంపేందుకు భార్య మాస్టర్‌ప్లాన్

### ప్రమాదంలా చిత్రీకరించాలని ప్రియునికి మేసెజ్‌లు

### గమనించిన భర్త పోలీసులకు ఫిర్యాదు

**మహబూబాబాద్ ప్రతినిధి, ప్రభాతవార్త:** మానవ సంబంధాలు రోజు రోజుకు హీనంగా తయారవుతున్నాయి. ఇటీవల కాలంలో భర్తలను చం పిన భార్యల కేసులు అనేకం ఉన్నాయి. ఇలాంటి సంఘటనే మహ బూబాబాద్ జిల్లా డోర్నకల్‌లో భర్తను హత్య చేసేందుకు భార్య ప్రియు నితో ప్రణాళికలు రచించడంతో అది కనిపెట్టిన భర్త పోలీసులకు ఫిర్యాదు చేశాడు. డోర్నకల్ మం డలం చిలుకోడుకు చెందిన గాదె రాజేశ్వరరావు ప్రస్తుతం ఖమ్మంలో ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో ఉద్యోగం చేస్తున్నాడు. 2016లో సూర్యాపేట జిల్లా రాఘవాపురానికి చెందిన యువతిని వివాహం చేసుకున్నాడు. వీరికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. గత నెల 27న మధ్యాహ్నం భోజనం కోసం ఇంటికి వెళ్లిన సమయంలో భార్య మరో వ్యక్తితో చనువుగా ఉండటాన్ని గమనించినట్లు రాజేశ్వరరావు ఫిర్యాదులో పేర్కొన్నాడు. దీనిపై పెద్దల సమక్షంలో మాట్లాడాలని నిర్ణయించి మరుసటిరోజు తన అన్నను తీసుకొచ్చేందుకు వెళ్లాడు. భార్యతో కనిపించిన వ్యక్తి ఆ సమయంలో తనను వెంబడించినట్లు గుర్తించి పట్టుకునే ప్రయత్నం చేయగా అతను తప్పించుకుని వెళ్లి పోయాడని తెలిపాడు. అనుమానం మరింత పెరగడంతో భార్య మొబైల్‌ను పరిశీలించానని, అందులో ఉన్న చాటింగ్ చూసి షాక్‌కు గుర య్యానని రాజేశ్వరరావు చెప్పాడు. ఇంట్లో చంపొద్దని, బయట యాక్సిడెంట్‌గా కనిపించేలా హత్య చేయాలని భార్య, ఆమెకు పరిచయం ఉన్న పురిమెట్ల సైదులుకు పలుమార్లు మెసేజ్‌లు పంపినట్లు ఆరోపించాడు. వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్ లో జరిగిన సంభాషణల స్క్రీన్‌షాట్లను కూడా పోలీసులకు సమర్పించాడు. భార్య, ఆమెతో సన్నిహితంగా ఉన్న వ్యక్తి కలిసి తనను హత్య చేసేందుకు కుట్ర పన్నారని ఆరోపిస్తూ ఈ నెల 1న డోర్నకల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేసి కేసును ఖమ్మం రూరల్ పోలీస్ స్టేషన్‌కు బదలీ చేయగా కేసు నమోదుచేసి అన్ని కోణాల్లో దర్యాప్తు చేపడతామని పోలీసులు తెలిపారు.

# రాష్ట్రం సుభిక్షం కోసం మహా వరుణయాగం

### నాగార్జునసాగర్ వద్ద 10న నిర్వహణ

### మహాక్రతువు పూర్ణాహుతికి సిఎం హాజరు: మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



**హైదరాబాద్, ఆగస్టు 7,ప్రభాతవార్త:** ప్రకృతి అనుగ్రహమే ప్రజల సంక్షేమానికి, రైతాంగ సౌభాగ్యానికి, రాష్ట్ర సమృద్ధికి శాశ్వత ఆధారం. మేఘాలు కరుణిస్తే నేల పులకిస్తుంది. నేల పులకిస్తే పంటలు పుష్కలంగా పండుతాయి. రైతు ఆనందమే రాష్ట్ర అభ్యున్నతికి నిజమైన కొల మానం. ఈ మహోన్నత సంకల్పంతో రాష్ట్ర ప్రజల సర్వతోముఖ శ్రేయస్సు కోసం ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి మహా వరుణ యాగం నిర్వహించాలని నిర్ణయించారని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా స మృద్ధిగా వర్షాలు కురిసి పాడి పంటలు సమృద్ధిగా పండాలని, కృష్ణా- గోదావరి మహానదులు జలకళతో పరవళ్ల తొక్కా లని, నాగార్జున సాగర్‌తో పాటు రాష్ట్రం లోని అన్ని జలాశయాలు, రిజర్వా యర్లు, చెరువులు సంపూ ర్ణంగా నిండి పోవాలని, ఎల్‌నినో వంటి ప్రకృతి వైపరీత్యాల ప్రభావం తెలం గాణపై లేకుండా ఉండాలని ఆకాంక్షిస్తూ ఈ మహాయాగాన్ని నిర్వహిస్తున్నట్లు మంత్రి పేర్కొన్నారు. యాద గిరిగుట్ట లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానం అర్చకులు, సిద్ధాం తులు, వేదపండితులు ఈ నెల 10వ తేదీని శుభ ముహూర్తంగా నిర్ణయించారని తెలిపారు. నాగార్జునసాగర్ జలాశయం విజయవిహార్ ప్రాంగ ణంలో యాదగిరిగుట్ట దేవస్థానం ఆధ్వర్యంలో 108 మంది రుత్వికులు, 11 హోమకుండాలు, వేదఘోషల మధ్య అత్యంత వైభవోపేతంగా మహా వరుణయాగం నిర్వహించనున్నట్లు మంత్రి వెల్లడించారు. సాయంత్రం 3.24 గం టలకు జరిగే మహా పూర్ణాహుతి కార్యక్రమానికి ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి విచ్చేసి పాల్గొని రాష్ట్ర శ్రేయస్సు కోసం ప్రత్యేక ప్రార్థనలు చేయనున్నారని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు.

## తెలంగాణ ప్రాజెక్టులకు చట్టబద్ధ అనుమతులపై సమీక్ష సరికాదు

### కేంద్ర జలశక్తి మంత్రికి మాజీమంత్రి హరీశ్‌రావు లేఖ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్, ఆగస్టు7:** కేంద్ర ప్రభుత్వం నుంచి అన్ని రకాల అనుమతులు, సాంకేతిక క్లియరెన్స్‌లు పొందిన తెలంగాణకు చెందిన ఏడు ప్రాజెక్టులను మళ్లీ సమీక్షించే అంశాన్ని జీఆర్ఎంబీ సమావేశం ఎజెండాలో చేర్చడాన్ని మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు తీవ్రంగా వ్యతిరేకించారు. ఈ మేరకు శుక్రవారం జలశక్తి మంత్రికి, సెక్రటరీకి రాసిన లేఖను విడుదల చేశారు. కేంద్రం ఇప్పటికే చట్టబద్ధంగా ఇచ్చిన అనుమతులను గోదావరి నదీ యాజమాన్య బోర్డు సమీక్షించడం సరికాదన్నారు. అజెండాలో పేర్కొన్న అంశాలను ఉపసంహరించుకోవాలని, పెండింగ్‌లో ఉన్న సమ్మక్క సాగర్ ప్రాజెక్ట్ అనుమతులను తక్షణమే మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. తెలంగాణలోని పలు భారీ సాగునీటి ప్రాజెక్టులకు సంబంధించిన సాంకేతిక, హైడ్రోలాజికల్, ఇంజనీరింగ్, పర్యావరణ, చట్టపరమైన అంశాలను కేంద్ర జల సంఘం, జలశక్తి మంత్రిత్వ శాఖలు క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతే టెక్నికల్ అడ్వైజరీ కమిటీ ఆమోదం తెలిపిందని గుర్తుచేశారు. కేంద్ర ప్రభుత్వ అత్యున్నత సంస్థలు చట్టబద్ధంగా అనుమతులు ఇచ్చిన తర్వాత, ఆ నిర్ణయాలను మళ్లీ సమీక్షించే లేదా రద్దు చేసే అధికారం గోదావరి బోర్డు లాంటి కింది స్థాయి సంస్థకు ఏమాత్రం ఉండదని స్పష్టం చేశారు. జలశక్తి మంత్రిత్వ శాఖ ఇప్పటికే తీసుకున్న నిర్ణయాలను మళ్లీ సమీక్షించేందుకు జీఆర్ఎంబీకి అవకాశం ఇస్తే, అది కేంద్ర ప్రభుత్వ సంస్థల ప్రాధాన్యతను తగ్గించినట్లు అవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. తెలంగాణలోని కాళేశ్వరం, చౌటుపల్లి హనుమంత్ రెడ్డి, ముక్తేశ్వ రం, చనాకకొరట, మోడికుంటవాగు, కడెంగూడెం, సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ వంటి కీలక ప్రాజెక్టులకు సుదీర్ఘ ప్రక్రియ తర్వాతే అనుమతులు వచ్చాయని, ఇప్పుడు వాటిని మళ్లీ సమీక్షించాలని ఎజెండాలో పెట్టడం సరికాదని పేర్కొన్నారు. దీని వల్ల తెలంగాణలో సాగునీటి అభివృద్ధి కుంటుపడటంతో పాటు, కోట్లాది మంది రైతుల జీవనోపాధి, తాగునీటి భద్రత ప్రమాదంలో పడుతుందని హెచ్చరించారు.

సెంట్రల్ వాటర్ కమిషన్ నుంచి ఇప్పటికే హైడ్రోలాజికల్ అనుమతులు పొందిన సమ్మక్క సాగర్ ఎత్తిపోతల పథకానికి మిగిలిన చట్టబద్ధమైన అనుమతులను కూడా మంజూరు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. కేంద్రం సకాలంలో జోక్యం చేసుకుని తెలంగాణ నీటి హక్కులను కాపాడుతుందని తాను విశ్వసిస్తున్నట్లు లేఖలో పేర్కొన్నారు.

## 11 లోపు కృష్ణా నీటిని విడుదల చేయకపోతే నార్లాపూర్‌ను ముట్టడిస్తాం

### మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి హెచ్చరిక

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఆగస్టు7:** జూరాల ప్రాజెక్టు పరిధిలోని భీమా ఫేజ్1, 2, నెట్టెంపాడు, కోయిల్ సాగర్ లిఫ్ట్‌లతో పాటు కేఎల్ఐ కింద ఉన్న పంపులను తక్షణమే ప్రారంభించి పాలమూరు రైతాంగాన్ని ఆదుకోవాలని బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం తెలంగాణ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఈ నెల 11వ తేదీలోపు పంపులను ఆన్ చేయకపోతే బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తో కలిసి భారీ సంఖ్యలో రైతులతో నార్లాపూర్ ప్రాజెక్టును ముట్టడిస్తామని హెచ్చరించారు. కృష్ణా నదికి ఎగువ నుంచి భారీగా వరద నీరు వస్తున్నప్పటికీ, నీళ్ల లేవంటూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతులను మోసం చేస్తున్నారని ఆయన తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. పాలమూరు బిడ్డనని చెప్పుకుంటూనే ఏపీకి నీళ్ల తరలించేందుకు ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబుకు రేవంత్ సహకరిస్తున్నారని ఆరోపించారు.

### ఎపి తరహాలో కేంద్రం ఒబిసి సబ్‌ప్లాన్ చట్టం రూపొందించాలి:

### ఎంపి ఆర్.కృష్ణయ్య డిమాండ్

## ప్రతి కులానికి యూనిక్ ఐడి ద్వారా జనగణనలో ఒబిసి కులగణన చేపట్టాలి




జంతర్‌మంతర్‌లో జరిగిన ధర్నాలో మాట్లాడుతున్న ఎంపి కృష్ణయ్య, చిత్రంలో ఎంపి నాగరాజు తదితరులు

**హైదరాబాద్, ఆగస్టు 7, ప్రభాతవార్త:** కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న సమగ్ర జనగణనలో దేశంలో ఉన్నటువంటి అన్ని కులాలకు ఒక యూనిట్ ఐడి నమోదు ప్రక్రియ ద్వారా ఒబిసి కొలగలను చేపట్టాలని రాజ్యసభ సభ్యుడు, బీసీ ఉద్యమ నేత ఆర్ కృష్ణయ్య ప్రధాని నరేంద్ర మోడీకి విజ్ఞప్తి చేశారు. శుక్ర వారం ఢిల్లీలోని జంతర్ మంతర్ లో అంగిరేకుల వరప్రసాద్ యాదవ్ ఆధ్వర్యంలో జరిగిన ఓబీసీల మహా ధర్నాలో రాజ్యసభ సభ్యుడు ఆర్ కృష్ణయ్య, ఎంపీ నాగ రాజులు పాల్గొని ప్రసంగించారు. ఏపీ ప్రభుత్వం తరహాలో కేంద్ర ప్రభుత్వం ఓబీసీలకు సబ్ ప్లాన్ చట్టాన్ని రూపకల్పన చేసి పార్లమెంట్లో ప్రవేశ పెట్టేందుకు చర్యలు చేపట్టాలని ప్రధాని మోడీకి ఆర్ కృష్ణయ్య విజ్ఞప్తి చేశారు. ఎస్సీ ఎస్టీలకు వల్లే బీసీలకు సాంఘిక భద్రత కల్పించేందుకు ఓబీసీలకు సామాజిక రక్షణ చట్టాన్ని పార్లమెంట్లో ప్రవేశపెట్టి రాజ్యాంగ సవరణ ద్వారా చట్టబద్ధత కల్పించాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఆర్ కృష్ణయ్య డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం మండల్ కమిషన్ సిఫార్సులు మేరకు ఓబీసీ మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేసి ఓబీసీల ఆర్థిక అభ్యున్నతికి చేతివృత్తుల చేయూతకు నాలుగు లక్షల కోట్లతో ప్రత్యేక ప్యాకేజీని ప్రకటించాలని ఆర్ కృష్ణయ్య కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎంపీ నాగరాజు మాట్లాడుతూ బీసీలకు చట్టసభల్లో ఓబీసీలకు రిజర్వేషన్ కల్పించాలని కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ధర్నాలో ఏపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు సుజాన్ సింగ్ సుబ్బారావు ఏపీఓబిసి మహిళా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దేవరకొండ రమాదేవి రాష్ట్ర మహిళా నాయకురాలు సోను, ఎస్సీ ఎస్టీ ఓబీసీ సాధికారిక సంఘం ఏపీ రాష్ట్ర కన్వీనర్ వాడపల్లి కళ్యాణ్, నాయీబ్రాహ్మణ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు తాటికొండ నరసింహారావు, నవక్రాంతి పార్టీ జాతీయ అధ్యక్షుడు కనకం శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

## శ్రీశైలంలో 165.134 టిఎంసిల నీటినిల్వ

**హైదరాబాద్,ఆగస్టు 7,ప్రభాతవార్త:** శ్రీశైలంలోకి 165.134టిఎంసిల నీటి నిల్వ వచ్చిచేరింది. ప్రాజెక్టు గరిష్ట నీటిసామర్థ్యం 215టిఎంసిలు ఉంటుంది.శుక్రవారం సాయంత్రం వరకు 162.81టిఎంసిలకు చేరింది. జురాల నుంచి2.12 క్యూసెక్కుల వరదప్రవాహం కొనసాగుతోంది. శ్రీశైలం నుంచి జలవిద్యుత్ కోసం 30792 క్యూసెక్కులు ఎన్ఎస్‌పి కి విడుదల చేస్తున్నారు. ఆగస్టు 10నుంచి శ్రీశైలం జెన్కో నాల్గవ యూనిట్ విద్యుత్ ఉత్పత్తి ప్రారంభించబోతున్నది.2020 ఆగస్టు 20న జరిగిన ప్రమాదంలో తొమ్మిది మంది సిబ్బంది ప్రాణాలు కోల్పోగా వంద కోట్లకుపైగా ఆస్తి నష్టం జరిగింది. నాల్గవ యూనిట్ మరమ్మతుకోసం ఢిల్లీకి చెందిన వాయిత్ కంపెనీకి రూ.25కోట్ల నిధులు ఒప్పందం ప్రకారం విడుదల చేశారు. 2025లోనే ఈ యూనిట్ పనిచేయించాలని అనుకున్నా సాంకేతి కారణాలతో సాధ్యం కాలేదు. ఈనెల నుంచి 900మెగావాట్ల విద్యుత్ ఉత్పతి చేసే సామర్థ్యం జెన్కోకు అందుబాటులోకి రాబోతున్నది. గోదావరి నదిపై ఉన్న ఎస్సారెస్పీలోకి 8334 క్యూసెక్కుల నీరు వరదగావస్తోంది. ఎస్సారెస్పీలో 40.139టిఎంసిలనీరు వచ్చిచేరింది.

## శ్రీశైలంలో విద్యుత్ ఉత్పత్తి

### 10 నుండి 4వ యూనిట్ ప్రారంభం

**హైదరాబాద్, ఆగస్టు 7, ప్రభాతవార్త :** శ్రీశైలంలో దెబ్బతిన్న 4వ యూనిట్ విద్యుత్ ఆరు సంవత్సరాల అనంతరం తిరిగి ఉత్పత్తికి సిద్ధమైంది. 2020 ఆగస్టు 20న జరిగిన ప్రమాదంతో నిలిచిపోయిన 4వ యూనిట్‌ను ఈ నెల 10వ తేదీ నుండి ప్రారంభించేందుకు తెలంగాణ విద్యుత్ ఉత్పత్తి సంస్థ జెన్కో అధికారులు ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రమాదం అనంతరం పలు దశల్లో మరమ్మతులు చేపట్టగా, చివరకు ఒక ప్రైవేటు కంపెనీ ఆధ్వర్యంలో రూ.25 కోట్ల వ్యయంతో కీలక మరమ్మతులు చేపట్టారు. 2023, 2025 సంవత్సరాల్లో రెండుసార్లు మరమ్మతులు చేపట్టి ఈ యూనిట్‌ను ప్రారంభించే ప్రయత్నం చేసినా అవి ఫలించలేదు. దీంతో పునఃప్రారంభం పలుమార్లు వాయిదా పడింది. ఎట్టకేలకు ఇప్పుడు మరమ్మతు పనులు పూర్తి కావడంతో విద్యుత్ ఉత్పత్తికి 4వ యూనిట్ సిద్ధమైంది. ప్రస్తుతం ఈ యూనిట్‌ను తిరిగి పవర్ గ్రిడ్‌కు అనుసంధానించేందుకు పనిలో అధికారులు నిమగ్నమయ్యారు. ఈ 4వ యూనిట్ పునఃప్రారంభంతో శ్రీశైలం జల విద్యుత్ కేంద్రం విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం మరింత పెరగనుందని జెన్కో అధికారులు తెలిపారు. కాగా రాష్ట్ర విద్యుత్ అవసరాలను తీర్చడంలో ఈ యూనిట్ కీలక పాత్ర పోషించనుందన్నారు. శ్రీశైలం ఎడమ గట్టు విద్యుత్ కేంద్రంలో మొత్తం ఆరు యూనిట్లు ఉండగా, నాలుగో యూనిట్ కూడా అందుబాటులోకి రావడంతో ఒక్కో యూనిట్ ద్వారా 150 మెగావాట్ల చొప్పున మొత్తం 900 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి చేసే సామర్థ్యం అందుబాటులోకి రానుందని జెన్కో అధికారవర్గాలు వెల్లడించాయి.



## మహారాష్ట్ర డిప్యూటీ ముఖ్యమంత్రి సునేత్రపవార్‌తో ప్రశాంత్‌కిశోర్ భేటీ

**ముంబై, ఆగస్టు 7:** బీహార్‌లోని బంకీపూర్ ఉప ఎన్నికలో బీజేపీని ఓడించిన జేఎస్పీ వ్యవస్థాపకుడు ప్రశాంత్ కిషోర్, మహారాష్ట్ర డిప్యూటీ సీఎం, ఎన్సీపీ అధినేత్రి సునేత్రా పవార్‌ను కలిశారు. ముంబైలోని ఆమె నివాసంలో వారిద్దరూ సమావేశమయ్యారు. అయితే రాజకీయ వ్యూహకర్త నుంచి రాజకీయ నేతగా మారిన ప్రశాంత్ కిషోర్, సునేత్రా పవార్‌ను కలుసుకోవడం ఇది రెండోసారి. ఈ ఏడాది జనవరిలో బారామతిలో జరిగిన విమాన ప్రమాదంలో ఆమె భర్త, నాటి ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ మరణించిన తర్వాత వారిద్దరూ సమావేశం కావడం రాజకీయ ప్రాధాన్యత సంతరించుకున్నది. కొన్ని నెలల క్రితం జరిగిన మొదటి భేటీపై సునేత్రా కుమారుడు, ఎన్సీపీ నేత పార్థ్ పవార్ వివరణ ఇచ్చారు. ప్రశాంత్ కిషోర్ తమ కుటుంబానికి సుపరిచితులేనని ఆయన తెలిపారు. గతంలో నరేంద్ర మోడీ, మమతా బెనర్జీ, అరవింద్ కేజ్రీవాల్ వంటి నాయకుల విజయాల్లో కీలక పాత్ర పోషించిన ప్రశాంత్ కిషోర్, సునేత్రా పవార్‌తో భేటీ కావడంపై బీజేపీకి చెందిన రెవెన్యూ మంత్రి చంద్రశేఖర్ బవంకులే స్పందించారు. మహారాష్ట్రలోని అధికార మహాయుతి కూటమిలో ఎలాంటి విభేదాలు తలెత్తేలా లేదా కూటమిలో చీలికకు దారితీసేలా వ్యవహరించవద్దని ఆమెకు సూచించారు. ఇది వారి పార్టీకి సంబంధించిన అంతర్గత విషయం. అయితే మహాయుతి కూటమిలో భాగస్వామిగా ఉన్నప్పుడు, మిత్రపక్షాల మధ్య అనుమానాలు కలిగించేలా లేదా ఏ పార్టీకైనా నష్టం కలిగించేలా ఎటువంటి చర్య తీసుకోకూడదు. ప్రతి ఒక్కరూ మహాయుతి నియమావళికి కట్టుబడి ఉండాలని ఆయన అన్నారు.

### విద్యారంగం, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి

## ఉపాధ్యాయుల నిరసన ప్రదర్శనలు

**హైదరాబాద్, ఆగస్టు 7, ప్రభాతవార్త:** విద్యారంగం, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికై శుక్రవారం రాష్ట్ర వ్యాప్తంగా ఉపాధ్యాయుల నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. విద్యారంగం, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికై ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ (యుఎస్‌పిసి) పిలుపుమేరకు దశలవారీ పోరాటంలో భాగంగా శుక్రవారం రాష్ట్ర వ్యాప్తంగా ఉపాధ్యాయులు భోజన విరామ సమయంలో విద్యాసంస్థల ఎదుట నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. ప్రాథమిక పాఠశాలలకు మరణశాసనంగా ఉన్న జీఓ 25 ను సవరించి ప్రతి ప్రాథమిక పాఠశాలకు ఇద్దరు ఉపాధ్యాయులను నియమించాలని, విద్యార్థులు 50 మంది మించితే ప్రధానోపాధ్యాయ పోస్టు ఇవ్వాలని, సర్వీసు నిబంధనలు విడుదల చేసి పర్యవేక్షణ అధికారుల పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న 6 వాయిదాల కరువు భత్యాన్ని ప్రకటించాలని, 1.07.2023 నుండి పీఆర్సీని అమలు చేయాలన్నారు. 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు 57 మెమోను అమలు చేయాలని, జీఓ 317 బాధితులకు న్యాయం చేయాలన్నారు. అలాగే కేజీబీవీ ఉద్యోగులకు కనీస వేతనాలు, గురుకులాలకు ఏకరూప సమయసారిణి కావాలని, మోడల్ స్కూల్ టీచర్లకు 010 పద్దులో వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.


వార్త

> అవమానించేవాడు ఇసుకపై రాతలాగా వెంటనే దాన్ని విస్మరిస్తాడు. అవమానానికి గురైన వాడు ఇత్తడిపై చెక్కిన రాతలాగా ఎన్నటికీ మరిచిపోలేడు.
>
> - ఆస్కార్‌వైల్డ్


# బో'ఫోర్స్‌'కు చరమగీతం!

బోఫోర్స్ దేశ రాజకీయాలను ఒక్క ఊపు ఊపిన వ్యవహారం. ఆ కథ కంచికెళ్లి చాలా రోజులైంది. కథలు ఎక్కడ పుట్టి ఎక్కడ తిరిగి సంచలనం చేసినా అవి కంచికే చేరుతాయని ప్రతీతి. కానీ 'బోఫోర్స్' కథ మాత్రం చిట్టచివరికి సుప్రీంకోర్టుకు చేరితే తప్ప అంతిమ సంస్కారం జరుగలేదు. అప్పట్లో బోఫోర్స్ కుంభకోణమంటూ ఆనాటి ప్రధాని రాజీవ్ గాంధీని ఇరుకున పెట్టే తీవ్ర ప్రయత్నమే జరిగింది. 1986 మార్చిలో భారత ప్రభుత్వం స్వీడన్‌కు చెందిన ఆయుధాల తయారీ సంస్థ ఎబి బోఫోర్స్ సంస్థతో రూ.1437కోట్ల విలువైన 410-155 హోలిట్జర్ గన్ కొనుగోలు ఒప్పందం చేసుకోగా, దానికోసం 1987లో ఈ ఒప్పంద ప్రక్రియలో అక్రమ కమిషన్‌లు స్వీకరించారని ప్రతిపక్షాలు ఆనాటి ప్రధాని రాజీవ్ గాంధీపై తీవ్రఆరోపణలు చేశాయి. ఆ సమయంలో కేంద్ర రక్షణశాఖ మంత్రిగా ఉండడమే ఆయన చేసిన పాపం. భారతదేశ రాజకీయ చరిత్రలో బోఫోర్స్ కుంభకోణం చాలా కాలం జనం నోళ్లల్లో నానింది. ఇప్పటికీ ఆ పేరెత్తగానే చర్చ మొదలైపోతుంది. అదే విపక్షాలకు అధికారపక్షంపై విమర్శలు చేసేందుకు ఆటవస్తువుగా మారింది. మధ్యవర్తుల ప్రమేయం లేని ఆయుధ వ్యాపార ఒప్పందాలకు బదులు స్వీడన్‌సంస్థ తన వ్యాపారాభివృద్ధి కోసం భారతీయ రాజకీయ నేతలు, రక్షణశాఖ అధికారులు, మధ్యవర్తులకు మొత్తం రూ. 64 కోట్ల మేరకు ముడుపులు ముట్ట చెప్పిందని ఆరోపణను ఏప్రిల్ 1987లో స్వీడిష్ రేడియో ఒక నివేదికను ప్రముఖంగా ప్రసారం చేయడమే ఈ ఆరోపణలకు ఆయువుపట్టు. అందుకే బోఫోర్స్ ఒప్పందంలో లంచాలసంస్కృతి మొదలైందనో అపోహాలు, అనుమానాలతో చాలాకాలం బోఫోర్స్ అంశం పత్రికల విభిన్న కథనాలు, విపక్షాల ఆరోపణలతో సాగతీతకు గురైంది. ఈ అంశంపై దాఖలైన అవినీతి కేసులన్నీ 2005లోనే ఢిల్లీ హైకోర్టు కొట్టివేసింది. రాజీవ్ గాంధీని ఈ కేసు నుండి విముక్తుడిని చేసింది. ఆ తర్వాత సిబిఐ అప్పీల్ కూడా 2018 తిరస్కరించారు. అయినా బోఫోర్స్ అంశంలో ఎంతో దూకుడుగా ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వంపై చెలరేగిన ఆరోపణలు నిన్నమొన్నటి వరకు హల్‌చల్ చేస్తూనే ఉన్నాయి. నాలుగు దశాబ్దాల పాటు రాజకీయాల్లో ఇదొక చర్చనీయాంశంగా ఊగిసలాడింది. సరిగా బుధవారం సుప్రీంకోర్టులో విచారణకొచ్చిన చిట్టచివరి కేసుకు తెరపడింది. ఢిల్లీ హైకోర్టు 2005లో ఇచ్చిన తీర్పును సవాల్ చేసే తుది పిటిషన్‌గా పేర్కొంటూ ఇకపై ఆరోపణల్లేక, కేసుల్లేక వాయిదాల్లేక అంటూ జస్టిస్ జెబి పార్థీవాలా, జస్టిస్ వినోద్ కె. చంద్రన్‌తో కూడిన ధర్మాసనం పిటిషన్‌ను కొట్టివేసింది. దీంతో ఈ కేసుకు సంబంధించిన న్యాయపరమైన అన్ని ప్రక్రియలూ పూర్తిగా ముగిసినట్లుగా సుప్రీం ధర్మాసనం పేకప్ చెప్పేసింది. ఇకపై ఎలాంటి వాదనలు వినేందుకు ధర్మాసనం నిరాకరించింది. రక్షణ ఆయుధాల కొనుగోళ్లపై విషయంలో బోఫోర్స్‌పై ఉన్నసందేహాలు, కమిషన్లు స్వీకరించారని ఆరోపణలకు గురైన వారి అందరికీ సంబంధిత విషయాలపై కూలంకషంగా సిబిఐ దర్యాప్తుచేసింది. హిందుజా సోదరులు శ్రీచంద్, గోపీచంద్, ప్రకాశ్ హిందూజాలతోపాటు స్వీడన్‌కు చెందిన ఆయుధాల తయారీ సంస్థ ఎబి బోఫోర్స్ కంపెనీపై ఉన్న అన్నికేసులనూ ఢిల్లీ హైకోర్టుకొట్టేసింది. సిబిఐ దర్యాప్తు తీరుసరిగాలేదని హైకోర్టు తీవ్రంగా తప్పుబట్టింది కూడా. దాంతో ఇక బోఫోర్స్ ఆరోపణలకు అంతిమ యాత్రేనని భావించారు. కానీ భారతీయ చట్టాల్లో ఉన్నఅన్ని అవకాశాలన్నీ వాడుకుని వివాదాన్ని ఎన్నటికీ మూసివేయకుండా సజీవంగా ఉంచాలనే ప్రయత్నం జరిగింది. ఢిల్లీ హైకోర్టుతీర్పుపై 4522రోజులు ఆలస్యంగా సుప్రీంకోర్టులో అప్పీల్ దాఖలైంది. దానికిప్పుడు సుప్రీంకోర్టు చరమగీతంపాడింది. ఇక బోఫోర్స్, ఆరోపణలు వినిపించవు. కనిపించవు. 2018లోనూ హైకోర్టులో అప్పీల్ తిరస్కరణకు గురైంది. తాజాగా సుప్రీంకోర్టు కూడా ఈఅంశానికి పిటీషన్లు, పైపిటిషన్లుండవని వాదనలు ముగించడం ఆహ్వానించదగిన విషయం. అప్పట్లో ఎన్నోసార్లు బోఫోర్స్ కుంభకోణమంటూ విపక్షాల చర్చ పార్లమెంటు ఉభయసభలను స్తంభింపచేసిన పరిస్థితులుండేవి. ఈఅంశం పేరిట రాజీవ్‌గాంధీ ప్రభుత్వ ప్రతిష్టను దెబ్బతీయడమే ప్రధానలక్ష్యంగా పార్టీలు ఎక్కువగా శ్రమించాయనే చెప్పాలి. ఈ వివాద ప్రస్తావన, విస్మృతి కారణంగానే 1989 సాధారణ ఎన్నికల్లో కాంగ్రెస్ పరాజయం పాలైందన్న విశ్లేషణలు జరిగాయి. రాజకీయాల్లో ఆరోపణలు వేరు. వాస్తవ సాక్ష్యాలతో కోర్టుల్లో నిరూపితమవడం వేరు. అందుకే అవి కుంభకోణాలుగా మిగిలిపోతుంటాయి. రాజకీయాలున్నంత వరకు ఇలాంటి ఆరోపణలకు జనం నోళ్లనుంచి విశ్లేషణలు వస్తూనే ఉంటాయి. విదేశీ ఆధారాల సేకరణలో జాప్యం తగిన నిబద్ధత కలిగిన సాక్ష్యాలు లేకపోవడం, నిందితుల మరణం కారణాలతో కేసుబలహీనపడింది. బోఫోర్స్ అవినీతి కుంభకోణంలో వాస్తవమెంత? సందేహాల లోతెంతవంటి అంశాలు ఇప్పటికే తేలనట్లే!. బోఫోర్స్ కేసులను సుప్రీంకోర్టున్యాయపరంగా తెరదించిందేతప్ప నిజానిజాలపై ఎలాంటి తీర్మానం చేసినట్లు కాదనుకోవాలి. ఎన్నికల రాజకీయాల్లో అవినీతి ప్రస్తావనల్లో, దర్యాప్తు సంస్థ వైఫల్యాలపై చర్చించుకున్నప్పుడల్లా ఈఅంశం సజీవంగానే ఉంటుంది. సుప్రీం ఈ కేసును మూసివేసిందంటే దానికర్థం కేసును ఇకపై కొనసాగించడానికి తగిన ఆధారాలు లేవని తెలియచెప్పడమే. సాధారణంగా అంతర్జాతీయ ఆర్థిక లావాదేవాలు, విదేశీ సాక్ష్యాల సేకరణ, విచారణ ప్రక్రియలో సుదీర్ఘకాలం తీసుకోవడంతో తీర్పువేగం పరిమితమైపోతుంది. నాలుగు దశాబ్దాల సాగతీతలో ఎలాంటి పరిణామాలుంటాయో తెలుసుకోవడానికి ఈ కేసు ఓ ప్రబల నిదర్శనం.

> ఇచ్చింది మరిచిపోవడం, పుచ్చుకున్నది జ్ఞాపకముంచుకోవడమే స్నేహం.
>
> మహాత్మా గాంధీ



> ఒక వ్యక్తి పవిత్రమైన ఆలోచనలతో మాట్లాడినా, లేక పనిచేసినా ఎప్పటికీ ఆనందం అతని వెన్నంటే ఉంటుంది.
>
> గౌతమబుద్ధుడు



# ఇకనైనా ఈ చావులను ఆపలేమా?

**మద్యం ద్వారా జరుగుతున్న ఈ అనర్థాన్ని పాలకులు గుర్తించడం లేదు. గుర్తించినా ఆదాయం ముందు ఈ ప్రాణాలను లెక్కలోకి తీసుకోవడం లేదు. ఇకపోతే పోలీసుల పాత్ర కూడా తక్కువేమీ కాదు. నా చిన్ని బొజ్జకు శ్రీరామరక్ష అన్నట్లు తమ మామూళ్లు తమకు వస్తే చాలన్నట్లు కొన్ని ప్రాంతాల్లో వ్యవహరిస్తున్నారు. ఇక లోపభూయిష్టమైన రోడ్ల నిర్మాణాలకు కారకులైన కాంట్రాక్టర్లను, ఇంజినీర్లను ప్రమాదాలకు బాధ్యులుగా చేసి కటకటలావెనక్కి నెట్టాలి. మొత్తం మీద నీచేతన్, నాచేతన్ వరమడిగిన కుంతి చేతన్...అన్నట్లు అందరూ ఈ చావులకు బాధ్యులే. ఇప్పటికైనా పాలకులు కళ్లు తెరవాలి. ఈ ప్రమాదాలకు అడ్డుకట్ట వేయాలి. మద్యం మత్తులో వాహనం నడిపి ప్రాణాలు తీసిన వాహనచోదకులకు కఠిన జైలు శిక్షతోపాటు మళ్లీ జీవిత కాలంలో వాహనం నడపడానికి వీలు లేకుండా చట్టాన్ని సవరించాలి. రాజకీయాలకు అతీతంగా చర్యలు చేపట్టాలి. అంతేకానీ సమీక్షలు, సమావేశాలు, పత్రికా ప్రకటనలతో కాలం గడిపితే ఈ మారణహోమం ఆగదు.**

దామెర్ల సాయిబాబ

యుద్ధానికి వెళుతున్న వీరుడు విజయమో, వీరస్వర్గమో అన్నట్టుగా కదనరంగంలో దూకుతాడు. అయితే యుద్ధంలో విజయం సాధించి తిరిగి రావడమో, లేక పోరులోఅమరుడు కావడమో జరుగుతుంది. అలా యుద్ధంలో అసువులు బాసినా దానికి ఒక లక్ష్యం, అర్థం, పరమార్థం ఉంటుంది. వీటన్నింటికి మించి దేశం కోసం ప్రాణత్యాగం చేశామనేమాటలకందని తృప్తి ఉంటుంది. మనదేశం కోసం యుద్ధంలో అసువులు బాసిన మన వీర జవానులను ఇప్పటికీ మననం చేసుకుంటూనే ఉంటాం. జోహార్లు అర్పిస్తూనే ఉంటాం. కానీ ఏలక్ష్యం లేదు. అన్నెంపున్నెం ఎరుగని వేలాది మంది అమాయకులు రోడ్డుప్రమాదాలకు బలైపోతున్నారు. లక్షలాది మంది అంగవికలురుగా మారి కుటుంబానికి భారమై జీవితాంతం నరకం అనుభవిస్తున్నారు. కేంద్ర రోడ్డు రవాణా రహదారుల మంత్రిత్వశాఖ తాజా లెక్కల ప్రకారం గత యేడాది దేశవ్యాప్తంగా లక్షాఎనభై మూడువేల మందిని ఈ రోడ్డు ప్రమాదాలు కబలించాయి. అంతకుముందు యేడాది కంటే దాదాపు మూడున్నర శాతం ఎక్కువైనట్లు అధికార రికార్డులే వెల్లడిస్తున్నాయి. 2024లో దేశవ్యాప్తంగా జరిగిన రోడ్డు ప్రమాదాల గురించి వెలువడిన నివేదికను పరిశీలించినా ఈ విషయం స్పష్టమవుతున్నది. దేశవ్యాప్తంగా పరిశీలిస్తే 2024లో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో రోజుకు సగటున నాలుగువందల ఎనభైఐదు మందికిపైగా ప్రాణాలు కోల్పోతుండగా, 1292 మంది గాయపడినట్లు ఆ నివేదిక వెల్లడిస్తున్నది. ఇవన్నీ అధికారిక లెక్కలే. పోలీసు రికార్డుల్లోకి రాని, అందని మరణాలు ఎన్ని ఉన్నాయో చెప్పలేం. ప్రమాదాల్లో చనిపోయేవారిలో అధికశాతం ఇరవై ఏళ్ల నుంచి ముప్పైఐదుయేళ్ల లోపువారే. ఈ ప్రమాదాల గూర్చి పాలకులకు తెలియంది కాదు. ప్రమాదాల్లో ప్రముఖులు ఎవరైనా చనిపోయినప్పుడు, పెద్ద ఎత్తున మరణాలు సంభవించినప్పుడు వీటిని నివారిస్తామని, బాధ్యులైన వారిపై చర్యలు తీసుకుంటామని పెద్ద పెద్ద ప్రకటనలు ఇవ్వడం, హడావుడి చేయడం, ఆ తర్వాత మరచిపోవడం సంప్రదాయంగా మారిపోయింది. ఇప్పుడేకాదు దశాబ్దాల తరబడి ఇదే తంతు జరుగుతున్నది. విజయవాడలో రోడ్డు ప్రమాదంలో ఆనాటి ముఖ్యమంత్రి ఎన్టీరామారావు ముఖ్య కార్యదర్శి రాఘవేంద్రరావు మరణించినప్పుడు దాదాపు అధికార యంత్రాంగం అంతా విజయవాడకు వెళ్లింది. సుదీర్ఘచర్చ జరిపారు. అప్పటికప్పుడు కొన్ని నిర్ణయాలు తీసుకునేందుకు అంకురార్పణ జరిగింది. రోడ్డు భద్రతా వ్యవస్థను ఏర్పాటు చేశారు. ఆ తర్వాత కొన్ని మార్పులతో మరింత పటిష్టంగా పర్యవేక్షణ చేసేందుకు పోలీసు డైరెక్టర్ జనరల్ స్థాయి అధికారిని ఆ విభాగానికి అధిపతిగా నియమించారు. ఆతర్వాత ఎన్నో మార్పులు, చేర్పులు జరిగాయి. అప్పటి నుంచి ఆ అధికారికి కార్యాలయానికి యేటాలక్షలాది రూపాయలు వెచ్చిస్తున్నారు. రాష్ట్రం విడిపోయిన తర్వాత రెండుౘ విభాగాలు ఏర్పడ్డాయి. కానీ ఆ రెండు విభాగాల అధిపతులను పని చేయనీయకుండా కేవలం సంతకం పెట్టివెళ్లే పరిస్థితి కల్పించి మూలన కూర్చోబెట్టి జీతభత్యాలు చెల్లిస్తున్నారు. తమకు నచ్చని, తమ మాట వినని అధికారులను పనిష్మెంట్‌లాగా ఈ పోస్టులో నియమిస్తున్నారు. రాష్ట్రంలో అత్యంత సమర్థులుగా పేరు తెచ్చుకున్న కొందరు అధికారులను సైతం రాష్ట్రాల్లో ప్రభుత్వాలు మారినప్పుడు ఈ విభాగంలో అధిపతిగా పని లేకుండా కూర్చోబెట్టిన సందర్భాలు ఎన్నో ఉన్నాయి. ఇక కేంద్రస్థాయిలో కూడా ప్రయత్నాలు జరుగుతున్నాయి. రోడ్డు ప్రమాదాల తీవ్రతను గుర్తించిన కేంద్ర ప్రభుత్వం2005లోనే కేబినెట్ సబ్ కమిటీ సూచన మేరకు రహదారి భద్రత, ట్రాఫిక్ నిర్వహణ అంశంపై ఎస్.సుందర్ నేతృత్వంలో ఒక కమిటీని నియమించింది. దేశవ్యాప్తంగా జరుగుతున్న రోడ్డు ప్రమాదాలను సమగ్ర అధ్యయనం చేసిన కమిటీ 2007 ఫిబ్రవరిలో ఒక నివేదిక సమర్పించింది. ఎనభైశాతం ప్రమాదాలు డ్రైవర్ల నిర్లక్ష్యం, మద్యం సేవించడం తదితర కారణాల వల్లనే జరుగుతున్నాయనేది ఆ కమిటీ నివేదికలో పేర్కొన్నది. అభివృద్ధికి సోపానాలుగా వర్ధిల్లాల్సిన రహదారులు వికలాంగమో, వీరస్వర్గమో అన్నట్లుగా దాపురిస్తున్నాయి. పరిస్థితి ఇలాగే కొనసాగితేరాబోయే దశాబ్దకాలంలో మరెన్ని లక్షల మంది అసువులు బాస్తారో? మరెన్ని కోట్ల మంది క్షతగాత్రులవుతారో?. తాజాగా మొన్న సోమవారం రాజమహేంద్రవరంలో మద్యం మత్తులో ఇద్దరు యువకులు కారుతో ఢీకొట్టడంతో పోస్టుగ్రాడ్యుయేట్ చేస్తున్న మెడికో చావు బతుకుల మధ్య మృత్యువుతో పోరాడుతున్నది. మద్యం మైకంలో ఇద్దరు యువకులు సోమవారం రాత్రి మొదటిసినిమా అయిపోయిన తర్వాత రెండో సినిమా చూసేందుకు కారుతో స్పీడ్‌గా ఆవరణలోకి ప్రవేశించారు. గమనించిన సెక్యూరిటీ సిబ్బంది వారిపరిస్థితి చూసివెంటనే బయటకు వెళ్లమని హెచ్చరించడంతో కోపోద్రేకులైన ఆ యువకులువచ్చిన దానికంటే వేగంగా కారులో బయటకు వస్తున్న సమయంలో మొదటి సినిమా చూసి బయటకు వస్తున్న మెడికోలను ఢీకొట్టడంతో కిందపడిపోయారు. ఎందుకు ఇలాచేశారని అడుగుతున్న దశలోనే అవేమీ పట్టించుకోకుండా అంతకంటే రెట్టింపు స్పీడ్‌తో వారిపైనుండికారును పోనివ్వడంతో మెడికో తలపై నుండి కారు టైర్ వెళ్లింది. అపస్మారక స్థితిలో ఉన్న ఆమెను స్థానికులు ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. మెరుగైన చికిత్సకోసం తల్లిదండ్రులు ఆమెను హైదరాబాద్‌కు తరలించారు. ప్రాణాలు కాపాడేందుకు డాక్టర్లు శతవిధాలా ప్రయత్నం చేస్తున్నారు. అయితే ఆమెకు బ్రెయిన్ డెడ్‌అయినట్లు సమాచారం. ఇలాంటి సంఘటనలు మద్యంమత్తులో వాహన చోదకుల వల్ల ఎన్నో జరుగుతున్నాయి. భర్తలను కోల్పోయిన భార్యలను, తల్లిదండ్రులను కోల్పోయిన పిల్లలను, పిల్లలను కోల్పోయిన తల్లిదండ్రులు ఇలా ఒక్కరేమిటి గతపదేళ్లలో దేశంలో లక్షలాది కుటుంబాలు పడుతున్న మానసిక వేదనవర్ణనాతీతం. ప్రమాదాల్లో కుటుంబ సభ్యులను కోల్పోయిన అభాగ్యులకు ఏమిచ్చినా, మాటలతో ఎంత ఊరట కలిగించినా ఆలోటును తీర్చలేం, పూడ్చలేం. తమ ఆప్తులను కడసారి చూడడానికి కూడా నోచుకోనివారెందరో ఉన్నారు. లక్షలాది మందిని పొట్టన పెట్టుకుంటున్న ఈ ప్రమాదాల నివారణకు త్రికరణశుద్ధిగా ప్రయత్నం జరగడం లేదేమోననిపిస్తున్నది. సమీక్షలు, సమావేశాలకు, అధ్యయనాలకు కొరత లేదు. ఎన్నో ప్రతిపాదనలు కాగితాలకే పరిమితమవుతున్నాయి. ప్రమాదాలకు మూలకారణాల గూర్చి ఇప్పటివరకు ఎన్నో అధ్యయన కమిటీలు నివేదికలు ఇచ్చాయి. ముఖ్యంగా మద్యం వాడకం పెరగడం కూడా ఈ ప్రమాదాలను పెంచుతున్నది. లైసెన్సు విధానంలో ఇంకా పటిష్టమైన మార్పులు అవసరం ఉంది. మద్యం ఆదాయాన్ని పెంచుకోవడంకోసం బెల్టుషాపుల పేరుతో ఎక్కడికక్కడ అనుమతులు ఇచ్చారు. రహదారుల వెంట ఉండే అధికార, అనధికార మద్యంషాపులు డ్రైవర్లనుమత్తులో ముంచుతున్నాయి. మితిమీరిన ఆల్కహాల్ తీసుకోవడం వల్ల ఏకాగ్రత లోపించి డ్రైవింగ్ అదుపు తప్పిపోతుందని డాక్టర్లు కూడా అభిప్రాయ పడుతున్నారు. మద్యం ద్వారా జరుగుతున్న ఈ అనర్థాన్ని పాలకులు గుర్తించడంలేదు. గుర్తించినా ఆదాయం ముందు ఈ ప్రాణాలను లెక్కలోకి తీసుకోవడం లేదు. ఇకపోతే పోలీసుల పాత్ర కూడా తక్కువేమీ కాదు. నా చిన్ని బొజ్జకు శ్రీరామరక్ష అన్నట్లు తమ మామూళ్లు తమకు వస్తేచాలన్నట్లు కొన్నిప్రాంతాల్లో వ్యవహరిస్తున్నారు. ఇక లోపభూయిష్టమైన రోడ్ల నిర్మాణాలకు కారకులైన కాంట్రాక్టర్లను, ఇంజినీర్లను ప్రమాదాలకు బాధ్యులుగా చేసి కటకటలావెనక్కి నెట్టాలి. మొత్తంమీద నీచేతన్, నాచేతన్ వరమడిగిన కుంతి చేతన్...అన్నట్టు అందరూ ఈ చావులకు బాధ్యులే. ఇప్పటికైనా పాలకులు కళ్లుతెరవాలి. ఈ ప్రమాదాలకు అడ్డుకట్ట వేయాలి. మద్యంమత్తులో వాహనంనడిపి ప్రాణాలు తీసిన వాహనచోదకులకు కఠిన జైలుశిక్షతోపాటు మళ్లీ జీవితకాలంలో వాహనం నడపడానికి వీలు లేకుండా చట్టాన్ని సవరించాలి. రాజకీయాలకు అతీతంగా చర్యలు చేపట్టాలి. అంతేకానీ సమీక్షలు, సమావేశాలు, పత్రికా ప్రకటనలతో కాలం గడిపితే ఈ మారణహోమం ఆగదు. ●

## ఒక్క మాట

# హరిత శక్తే వికసిత భారతానికి పునాది

సి.హెచ్.ప్రతాప్

భారతదేశ ఇంధన రంగంలో గత రెండు దశాబ్దాలుగా ఒక నిశ్శబ్ద విప్లవం చోటుచేసుకుంటోంది. ఒకప్పుడు బొగ్గు, చమురు, సహజ వాయువుపై ఆధారపడిన దేశం నేడు ప్రపంచంలోనే అత్యంత వేగంగా పునరుత్పాదక ఇంధన సామర్థ్యాన్ని పెంచుతున్న దేశాల్లో ఒకటిగా ఎదిగింది. భారతదేశంలో పునరుత్పాదక ఇంధన ప్రయాణం 1980ల లో ప్రారంభమైనప్పటికీ, 2010 తరువాత దీనికి నిజమైన వేగం లభించింది. 2015లో దేశంలో మొత్తం పునరుత్పాదక ఇంధన సామర్థ్యం సుమారు 38గిగావాట్లు మాత్రమే ఉండగా, 2020 నాటికి అది 87 గిగావాట్లకు చేరుకుంది. ప్రస్తుతం (జూన్ 2026 నాటికి) దేశంలో మొత్తం పునరుత్పాదక ఇంధన స్థాపిత సామర్థ్యం 288.58 గిగావాట్లకు చేరింది. ఇందులో సౌరశక్తి ఒక్కటే 162.15 గిగావాట్లతో అగ్రస్థానంలో ఉండగా, పవన విద్యుత్, జలవిద్యుత్, బయో మాస్, చిన్న జలవిద్యుత్ ప్రాజెక్టులు మిగిలిన భాగాన్ని అందిస్తున్నాయి. ఈప్రగతికి ప్రధాన కారణం ప్రభుత్వ విధానాలే. జాతీయ సౌర మిషన్, పీఎంకుసుమ్, గ్రీన్ ఎనర్జీ కారిడార్, ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహకాలు, సౌర ప్యానెళ్ల దేశీయ తయారీ, విద్యుత్ పంపిణీ సంస్కరణలు ఈ రంగానికి ఊతమిచ్చాయి. 2024లో ప్రారంభించినప్రధానమంత్రి సూర్యఘర్ ముఫ్త్ బిజ్లీ యోజన హరిత ఇంధన రంగంలో మరోమైలురాయిగా నిలిచింది. రూ.75,021 కోట్ల వ్యయంతో అమలవుతున్న ఈ పథకం ద్వారా ఒక కోటిగృహాలపై రూఫ్‌టాప్ సోలార్ వ్యవస్థలు ఏర్పాటు చేసి నెలకు 300యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందించడం లక్ష్యంగా పెట్టుకుంది. తాజాగా ఈపథకం కింద 50లక్షల గృహాలు రూఫ్‌టాప్ సోలార్‌ను ఏర్పాటు చేసుకున్నాయి. సుమారు 14.8 గిగావాట్ల సామర్థ్యం ఇప్పటికే గ్రిడ్‌కుచేరగా, దాదాపు 19లక్షల కుటుంబాలు నెలవారీ విద్యుత్ బిల్లులను గణనీయంగా తగ్గించుకున్నాయి. లేదా పూర్తిగా శూన్యబిల్లును పొందుతున్నాయి. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం ఈ పథకం రెండో దశపై దృష్టి సారించింది. రూఫ్‌టాప్ సోలార్‌తో పాటుబ్యాటరీ నిల్వవ్యవస్థలు, గ్రామీణ ప్రాంతాల విస్తరణ, వికేంద్రీకృత విద్యుత్ ఉత్పత్తికి ప్రాధాన్యం ఇవ్వాలని పరిశీలిస్తోంది. సౌరశక్తి పగటి వేళల్లో మాత్రమే లభించడంతో, బ్యాటరీ నిల్వవ్యవస్థలు భవిష్యత్ విద్యుత్‌భద్రతకు కీలకంగా మారనున్నాయి. అందుకే విద్యుత్ ప్రసార వ్యవస్థల విస్తరణ, శక్తి నిల్వ సామర్థ్యాల పెంపుతదుపరి దశలో అత్యంతప్రాధాన్య అంశాలుగా కేంద్రం గుర్తించింది. భారతదేశం 2030నాటికి 500గిగావాట్ల నాన్‌ఫాసిల్ విద్యుత్ సామర్థ్యం, మొత్తం విద్యుత్ అవసరాల్లో సగానికి పైగా స్వచ్ఛ ఇంధన వనరుల నుంచి సమకూర్చడం, అలాగే 2070 నాటికి నికర సున్నా కార్బన్ ఉద్గారాలు సాధించడం వంటి ప్రతిష్ఠాత్మక లక్ష్యాలను నిర్దేశించుకుంది. ఈ లక్ష్యాలను చేరుకోవడానికి ప్రతి సంవత్సరం భారీ స్థాయిలో సౌర, పవన విద్యుత్ ప్రాజెక్టులు, విద్యుత్ నిల్వవ్యవస్థలు, గ్రీన్ హైడ్రోజన్‌ఉత్పత్తి, ప్రసార మౌలిక సదుపాయాల్లో పెట్టుబడులు అవసరం. హరిత ఇంధనం కేవలం పర్యావరణ పరిరక్షణకు మాత్రమే కాదు. అది ఇంధన స్వావలంబనకు, రైతుల ఆదాయపెంపునకు, కొత్తఉపాధి అవకాశాలకు, దిగుమతి చమురుపైఆధారపడటాన్ని తగ్గించడానికి కూడా బలమైన సాధనం. ●

# ప్రజావాక్కు

### ప్రకృతి అభివృద్ధి సమన్వయమే శాశ్వత పునాది

**భారత్**‌వేగంగా అభివృద్ధి చెందుతోంది. జాతీయ రహదారులు, రైల్వే కారిడార్లు, విమానాశ్రయాలు, పారిశ్రామిక పార్కులు, డిజిటల్ మౌలిక సదుపాయాల విస్తరణ దేశ ఆర్థిక సామర్థ్యాన్ని పెంచుతున్నాయి. అయితే ఈ ప్రగతి ప్రకృతి వనరుల సంరక్షణతో సమన్వయంగా సాగితేనే దీర్ఘకాలికఫలితాలు లభిస్తాయి. అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ రెండూ పరస్పర విరుద్ధాలు కావు. సరైన విధానాలతో ఒకదానికొకటి బలాన్ని చేకూర్చగలవు. 1987లో బ్రంట్‌లాండ్ కమిషన్ నివేదిక ఆధారంగా ఐక్యరాజ్యసమితి ప్రతిపాదించిన సుస్థిర అభివృద్ధి భావన ప్రపంచ విధానాలకు దిశానిర్దేశం చేసింది. భావితరాల అవసరాలను దెబ్బతీయకుండా నేటి అవసరాలను తీర్చేఅభివృద్ధినే నిజమైన ప్రగతిగా నిర్వచించింది. భారత అటవీ సర్వేప్రకారం దేశంలోఅటవీ, వృక్ష సంపదకలిపి8.27 లక్షల చ.కి.మీ., అంటే దేశ భౌగోళిక విస్తీర్ణంలో 25.17 శాతం ఉంది. ప్రకృతి-అభివృద్ధిసమన్వయమే ఆర్థికవృద్ధికి, పర్యావరణ భద్రత కు, సుస్థిర భారత నిర్మాణానికి శాశ్వత పునాది.

- సి,సాయిరుత్విక్, శ్రీకాకుళం

### ప్రజలకు చేరువుగా..

**భారత్** ఇప్పుడు సరికొత్త ఆలోచన దిశగా ప్రయాణం చేస్తున్నది. ప్రపంచానికి ఒక కొత్త దారిని చూపుతోంది. ఆ యువ ఉద్యమనాయకుడు సరికొత్త నినాదంతో బయలుదేరాబోతున్నాడు. ప్రజల దగ్గరికివెళ్లే ఉద్దేశంతో ప్రజల మనసులో ఏముందో తెలుసుకోవడానికి ప్రజల సమస్యలు దగ్గరగా వినడానికి ప్రజలదగ్గరికి వెళ్ళబోతున్నారు. ఇదిమంచినిర్ణయమే కాకస్ఫూర్తి వంతమైనాఅడుగుకూడా. ప్రతి నాయకుడు ఎప్పుడు గొప్ప నాయకుడు అవుతాడు అంటే ప్రజలకు చెరువుగా వెళ్ళినప్పుడు. ప్రజలకు మంచి చేయాలి అంటే రాజకీయ నాయకులే కానవసరం లేదు ప్రభుత్వాలపైన ఒత్తిడి తెచ్చి ప్రజలకు మంచి చేయొచ్చు.

- భారత అవినాష్, జనగాం

### సోషల్ మీడియా తగ్గించాలి

**ఇటీవలి** కాలంలో చిన్న పిల్లలు సోషల్ మీడియా వాడకం విపరీతంగాపెరగడంతో పిల్లలఆరోగ్యం దెబ్బతినడంతో పాటు భవిష్యత్ జీవితంలో ఇబ్బందులు పడే అవకాశంఉంది. కావున తల్లిదండ్రులు పిల్లలతో వీలైనంత ఎక్కువ సమయం గడపాలి. వీలైనంత వరకు దూరంగా ఉంచడమే మంచిదని అధికారులు సూచిస్తున్నారు.

- మోతె శివకుమార్, రంగారెడ్డి జిల్లా

### అసెంబ్లీ సమావేశాలలో భూ ఆక్రమణపై చర్చ!

చంద్ర బాబుగారు ప్రభుత్వ భూములు అక్రమిస్తే జైలే గతి అన్నాడు. పవన్ కళ్యాణ్ గారు అటవీ భూములు ఆక్రమిస్తే తాట తీస్తానన్నాడు. ఇద్దరి ప్రకటనలు నిలబెట్టుకునే విధంగా, నిరూపించుకునే విధంగా రాష్ట్రంలో దొంగబాబాలు ఆక్రమించిన ప్రభుత్వభూములను స్వాధీనంచేసుకొని , జైలుకు పంపడం, తాట తీయడం జరగాలంటే అసెంబ్లీలో దొంగబాబాల భూఆక్రమణల మీద చర్చ జరగాలి. ఏజిల్లాలో ఎ బాబా ఎన్ని ఎకరాలు ఆక్రమించాడు, స్వాధీనం చేసుకోలేక పోవటానికి కారణాలు ఏమిటి? ప్రభుత్వం ఎక్కడ వైఫల్యం చెందింది? ఎవరైనా అడ్డుపడుతున్నారా? అలా అడ్డుపడే వారి మీద చర్యలు స్పష్టంగా జరగాలి. సుప్రీం కోర్టు ప్రభుత్వభూముల్లో మతపరమైన చిహ్నాలు ,బొమ్మలు , మందిరాలు ఉండకూడదని చాలాసార్లు రాష్ట్ర ప్రభుత్వాలను హెచ్చరించింది. సుప్రీం తీర్పును అమలు పరచే విధంగా చర్యలు చేపట్టాలి.

- నార్నె వెంకటసుబ్బయ్య, ప్రకాశం జిల్లా

### డిప్యూటేషన్‌ను రద్దు చేయాలి

తెలంగాణ రాష్ట్రంలో ఉన్నవరంగల్ జిల్లా ఖానాపురం మండలం అశోక్ నగర్ ఎస్టీ సైనిక్ స్కూల్, కరీంనగర్ జిల్లా రుక్మాపూర్ ఎస్సి సైనిక్‌స్కూల్ ఈ2 సైనిక్ స్కూల్‌లలో డిప్యూటేషన్‌లను రద్దు చేయాలి. ఇక్కడ 700 మంది కి పైగా విద్యార్థులుఉన్నారు. అడ్మినిస్ట్రేషన్ పరంగా ఇద్దరు టీచింగ్ సిబ్బంది అవసరం. జనరల్ నాలెడ్జి, పోటీ పరీక్షలు, ఉద్యోగం నోటిఫికేషన్‌ల గురించి తెలియజేయడం కోసం అదనంగా ఇద్దరు టీచింగ్ సిబ్బంది అవసరం. ఇక్కడ పనిచేసేవారిని ఇతర చోట్లకు డిప్యూటేషన్లు రద్దుచేసి సైనిక్ స్కూల్‌లలో సేవలందించే విధంగా కృషి చేయాలి.

- కదురు శ్రీనివాస్, వరంగల్

### గ్రామీణ రోడ్లను బాగు చేయాలి

గ్రామీణ ప్రాంతాల్లోరోడ్లు ప్రమాదకరంగా మారాయి. చాలా గ్రామాలలో రోడ్లు గుంతలమయంగా మారి, కంకరతేలి ప్రమాదాలు జరిగే విధంగా తయారయ్యాయి. అదే విధంగా రోడ్ల వెంట కంపచెట్లు పెరిగి వాహనదారులు గాయపడేవిధంగా ఉంటున్నాయి. వెంటనే సంబంధిత అధికారులు ప్రమాదకరంగా దెబ్బతిన్నరోడ్లను పరిశీలించి తాత్కాలిక మరమ్మత్తులు చేపట్టాలి. కనీసం గుంతలలో మట్టినైనా నింపి వాహన దారులు ప్రమాదాలకు గురికాకుండా తగుచర్యలు తీసుకోవాలి. గ్రామాల్లోనేకాకుండా నగరాల్లో కూడారోడ్లను బాగు చేయాలి.

-టి. యోగేందర్, నల్గొండ

# ఎల్‌నినో..ఈ శతాబ్దపు అసలు సవాల్!

డి జె మోహన రావు

ప్రపంచం ఒకే జీవవ్యవస్థగా మారిపోయిన ఈ యుగంలో, మన అభివృద్ధి నమూనా ప్రకృతితో కలిసి నడవడానికి సిద్ధంగా ఉందా?' ఈ ప్రశ్నకు సమాధానం వెతకకుండా ఇరవై ఒకటవ శతాబ్దపు అభివృద్ధిని అర్థం చేసుకోవడం అసాధ్యం. మానవ నాగరికత ఎంతగానో ముందుకు దూసుకుపోతున్న ఈ తరుణంలో, ప్రకృతితో మన సంబంధం ఎలాంటిదనే మీమాంస ప్రతి ఒక్కరినీ కలవరపెడుతోంది. కొన్ని వేల కిలోమీటర్ల దూరంలో పసిఫిక్ మహాసముద్ర జలాలు కొద్దిగా వేడెక్కుతాయి. దాని పేరు ఎల్‌నినో. కొన్ని వారాల తర్వాత భారతదేశంలో వర్షాలపై ఆందోళన మొదలవుతుంది. రైతు ఆకాశం వైపు చూస్తాడు. ప్రభుత్వం రుతుపవనాల అంచనాలను పరిశీలిస్తుంది. మార్కెట్ ఆహార ధరలను లెక్కిస్తుంది. రిజర్వు బ్యాంకు ద్రవ్యోల్బణాన్ని అంచనా వేస్తుంది. ఒక సముద్రంలో ప్రారంభమైన ఉష్ణ మార్పు మరో ఖండంలోని కుటుంబ బడ్జెట్‌ను ఎలా ప్రభావితం చేస్తుంది? ఈ ప్రశ్నకు సమాధానం వెతికినప్పుడు మనం కేవలం ఎల్‌నినో గురించి మాత్రమేకాకుండా మనం నిర్మించుకున్న అభివృద్ధి నమూనా గురించి కూడా కొత్తగా ఆలోచించాల్సి వస్తుంది. ఇప్పటివరకు మనం ప్రపంచీకరణను పూర్తిగా మనుషులు సృష్టించిన వ్యవస్థగానే చూశాం. వస్తువులు దేశాలు దాటాయి, పెట్టుబడులుఖండాలు దాటాయి, సమాచారం క్షణాల్లో ప్రపంచాన్ని చుట్టివచ్చింది. ప్రపంచం ఒక గ్రామమైందని గర్వంగా చెప్పుకున్నాం. కానీ ప్రకృతి మనకంటే ముందే ప్రపంచాన్ని ఒకే జీవవ్యవస్థగా మలిచింది. గాలి సరిహద్దులను గుర్తించదు, సముద్ర ప్రవాహాలు వీసాలను అడగవు, మేఘాలు రాజకీయ పటాలను అనుసరించవు. ఒక మహాసముద్రంలో పుట్టిన ఉష్ణం మరో దేశంలో పంటను దెబ్బతీస్తే, ఒక అడవిలో జరిగిన విధ్వంసం మరో ఖండంలోని వర్షపాతాన్ని మార్చగలిగితే, ఒక దేశం విడుదల చేసిన కార్బన్ ప్రపంచ ఉష్ణోగ్రతనుపెంచితే, మనం ఇంకా 'స్థానిక సమస్యలు' అనే పదాన్ని ఉపయోగించడం ఎంతవరకు సమంజసం? అభివృద్ధి గురించి మన ఆలోచనల్లో ఒక మౌలిక లోపం ఉంది. ప్రకృతిని మనం ఎప్పుడూ ఒక నేపథ్యంగా మాత్రమే చూశాం. రహదారులు నిర్మించాం, ఆనకట్టలు కట్టాం, పరిశ్రమలు స్థాపించాం, నగరాలు విస్తరించాం. అభివృద్ధి అనేది ప్రకృతిపై మనిషి సాధించిన విజయమని గర్వంగా భావించాం. కానీ ప్రతి వాతావరణ సంక్షోభం ఆ భావనను ఒక్కొక్కటిగా కూల్చేస్తోంది. అభివృద్ధి ప్రకృతిని జయించడం కాదని, ప్రకృతిని విస్మరించి నిర్మించిన నిర్మాణం చివరికి తనకే భారమవుతుందని ఈ శతాబ్దం మనకు కఠినంగా నేర్పుతోంది. ఎల్‌నినో ఇక్కడ కేవలం ఒక ఉదాహరణ మాత్రమే. ప్రశ్న దాని కంటే చాలా పెద్దది. ప్రకృతివ్యవస్థల్లో ఏర్పడే చిన్న మార్పులను కూడా తట్టుకునేలా మన ఆర్థిక వ్యవస్థను మనం నిర్మించామా? ప్రపంచ వాతావరణ సంస్థ, వాతావరణ మార్పులపై అంతర్ ప్రభుత్వ నిపుణుల మండలి (ఐపిసిసి) దశాబ్దకాలంగా ఒకే విషయాన్ని హెచ్చరిస్తున్నాయి. వాతా




వరణ మార్పు అనేది భవిష్యత్తులో రాబోయే ప్రమాదం కాదు. ప్రస్తుతం మన ఆర్థిక వ్యవస్థలను పునర్నిర్మిస్తున్న ఒక వాస్తవిక శక్తి అయినప్పటికీ ప్రపంచ దేశాల అభివృద్ధి ప్రణాళికల్లో వాతావరణాన్ని ఇప్పటికీ ఒకప్రత్యేక అధ్యాయంగా మాత్రమే చూస్తున్నాం. వాస్తవానికి అది ప్రతి ఆర్థిక, సామాజిక అధ్యాయంలో అంతర్భాగంగా ఉండాల్సినఅంశం. వ్యవసాయాన్ని, ఆహార వ్యవస్థను పరిశీలిస్తే ఈ నిజం మరింత స్పష్టమవుతుంది. వర్షాలు తగ్గితే పంటలు దెబ్బతింటాయని మనకు తెలుసు. కానీ అసలు సమస్య కేవలం పంటల ఉత్పత్తి గురించి కాదు. సమగ్ర ఆహార వ్యవస్థ గురించినది. పొలంలో ప్రారంభమైన సంక్షోభం అక్కడితో ఆగదు. అది రైతు ఆదాయాన్ని గణనీయంగా ప్రభావితం చేస్తుంది. రైతు కొనుగోలు శక్తి తగ్గడంతో గ్రామీణ మార్కెట్లు మందగిస్తాయి, ఆహార ధరలు విపరీతంగా పెరుగుతాయి. దానివల్ల ద్రవ్యోల్బణం ఎగబాకుతుంది. చివరకు రిజర్వ్ బ్యాంకు విధానం మారి, పెట్టుబడులపై తీవ్రప్రభావం పడుతుంది. అంటే ప్రకృతి ఒక రంగాన్ని మాత్రమే ప్రభావితం చేయదు. రంగాల మధ్య ఉన్న సున్నితమైన సంబంధాలన్నింటినీ కుదిపేస్తుంది. నీటి కథ కూడా దీనికి భిన్నంగా ఏమీ లేదు. మనం నీటిని కేవలం ఒక వనరుగా మాత్రమే చూస్తాం. కానీ ప్రకృతి దానిని ఒక నిరంతర చక్రంగా చూస్తుంది. వర్షం, నది, భూగర్భ జలం, అడవి, నేల, సముద్రం ఇవి ఏవీ విడివిడిగా పనిచేయవు. కానీ మన అధికారిక ప్రణాళికల్లో మాత్రం ఇవి వేర్వేరు ప్రభుత్వశాఖల బాధ్యతలుగా ఉండిపోతున్నాయి. ఫలితంగా ఒకచోట వినాశకరమైన వరదలు, మరోచోట తీవ్రమైన కరవు, ఇంకొకచోట తాగునీటి సంక్షోభం ఒకేసారి కనిపిస్తాయి. సమస్య నీటి కొరతలో మాత్రమే లేదు. ప్రకృతి ఒక సమగ్ర వ్యవస్థగా పనిచేస్తుంటే, మన పరిపాలన విభాగాలుగా విడిపోయి ఆలోచించడంలోనే అసలు లోపం ఉంది. ఆర్థిక వ్యవస్థ విషయంలోనూ ఇదే సత్యం. స్థూల దేశీయోత్పత్తి వృద్ధిని మనం విజయానికి ఏకైక కొలమానంగా భావిస్తాం. కానీ ఆ వృద్ధి ఏ పునాదిపై నిలబడి ఉంది? తీవ్రమైన ఉష్ణతరంగాలు కార్మికుల ఉత్పాదకతను పూర్తిగా తగ్గిస్తే, తీవ్రమైన నీటి కొరత పరిశ్రమలను మూసివేసేలా చేస్తే, సముద్ర ఉష్ణోగ్రతలు మత్స్య సంపదను సర్వనాశనం చేస్తే ఆర్థిక వృద్ధి ప్రకృతికి స్వతంత్రంగా ఎలా కొనసాగగలదు? ఇరవై ఒకటవ శతాబ్దంలో అత్యంత ప్రమాదకరమైన భ్రమ ఏమిటంటే ఆధునిక సాంకేతికత ప్రకృతిని పూర్తిగా అధిగమించిందనే అహేతుక నమ్మకం. కృత్రిమ మేధస్సు అద్భుతాలు సృష్టిస్తోంది, ఉపగ్రహాలు అంతరిక్షాన్ని నింపేశాయి. డిజిటల్ ఆర్థిక వ్యవస్థ ప్రపంచాన్ని మార్చేసింది. అయినప్పటికీ కొన్ని డిగ్రీల సముద్ర ఉష్ణోగ్రత మార్పు ప్రపంచ ఆహార ధరలను తల్లడిల్లజేస్తోంది. అంటే సాంకేతికత ప్రకృతిని ఎప్పటికీ భర్తీ చేయలేదు. ప్రకృతిపై మన ఆధారపడటాన్ని అది మరింత స్పష్టంగా, తీవ్రంగా కనిపించేలా చేసింది. ఈ నేపథ్యంలో అభివృద్ధికి సరికొత్త నిర్వచనం అవసరం. గత శతాబ్దంలో అభివృద్ధి అంటే ప్రకృతి నుంచి వీలైనంత ఎక్కువ వనరులు సేకరించడం. కానీ ఈ శతాబ్దంలో అభివృద్ధి అంటే ప్రకృతి వ్యవస్థలను దెబ్బతీయకుండా సమాజాన్ని స్థిరంగా ముందుకు నడిపించడం. గతంలో ఆర్థిక వృద్ధి మాత్రమే ప్రధాన లక్ష్యంగా ఉండేది. కానీ ఇప్పుడు సుస్థిరత లేకుండా ఏవృద్ధి కూడా నిలవదని అందరికీ అర్థమవుతోంది. గతంలో ప్రకృతి కేవలం ఒక వనరు మాత్రమే. కానీ ఇప్పుడు ప్రకృతి ఒక భాగస్వామి అని గ్రహించాల్సిన సమయం ఆసన్నమైంది. అందువల్ల భవిష్యత్తులో మనం వేయవలసిన ప్రశ్న 'మనం ఎంత వేగంగా అభివృద్ధి చెందుతున్నాం?'అనేది కాదు. 'మన అభివృద్ధి ఎంతకాలం నిలబడగలదు?' అనేదే. ●

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మన ఎడిట్ పేజీకి.. ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్ (e-mail: editpage@vaartha.com)

# 13 మందిపై సిబిఐ ఛార్జిషీటు




## నీట్ పేపర్ లీక్ కుట్ర కేసు ప్రశ్నపత్రాల తయారీ సమయంలోనే లీక్ అయినట్లు సిబిఐ దర్యాప్తులో వెల్లడి

**న్యూఢిల్లీ, ఆగస్టు 7:** పలు రాష్ట్రాల పేపర్ లీక్ కుట్ర కేసులో 13 మందిపై సిబిఐ ఢిల్లీలోని రౌస్ అవెన్యూలో ఉన్న ప్రత్యేక సిబిఐ కోర్టులో చార్జిషీట్ దాఖలు చేసింది. 94 పేజీలతో సిబిఐ ఓ నివేదికను తయారుచేసింది. ఈ ఫైలింగ్‌లో ఎన్‌టిఎకి చెందిన వృశాస్త్ర నిపుణురాలు మనీషా గురునాథ్ మంధారే, రసాయన శాస్త్ర నిపుణుడు ప్రహ్లాద్ కులకర్ణి, భౌతిక శాస్త్ర నిపుణురాలు మనీషా సంజయ్ హావల్దార్ ఎక్స్‌పర్ట్స్ పేర్లను పేర్కొంది. ఎన్‌టిఎ సెంటర్‌లో ప్రశ్నాపత్రాలను తయారు చేస్తున్న సమయంలో ఈ ముగ్గురు నిందితులు ప్రశ్నలను కంఠస్థం చేసి, చిట్టాల మీద రాసుకుని, బుక్స్‌లో సంబంధిత పేరాగ్రాఫ్‌లను మార్క్ చేసి మరీ పేపర్ లీకేజీకి పాల్పడినట్లు సిబిఐ తన రిపోర్టులో పేర్కొన్నది. కొన్ని ప్రశ్నలను ఎన్‌సిఇఆర్‌టి బుక్స్‌లో ఉన్న పేరాగ్రాఫ్‌ల్లో మార్క్ చేసినట్లు సిబిఐ చార్జ్‌షీట్ ద్వారా తెలిసింది. ఆ ముగ్గురు నిందితులకు ఎన్టీఏలో క్వశ్చన్ సెట్టింగ్, ట్రాన్స్‌లేషన్ సెక్షన్లకు యాక్సెస్ ఉందని చార్జ్‌షీట్ ద్వారా తెలిసింది. ఎన్టీఏ సెంటర్ నుంచి సేకరించిన సమాచారాన్ని నమ్మకమైన వ్యక్తులు, కోచింగ్ సెంటర్ల ద్వారా విద్యార్థులకు చేరేలా చేశారు. అయితే ఈప్రక్రియ డిజిటల్ విధా నాలను వాడకుండా నిందితులు తప్పించుకునే ప్రయత్నం చేశారు. ఆర్థికంగా లాభపడేందుకు, ట్యూషన్ విద్యార్థుల్లో సక్సెస్‌రేట్‌ను పెంచేందుకు నిందితులు ఇలా చేశారని సిబిఐ తన చార్జ్‌షీట్‌లో పేర్కొన్నది. ప్రైవేటు కోచింగ్ సెషన్స్ సందర్భాల్లో లీక్ చేసిన ప్రశ్నలను విద్యార్థులతో రాయించారని, వాటికి సంబంధించిన ఆధారాలను సేకరించినట్లు కూడా సిబిఐ తన చార్జ్‌షీట్‌లో తెలిపింది. తేలికైన ప్రశ్నలను కంఠస్థం చేసి, ఆ తర్వాత తమ హోటల్ రూమ్‌లో వాటిని పేపర్‌పై రాసుకునేవారని చార్జ్‌షీట్‌లో తెలిపారు. ఎన్‌టిఎ విధి నిర్వహణ లో నూలోపాలు ఉన్నట్లుగుర్తించారు. ఎన్‌టిఎ కేంద్రం వద్దచెకింగ్ కానీ ఫ్రిస్కింగ్ కానీ సమర్థవంతంగా లేదు. నీట్ పేపర్ లీకేజీ కేసులో ఇప్పటి వరకు మొత్తం 13 మంది నిందితులను అరెస్టు చేశారు. వీరిలో ముగ్గురు ఎన్‌టిఎ సబ్జెక్ట్ నిపుణులు కాగా, కోచింగ్ వ్యక్తులు, మధ్యవర్తులు, లాభపడిన విద్యార్థులు ఉన్నారు. ఎన్టీఏలో పనిచేస్తున్న కొందరు తమ అధికారాన్ని వాడుకుని రహస్య సమాచారాన్ని సేకరించినట్లు గుర్తించారు. ఈ కేసుతో లింకున్న సుమారు 20 వేల పేజీల ఆధారాలను ఢిల్లీలోని రౌజ్ అవెన్యూకోర్టులో సిబిఐ సమర్పించింది. సిబిఐ తన విచారణలో భాగంగా 360 మంది సాక్షులను పేర్కొన్నది. ప్రస్తుతం 13 మంది నిందితులు జుడిషియల్ కస్టడీలోనే ఉన్నారు. మే 12వ తేదీన పేపర్ లీకేజీ కేసులో సీబీఐ ఎఫ్ ఐఆర్ నమోదు చేసింది. 72 మంది ఆఫీసర్లతో బృందాలను ఏర్పాటు చేసింది. 8 మంది సైబర్ ఫోరెన్సిక్ నిపుణులు కూడా సిబిఐ విచారణకుసహకరించారు. మహారాష్ట్ర, రాజస్థాన్, హర్యానా, ఢిల్లీతోపాటు ఇతర రాష్ట్రాల్లోని 92 లొకేషన్లలో సోదాలు చేపట్టారు. ఆ తనిఖీల్లో డిజిటల్, కమ్యూనికేషన్ డివైస్‌లు, డాక్యుమెంట్లను సీజ్ చేశారు. స్వాధీనం చేసుకున్న ఆధారాలకు చెందిన ఫోరెన్సిక్ ఇమేజింగ్ జరిగినట్లు సిబిఐ వెల్లడించింది. డబ్బు లావాదేవీల కోణంలోనూ కూడా దర్యాప్తు చేపట్టారు. అనేక బ్యాంక్ అకౌంట్లు, బ్యాంక్ లాకర్లు, డీమాట్ అకౌంట్లను సీజ్ చేసినట్లు సిబిఐ తన రిపోర్టులో పేర్కొన్నది.

# జన్మతః పౌరసత్వం నిబంధనల్లో మార్పులు



## రెండు ఎగ్జిక్యూటివ్ ఆర్డర్లపై యుఎస్ అధ్యక్షుడు ట్రంప్ సంతకాలు

## భారతీయులకు మళ్లీ కష్టాలు

**వాషింగ్టన్, ఆగస్టు 7:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కొత్తగా రెండు ఎగ్జిక్యూటివ్ ఆర్డర్లపై సంతకంచేశారు. విదేశీ వలసదారుల పిల్లలకు జన్మతఃలభించే పౌరసత్వాన్ని పరిమితం చేయడం, బర్త్ టూరిజాన్ని నిషేధించడం ఈ ఉత్తర్వుల ఉద్దేశం. అక్రమ వలసదారులు, తాత్కాలిక వీసాలు కలిగిన వారి పిల్లలు అమెరికాలో జన్మిస్తే వారిని అమెరికన్లుగానే పరిగణించాలని నెల రోజుల క్రితం ఆ దేశ సుప్రీంకోర్టు తీర్పునిచ్చిన సంగతి తెలిసిందే. విదేశీయుల పిల్లలకు పౌరసత్వం నిరాకరించాలనే ట్రంప్ ప్రయత్నం అప్పటికి వీగిపోయింది. కానీ, మళ్లీ కొత్త ఉత్తర్వులు ఇచ్చారు. ఇది భారతీయులకు కొత్త కష్టమనే చెప్పాలి.
'జన్మతఃపౌరసత్వ హక్కుకు సంబంధించి సుప్రీంకోర్టులో మాకు వ్యతిరేక తీర్పు వచ్చింది. చాలా స్వల్పతేడాతో వచ్చిన ఆ తీర్పు చాలా దురదృష్టకరం. ఈ క్రమంలోనే మేం కొన్ని సర్దుబాట్లు చేస్తున్నాం' అని ట్రంప్ పేర్కొన్నారు. అలాగే బర్త్ టూరిజాన్ని కూడా నిషేధించాలని అమెరికా ప్రభుత్వం కోరుకుంటోంది. 'బర్త్ టూరిజాన్ని భారీ సంఖ్యలో విదేశీయులు ఉపయోగించుకుంటున్నారు. పుట్టుకతో వచ్చే పౌరసత్వాన్ని పొందుతున్నారు. దానిని అపహాస్యంచేస్తున్నారు. అదంతా అవమానకరం. అలా జరగనివ్వం' అని వ్యాఖ్యానించారు. పుట్టబోయే బిడ్డకు విదేశీ పౌరసత్వం పొందాలనే లక్ష్యంతో నెలలు నిండే సమయంలో గర్భిణీలు వేరే దేశానికి ప్రయాణించి అక్కడ ప్రసవిస్తారు. ఆ దేశపు చట్టాల ప్రకారం అక్కడ పుట్టిన పిల్లలకు దానంతట అదే పౌరసత్వం లభిస్తుంది.

**చట్టాలు ఏం చెప్తున్నాయి..**

1868 ఆమోదించిన 14వ రాజ్యాంగ సవరణ ప్రకారం అమెరికాలో పుట్టే వారందరికీ (వారి తల్లిదండ్రులు ఆ దేశంలో అక్రమంగా లేదా తాత్కాలికంగా ఉంటున్నా సరే) ఆ దేశ పౌరసత్వం లభిస్తుంది. విదేశీ దౌత్యవేత్తలు, విదేశాలకు చెందిన దురాక్రమణదారులకు జన్మించే పిల్లలకు మాత్రమే ఇందులో మినహాయింపు ఉంటుంది. జన్మతః పౌరసత్వం లభించడంపై పరిమితులు అమలులోకి వస్తే యేటా దాదాపు 2.5 లక్షల మంది పిల్లలపై వాటి ప్రభావం ఉంటుంది.

# ఎన్డీయే కొత్త ఎంపీలతో ప్రధాని మోడీ భేటీ

## బిల్లుల ఆమోదం నేపథ్యంలో అల్పాహార విందు



**న్యూఢిల్లీ, ఆగస్టు 7:** తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ), ఉద్ధవ్ ఠాక్రే నేతృత్వంలోని శివసేన (యూబీటీ) రెబల్ ఎంపీలకు ప్రధాని మోడీ భరోసా ఇచ్చారు. ఎలాంటి ఆందోళన చెందవద్దని, తాను వారితో ఉన్నానని హామీ ఇచ్చారు. పార్లమెంట్ సమావేశాల్లో గందరగోళం కొనసాగుతున్న నేపథ్యంలో ప్రతిపక్షాల నుంచి ఎన్డీఏలోకి కొత్తగా చేరిన లోక్ సభ ఎంపీలతో ప్రధాని మోడీ తన నివాసంలో శుక్రవారం ఉదయం అల్పాహార సమావేశం నిర్వహించారు. గత నెలలో ఉద్ధవ్ ఠాక్రే శివసేన నుంచి ఏక్‌నాథ్ షిండే శివసేనలో చేరిన ఏడుగురు ఎంపీలు, నేషనల్ సిటిజన్స్ పార్టీ ఆఫ్ ఇండియా (ఎన్‌సీపీఐ)లో చేరిన 20 మంది టీఎంసీ రెబల్ ఎంపీలు, అజిత్ పవార్ ఎన్సీపీకి చెందిన ఇద్దరు ఎంపీలతో సహా సుమారు 45 మంది ఎంపీలు ఈ సమావేశానికి హాజరయ్యారు. పార్లమెంట్ ప్రజాస్వామ్యానికి సర్వోన్నత దేవాలయమని, చర్చలలో చురుకుగా పాల్గొనాలని ప్రధాని మోడీ వారిని కోరారు. సమావేశాల్లో అంతరాయాలపై ఆందోళన వ్యక్తం చేశారు. ఈ గందరగోళం కారణంగా కొత్త ఎంపీలకు సభలో మాట్లాడే అవకాశం లభించడం లేదని అన్నారు. షిండే సేనలో చేరిన ఏడుగురు మాజీ ఉద్ధవ్ సేన ఎంపీలతో ప్రధాని మోదీ మరాఠీలో మాట్లాడారు. వారికి అన్ని విధాలా మద్దతు ఇస్తానని హామీ ఇచ్చారు. ఆందోళన వద్దు, నేను మీతో ఉన్నా అని భరోసా ఇచ్చారు. ఎన్డీఏ ఒక కుటుంబం. మేము భాగస్వామ్య పార్టీలతో ఉన్నాం. ప్రతి వ్యక్తికి గౌరవం, అవకాశం లభిస్తుంది. నేను ఎన్డీఏలోని కేవలం ఒక భాగస్వామ్య పార్టీతోనే కాదు, ప్రతి ఎంపీతో ఉన్నాను. నేను ఎన్డీఏలోని ప్రతి ఎంపీకి అండగా నిలుస్తాను. మీరు ఎవరి గురించి ఆందోళన చెందాల్సిన అవసరం లేదు అని వారితో అన్నారు. మరోవైపు నియో జకవర్గాల్లో అభివృద్ధి ప్రాజెక్టులను ముందుకు తీసు కెళ్లడానికి తమ అధికారాన్ని సమ ర్థవంతంగా ఉపయోగించుకోవాలని ఆ ఎంపీలకు ప్రధాని మోదీ సూచించారు. మీ ప్రాంతంలో ఏ అభివృద్ధి పని కోసమైనా నేరుగా ప్రధానమంత్రి కార్యాలయాన్ని (పీఎంవో) సంప్రదించండి. పేద కార్మికులు, రైతులతో సహా అందరినీ కలవండి, ప్రతి ఒక్కరి సమస్యలను అర్థం చేసుకోండి అని వారితో అన్నారు. ఆ తర్వాత ప్రధాని మోడీ ప్రతి ఎంపీతో వ్యక్తిగతంగా మాట్లాడి వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. అయితే పార్లమెంట్‌లో కీలకమైన రాజ్యాంగ సవరణ బిల్లులను ఆమోదింపజేసుకునేందుకు తగినంత సంఖ్యా బలం కోసం బీజేపీ ప్రయత్నిస్తున్నది. ఈ నేపథ్యంలో ఎన్డీఏ కూటమిలోకి కొత్తగా చేరిన ప్రతిపక్షాల రెబల్స్ ఎంపీలతో ప్రధాని మోడీఅల్పాహార సమావేశం పేరుతో సంప్రదింపులు జరిపినట్లు తెలుస్తున్నది.




## 40 యేళ్ల బోఫోర్స్ కేసుకు ముగింపు

## చివరి పిటిషన్‌నూ కొట్టేసిన సుప్రీంకోర్టు

**న్యూఢిల్లీ, ఆగస్టు 7:** దాదాపు నాలుగు దశాబ్దాలుగా దేశ రాజకీయాల్లో చర్చనీయాంశంగా నిలిచిన బోఫోర్స్ కుంభకోణం కేసుకు తెరపడింది. దీని నుంచి హిందూజా సోదరులకు ఊరట కల్పిస్తూ ఢిల్లీ హైకోర్టు 2005లో ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ దాఖలైన చివరి పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేసింది. దీంతో ఈ కేసుకు సంబంధించిన న్యాయపరమైన ప్రక్రియ పూర్తిగా ముగిసింది. జస్టిస్ జేబీ పార్దీవాలా, జస్టిస్ వినోద్ కె. చంద్రన్‌తో కూడిన ధర్మాసనం ఈ పిటిషన్‌ను విచారించింది. విచారణ వాయిదా వేయాలని పిటిషనర్ తరఫు న్యాయవాది కోరినా, కోర్టు అంగీకరించలేదు. ఇప్పటికే చాలా కాలం గడిచిందని పేర్కొంటూ పిటిషన్‌ను తిరస్కరించింది. విచారణ సందర్భంగా "హిందూజా సోదరులు, సిబిఐ వ్యవహారం ఇంకా ఎందుకు కొనసాగుతోంది? అన్ని కేసులను హైకోర్టు కొట్టేసింది కదా. ఇంకా ఎంతకాలం ఈ వ్యవహారం కొనసాగుతుంది?" అని జస్టిస్ పార్దీవాలా వ్యాఖ్యానించారు. దీనికి పిటిషనర్ తరఫు న్యాయవాది 1986లో ఈ ఒప్పందం జరిగిందని వివరించే ప్రయత్నం చేసినా, ధర్మాసనం మరిన్ని వాదనలు వినేందుకు నిరాకరించింది. 1986లో భారత ప్రభుత్వం స్వీడన్‌కు చెందిన ఎబి బోఫోర్స్ సంస్థతో రూ.1,437 కోట్ల విలువైన 400 హోవిట్జర్ గన్‌ల కొనుగోలు ఒప్పందం చేసుకుంది. 1987లో ఈ ఒప్పందంలో అక్రమ కమీషన్లు చెల్లించారనే ఆరోపణలు వెలుగులోకి రావడంతో దేశవ్యాప్తంగా రాజకీయ దుమారం చెలరేగింది. అనంతరం సిబిఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టింది. తాజాగా సుప్రీంకోర్టు చివరి పిటిషన్‌ను కూడా కొట్టివేయడంతో బోఫోర్స్ కేసు చట్టపరంగా ముగిసినట్లైంది.

# ఎఐతో కొత్త వైరస్‌ల సృష్టి!

## మనుషులకు ఎలాంటి హాని జరగదంటున్న శాస్త్రవేత్తలు



**వాషింగ్టన్, ఆగస్టు 7:** కృత్రిమ మేధ అన్ని రంగాల్లోకి వేగంగా విస్తరిస్తోంది. చివరకు ఈ ప్రకృతిలో లేని వైరస్‌లను సృష్టించేందుకు కూడా శాస్త్రవేత్తలు ఎఐని వాడుతున్నారు. ఇందుకోసం స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీ, ఆర్క్ ఇన్‌స్టిట్యూట్‌కు చెందిన పరిశోధకులు జనరేటివ్ ఎఐ మోడల్ ఇఒను ఉపయోగించారు. వైరస్ జన్యుక్రమాన్ని కొత్తగా రాసుకున్నారు. తర్వాత ఆ డిఎన్‌ఎను ల్యాబ్‌లో సింథసైజ్ చేశారు. ఎఐ డిజైన్ చేసిన వైరస్‌లలో 16 పునరుత్పత్తి చెందుతున్నాయని గుర్తించామని చెప్పారు. అవి ఈ-కోలి బ్యాక్టీరియాను చంపుతున్నాయని పేర్కొన్నారు. ఇది సింథటిక్ బయోలజీలో కీలక ముందడుగుగా అభివర్ణించారు. శాస్త్రవేత్తలు గుర్తించిన అంశాలు 'సైన్స్' జర్నల్‌లో ప్రచురితమయ్యాయి. ఈ వైరస్ బ్యాక్టీరియాకు మాత్రమే సోకుతుందని, మనుషులకు ఎలాంటి హాని కలిగించదని చెప్తున్నారు. ఇఒ ఒక లార్జ్ లాంగ్వేజ్ మోడల్. ఇది డిఎన్‌ఎలోని ప్యాటర్న్‌ను నేర్చుకొని, వాటిని విశ్లేషిస్తుంది. దీనికి లక్షల సంఖ్యలో జీవుల జన్యుక్రమాలపై శిక్షణ ఇచ్చారని అంతర్జాతీయమీడియా కథనాలు వెల్లడించాయి. సింథటిక్ బయోలజీ రంగంలో ఇది కీలక విషయమే అయినప్పటికీ ఈ సాంకేతికతను మనుషులకు సోకే వైరస్ కోసం ఉపయోగిస్తే ఎలా అనే ఆందోళన వ్యక్తమవుతోంది. సింథటిక్ బయాలజీ అంటే జీవశాస్త్రానికి ఇంజినీరింగ్‌ను మిక్స్ చేస్తారు. మానవాళికి ఉపయోగపడేలా కణాలను రీప్రోగ్రామ్ చేయడానికి ఈ విధానం ఉపయోగపడుతుంది.

# అమిత్ షాతో స్పీకర్ ఓం బిర్లా భేటీ

## కొనసాగుతున్న పార్లమెంట్ ప్రతిష్టంభన







**న్యూఢిల్లీ, ఆగస్టు 7:** ప్రభుత్వం, విపక్షాల మధ్య కొనసాగుతున్న ప్రతిష్టంభన నేపథ్యంలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా శుక్రవారం లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాతో సమావేశమయ్యారు. ఢిల్లీలో విద్యార్థులపై పోలీసుల చర్య, రామ మందిర విరాళాల నిధుల దుర్వినియోగం ఆరోపణలపై చర్చకు విపక్షాలు పట్టుబడుతున్న నేపథ్యంలో ఈ భేటీ ప్రాధాన్యం సంతరించుకుంది.
జూలై 20న పార్లమెంట్ వైపు ర్యాలీగా వెళ్లిన విద్యార్థులపై పోలీసులు బలప్రయోగం చేశారంటూ విపక్షాలు ఆరోపిస్తున్నాయి. దీనిపై హోంమంత్రి అమిత్ షా సమాధానం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ లోక్‌సభ కార్యకలాపాలను అడ్డుకుంటున్నాయి. ఈ క్రమంలో బిర్లా కార్యాలయంలో అమిత్ షా దాదాపు గంటపాటు సమావేశమయ్యారు. ఇదిలా ఉండగా, విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ కూడా పార్లమెంట్ హౌస్‌లోని అమిత్ షా కార్యాలయంలో ఆయనతో భేటీ అయ్యారు. మరోవైపు, పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరెన్‌రిజిజు శుక్రవారం లోక్‌సభలో మాట్లా డుతూ సభకు ఏ మంత్రి వచ్చి సమాధానం ఇవ్వాలనేది విపక్షాలు నిర్ణయించలేవని స్పష్టంచేశారు. అమిత్ షా ప్రతి రోజూ పార్లమెంట్‌కువస్తున్నారని, రాత్రి ఆలస్యం గాకూడా అక్కడే ఉంటున్నారని ఆయన పేర్కొన్నారు.

**అమిత్‌షా సభకు రావాలన్న విజ్ఞప్తిని పరిశీలించాలి: రాజ్యసభ ఛైర్మన్ సిపిరాధాకృష్ణన్**

వర్షాకాల సమావేశాలు ప్రారంభమైనప్పటి నుంచి హోం మంత్రి అమిత్ షా పార్లమెంట్‌కు గైర్హాజరవుతున్న క్రమంలో రాజ్యసభ ఛైర్మన్ సీపీ రాధాకృష్ణ గురువారం కేంద్రానికి ఒక విజ్ఞప్తి చేశారు. పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజును ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ షా సభకు రావాలన్న విజ్ఞప్తిని పరిశీలించాలని కోరారు. హోం మంత్రి సభకు హాజరు కావాలన్న నా విజ్ఞప్తిని పరిశీలించాలని కోరుతున్నా. పార్లమెంట్ వ్యవహారాల శాఖ మంత్రిగా విపక్షాల డిమాండ్‌ను మీరే హోం మంత్రి దృష్టికి తీసుకు పోవాలి అని పేర్కొన్నారు.

## వందేమాతరం బిల్లుకు రాష్ట్రపతి ఆమోదముద్ర

**న్యూఢిల్లీ, ఆగస్టు 7:** వందేమాతరం గేయానికి మరిన్ని రక్షణలు కల్పించే నేషనల్ ఆనర్ (అమెండ్‌మెంట్) యాక్ట్2026కు రాష్ట్రపతి ఆమోదం లభించింది. జాతీయ గేయాన్ని అవమానించడాన్ని నేరంగా గుర్తించేలా 1971 నాటి చట్టానికి కేంద్రం తాజాగా మార్పులు చేసిన విషయం తెలిసిందే. జాతీయ గీతం స్థాయిలో వందేమాతరం గేయానికి రక్షణ కల్పించేలా ఈ మార్పులు చేసింది. ఇటీవలే పార్ల మెంటు ఆమోదించిన బిల్లుకు తాజాగా రాష్ట్రపతి ఆమోదం కూడా లభించింది.

# విజయ్ 'విడాకుల'కు శుభంకార్డు!

## పిటిషన్ ఉపసంహరించుకున్న భార్య సంగీత

## విచారణ ముగించిన చెంగల్పట్టు కోర్టు



**చెన్నై, ఆగస్టు 7:** తమిళనాడు ముఖ్యమంత్రి సి. జోసెఫ్ విజయ్ భార్య సంగీత, చెన్నై సమీపంలోని చెంగల్‌పట్టు ఫ్యామిలీ కోర్టులో దాఖలు చేసిన విడాకుల పిటిషన్‌ను ఉపసంహరించుకున్నారు. సదరు నటుడు రాజకీయ పదవిని చేపట్టడం వల్ల ప్రజల దృష్టిని విశేషంగా ఆకర్షించిన ఈ కేసు వ్యవహారానికి ప్రస్తుతానికి తెరపడింది. చెంగల్‌పట్టు ఫ్యామిలీ కోర్టు సింగిల్ జడ్జి జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం, సంగీత వీడియో కాన్ఫరెన్స్ ద్వారా హాజరై, ఈ ఏడాది ప్రారంభంలో మొదలైన విడాకుల ప్రక్రియను కొనసాగించడానికి తనకు ఇష్టం లేదని స్పష్టం చేశారు. "పిటిషనర్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా హాజరై, ఈ కేసును ఇకపై కొనసాగించడానికి ఇష్టపడటం లేదని ధ్రువీకరించారు. ఆమె ఉపసంహరణ పిటిషన్‌ను దాఖలు చేశార్లు" అని కోర్టు నమోదు చేసింది. ప్రతివాది తరఫు న్యాయవాదికి నోటీసు జారీ చేయబడిందని, వారు ఈ అభ్యర్థనపై ఎటువంటి అభ్యంతరం వ్యక్తం చేయలేదని కూడా కోర్టు పేర్కొంది. ఆ తర్వాత, అవసరమైతే కొత్తగా ప్రక్రియను ప్రారంభించే వెసులుబాటుతో పాటు, కేసును ఉపసంహరించుకోవడానికి కోర్టు పిటిషనర్‌కు అనుమతినిచ్చింది. "భవిష్యత్తులో అవసరమైతే కొత్త పిటిషన్‌ను దాఖలు చేసే వెసులుబాటుతో, ఈ కేసును ఉపసంహరించుకో వడానికి పిటిషనర్‌కు అనుమతి ఇవ్వబడింది. కాబట్టి, ఈ పిటిషన్ ఆమోదించబడింద్ణి అని ఆ ఉత్తర్వులో పేర్కొన్నారు. కోర్టురికార్డుల ప్రకారం, కేసు స్థితి "అభ్యంతరం లేనిది –ఉపసంహరించబడింద్ణి అని అప్‌డేట్ చేయబడింది. ఈ ఉపసంహారణతో వివాదంలోని వాస్తవాంశాలపై ఎటువంటి తీర్పు లేకుండానే ప్రస్తుత ప్రక్రియ ముగిసింది. పిటిషన్ పరిష్కరించబడకుండా ఉపసంహరించబడింది కాబట్టి, కేసులో మొదట చేసిన ఆరోపణలు లేదా వాదనలను కోర్టు పరిశీలించలేదు లేదా వాటిపై తీర్పు ఇవ్వలేదు. కోర్టు కల్పించిన వెసులుబాటు అర్థంఏమిటంటే, భవిష్యత్తులో పరిస్థితులు అవసరమైతే కొత్త పిటిషన్‌తో మళ్లీ కోర్టును ఆశ్రయించే చట్టపరమైన హక్కు పిటిషనర్‌కు ఉంటుంది.

## జస్టిస్ యశ్వంత్ వర్మపై పిటిషన్ విచారణకు సుప్రీంకోర్టు నిరాకరణ

**న్యూఢిల్లీ, ఆగస్టు 7:** అలహాబాద్ హైకోర్టు మాజీ జడ్జి జస్టిస్ యశ్వంత్ వర్మకు సుప్రీంకోర్టులో తాజాగా ఊరట లభించింది. జస్టిస్ యశ్వంత్ వర్మపై కేసు నమోదు చేయాలన్న పిటిషన్‌ను అత్యున్నత న్యాయస్థానం కొట్టేసింది. న్యాయవాది ఘన్‌శ్యామ్ ఉపాధ్యాయ్ ఈ పిటిషన్‌ను దాఖలు చేశారు. ఈ సందర్భంగా జస్టిస్ పి.ఎస్. నరసింహా, జస్టిస్ అలోక్ అరాధేల ధర్మాసనం పలు కీలక వ్యాఖ్యలు చేసింది. చౌకబారు పబ్లిసిటీ కోసమే ఇలాంటి పిటిషన్లు వేస్తున్నారని పిటిషనర్‌పై ధర్మాసనం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. న్యాయ వ్యవస్థను దుర్వినియోగం చేయవద్దని హితవు పలికింది. ఇదే అంశంపై గతంలోనూ వచ్చిన పిటిషన్‌నూ కొట్టివేశామని సుప్రీంకోర్టు ధర్మాసనం గుర్తు చేసింది. అయితే, యశ్వంత్ వర్మ తన పదవికి రాజీనామా చేసినా నేరపూరిత బాధ్యత తొలగిపోదని ఉపాధ్యాయ్ వాదించే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో కోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. లాయర్ అయి ఉండి చౌకబారు ప్రచారం కోసం పిటిషన్లు వేస్తున్నారని ఆక్షేపించింది. ఆయన పిటిషన్‌ను తోసిపుచ్చింది.

# ఇక యుఎస్ నుంచే భారత్‌కు 67% ఎల్పీజి

## కేంద్రం సంచలన ప్రకటన



**న్యూఢిల్లీ, ఆగస్టు 7:** ఇరాన్ యుద్ధం తర్వాత అంతర్జాతీయంగా లెక్కలు మారిపోతున్నాయి. ముఖ్యంగా హార్ముజ్ జలసంధి మీదుగా మనకు ఎల్పీజి నౌకలు ఆలస్యం అవుతుండటం, అటు అమెరికాతో పెరుగుతున్న వాణిజ్య బంధం వంటి కారణాలతో కేంద్రం కీలక నిర్ణయాలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా గతంలో ఎన్నడూ లేనంత స్థాయిలో అమెరికా నుంచి ఏకంగా 67 శాతం ఎల్పీజి దిగుమతి చేసుకోబోతున్నట్లు కేంద్రం శుక్రవారం సంచలన ప్రకటన చేసింది. గత కొన్ని నెలలుగా చోటుచేసుకుంటున్న పరిణామాల ఫలితంగా అమెరికా మన దేశానికి అతి పెద్ద ఎల్పీజి సరఫరాదారుగా అవతరించిందని కేంద్రం పేర్కొంది. మన ఎల్పీజి అవసరాల్లో కొంత మాత్రమే అమెరికా నుంచి దిగుమతి చేసుకోవాలని భారత్ మొదట్లో అనుకుందని, అయితే ఇప్పుడు దాన్ని భారీగా పెంచినట్లు కేంద్ర పెట్రోలియం, సహజ వాయువు శాఖ మంత్రి హార్దీప్‌సింగ్ పూరీ వెల్లడించారు. దేశ ఎల్పీజి అవసరాల్లో సుమారు 10 శాతం అమెరికా నుంచి దిగుమతి చేసుకోవాలని ప్రభుత్వం ఈ యేడాది ప్రారంభంలో నిర్ణయించిందని, అయితే ఇరాన్ వార్, హార్ముజ్ జలసంధి వ్యవహారాలతో దీనికి సంబంధం లేదన్నారు.
కానీ ఆ తర్వాత చోటుచేసుకున్న పరిణామాల ఫలితంగా ఇవాళ మన ఎల్పీజి దిగుమతులలో అమెరికా వాటా సుమారు 67 శాతానికి పెరిగినట్లు చెప్పడానికి సంతోషిస్తున్నట్లు హార్దీప్ పూరీ తెలిపారు. చమురు, ఎల్పీజిని వివిధ దేశాల నుంచి కొనుగోలు చేస్తున్నప్పటికీ, తాజా పరిస్థితుల్లో అమెరికా ఎల్పీజి వాటా మాత్రం 67 శాతానికి చేరిందన్నారు. మన గ్యాస్ సరఫరాదారులను వైవిధ్యపరచడం అనేది ఇంధన భద్రతను బలోపేతం చేయడానికి, ఒకే ప్రాంతంపై అధికంగా ఆధారపడటం వల్ల కలిగే ప్రమాదాలను తగ్గించడానికి ఓ మార్గంగా కేంద్రం భావిస్తోంది. అందుకే రిస్క్‌లేని అమెరికా వైపు మొగ్గ చూపినట్లు తెలుస్తోంది.

# సంక్షిప్త వార్తలు

## ఓ స్కూల్‌లో విద్యార్థి కాల్పులు..ఏడుగురు మృతి




**బ్యాంకాక్, ఆగస్టు 7:** థాయ్‌లాండ్‌లోని ఓ స్కూల్‌లో కాల్పులు కలక లం సృష్టించాయి. నొంతగురి ప్రావిన్స్ బాంగ్ క్రువాయ్ జిల్లాలోని డెబ్సిరిన్ స్కూల్‌లో తొమ్మిదో తరగతి విద్యార్థి తోటి విద్యార్థులు, ఉపాధ్యాయులపై కాల్పులకు తెగబడ్డాడు. ఈ ఘటనలో ఏడుగురు ప్రాణాలు కోల్పోగా, 15మంది తీవ్రంగా గాయపడ్డారు. మృతుల్లో ముగ్గురు టీచర్లు, ముగ్గురు విద్యార్థులున్నారు. కాల్పులు జరిపిన విద్యార్థి కూడా తనను తాను కాల్చుకుని మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటనపై థాయ్ ఉప ప్రధాని అనుతిన్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

## జంతర్‌మంతర్ వద్ద పింఛన్‌దారుల నిరసన



**న్యూఢిల్లీ, ఆగస్టు 7:** ప్రధానమంత్రి కాకముందు నరేంద్ర మోడీ, బీజేపీ ఇచ్చిన హామీ మేరకు ఈపీ ఎస్95 పథకం కింద మెరుగైన ప్రయోజనాల కోసం దశాబ్ద కాలంగా సాగుతున్న తమ పోరా టాన్ని మరింత ఉధృతం చేస్తామని ప్రతిజ్ఞ చేస్తూ వృద్ధ పింఛనుదారులు జంతర్ మంతర్ వద్ద వర్షాన్ని, ఎండను సైతం లెక్కచేయకుండా నిరసన తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేట్ రంగాలలో దాదాపు 81లక్షల మంది ఈపీఎస్95 పింఛనుదారులు ఉన్నారు. ఈ ఉద్యమానికి నాయకత్వం వహిస్తున్న ఈపీఎస్95 నేషనల్ ఆజిటేషన్ కమిటీ ప్రభుత్వం కనీస నెలవారీ పింఛన్‌ను రూ.1,000 నుండి రూ. 7,500కు పెంచి, కరవు భత్యం, వైద్య ప్రయోజనాలను కల్పించాలని, లేనిపక్షంలో దేశవ్యాప్త ఆందోళనకు సిద్ధం కావాలని హెచ్చరించింది.

## బాలివుడ్ నటుడు, బిజెపినేత మిథున్‌చక్రవర్తికి శస్త్రచికిత్స



**కోల్‌కత్తా, ఆగస్టు 7:** బాలీవుడ్ నటుడు, బీజేపీ నేత మిథున్ చక్రవర్తి కోల్‌కతాలోని ఓప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. స్వల్ప అనారోగ్యంతో ఆసుపత్రిలో చేరిన ఆయనకు గురువారంరాత్రి చిన్నపాటి శస్త్రచికిత్స నిర్వహించినట్లు పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి సువేందు అధికారి తెలిపారు. ప్రస్తుతం మిథున్ చక్రవర్తి ఆరోగ్యం నిలకడగా ఉందని, త్వరలోనే ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ అయ్యే అవకాశం ఉందని చెప్పారు. శుక్రవారం సువేందుఅధికారి ఆసుపత్రికి వెళ్లి మిథున్ చక్రవర్తిని పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితితోపాటు, చికిత్స అందిస్తున్న వైద్య బృందంతోనూ మాట్లాడారు.

## జపాన్‌కు ముంచుకొస్తున్న డాల్ఫిన్ తుపాను




**టోక్యో, ఆగస్టు 7:** ప్రకృతి కోపానికి జపాన్ దేశం మరోసారి గజగజ వణికిపోతోంది. డాల్ఫిన్ అని పిలిచే భయంకరమైన కేటగిరీ1 తుఫాను ఆ దేశ నైరుతి ప్రాంతంపై విరుచుకు పడేందుకు వేగంగా దూసుకొస్తోంది. గంటకు ఏకంగా 198 కిలోమీటర్ల ఈదురుగాలులతో విరుచుకుపడుతున్న ఈ రాక్షస తుఫాను ధాటికి సముద్రంలో అలలు ఉవ్వెత్తున ఎగిసిపడుతున్నాయి. తుఫాను ముప్పు పొంచి ఉండటంతో అప్రమత్తమైన జపాన్ ప్రభుత్వం, ప్రజల ప్రాణాలను కాపాడేందుకు అత్యవసర చర్యలు చేపట్టింది. తుఫాను ధాటికి కాగోషిమా, ఒకినావా జిల్లాల్లోని తీర ప్రాంతాలు తీవ్రంగా ప్రభావితమయ్యే అవకాశం ఉంది.

## ముంబయి మేయర్‌కు బెదరింపు ఇ మెయిల్



**ముంబయి, ఆగస్టు 7:** బాంబులు పేలుస్తామనే ఈమెయిల్ ముంబై మేయర్ రితూ తావ్డే అధికారిక మెయిల్‌కు వచ్చింది. ఈ ఈమెయిల్ రావడం ఇది మూడోసారి. దీంతో ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకున్న ముంబై పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. స్వాతంత్ర్య దినోత్సవం ఆగస్టు 15కు ముందు పాఠశాలలు, మెట్రో, స్టాక్ ఎక్స్ఛేంజ్, ప్రముఖ వ్యక్తులపై బాంబు దాడులు చేస్తామని హెచ్చరిక ఆ ఈమెయిల్‌లో ఉంది. అంతేకాకుండా ఖలిస్తాన్ అనుకూల నినాదాలతో పాటు కొంతమంది ప్రముఖుల పేర్లు కూడా ఉన్నట్లు సమాచారం.



## అసెంబ్లీ ఆవరణలో ఘనంగా బోనాల పండుగ

### పాల్గొన్న మండలి చైర్మన్ సుఖేందర్‌రెడ్డి, స్పీకర్ ప్రసాద్‌కుమార్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఆగస్టు 7:** శాసనసభ ఆవరణలోని శ్రీ బంగారు మైసమ్మ దేవాలయంలో శుక్రవారం ఆశాఢ మాసం బోనాల పండుగ ఘనంగా జరిగింది. లెజిస్లేటివ్ సెక్రటేరియట్ ఉద్యోగుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ బోనాల ఉత్సవాలలో పాల్గొన్న శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, శాసనసభాపతి గడ్డం ప్రసాద్‌కుమార్, శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాష్, శాసనసభ్యులు, శాసనమండలి సభ్యులు, కౌన్సిల్ సెక్రటరీ డాక్టర్ వి. నరసింహ చార్యులు, అసెంబ్లీ కార్యదర్శి రేండ్ల తిరుపతి లెజిస్లేటివ్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. ముందుగా లెజిస్లేటివ్ ఉద్యోగులు సంప్రదాయబద్ధంగా బోనాలను సమర్పించగా, పోతరాజుల విన్యాసాలు, డప్పుల వాయిద్యాలు, వివిధ వేషధారణలతో కళాకారుల ప్రదర్శనలు ఉత్సవాలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. పెద్ద సంఖ్యలో ఉద్యోగులు, అధికారులు ఉత్సవాల్లో పాల్గొని భక్తిశ్రద్ధలతో అమ్మవారిని దర్శించుకున్నారు. శ్రీ బంగారు మైసమ్మ అమ్మవారి ఆలయంలో నిర్వహించిన పూజల్లో పాల్గొన్న ప్రముఖులకు ఆలయ పూజారులు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా అందరికీ బోనాల పండుగ శుభాకాంక్షలు తెలియజేస్తూ, అమ్మవారి ఆశీస్సులతో రాష్ట్రంలో ప్రజలందరూ సుభిక్షంగా, సుఖ శాంతులతో జీవించాలని, వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండాలని చైర్మన్ సుఖేందర్‌రెడ్డి,, స్పీకర్ ప్రసాద్‌కుమార్ ఆకాంక్షి ంచారు.

## కరెన్సీ నోట్లపై అంబేద్కర్ చిత్రాన్ని ముద్రించాలి

### కేంద్రానికి మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ విజ్ఞప్తి

**హైదరాబాద్, ఆగస్టు 7, ప్రభాతవార్త:** రాజ్యాంగ నిర్మాత, భారతరత్న బిఆర్ అంబేద్కర్ చిత్రాన్ని కరెన్సీ నోట్లపై ముద్రించాలని సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ డిమాండ్ చేశారు. ఈ అంశంపై కేంద్ర ప్రభుత్వం, భారతీయ రిజర్వ్ బ్యాంకు (ఆర్‌బీఐ) సానుకూల నిర్ణయం తీసుకోవాలని మంత్రి కేంద్రానికి విజ్ఞప్తి చేశారు. ఇదే అంశాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రివర్గం దృష్టికి తీసుకెళ్లి ప్రభుత్వం తరఫున కేంద్ర ప్రభుత్వానికి అధికారికంగా విజ్ఞప్తి చేసేలా కృషి చేస్తానన్నారు. శుక్రవారం న్యూఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ మాట్లాడారు. అనంతరం జంతర్‌మంతర్‌లో కరెన్సీ పై అంబేద్కర్ ఫొటో సాధన సమితి (సీపీఎస్ఎస్) ఆధ్వర్యంలో కొనసాగుతున్న ధర్నాకు సంఘీభావం ప్రకటించారు. మంత్రి మాట్లాడుతూ.. ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశానికి రాజ్యాంగాన్ని అందించిన మహనీయుడు బిఆర్ అంబేద్కర్ అని, ఆయన చూపిన సమానత్వం, సామాజిక న్యాయం, రాజ్యాంగబద్ధ పరిపాలన స్ఫూర్తి భారతదేశ ప్రజాస్వామ్యానికి శాశ్వత దిక్సూచి అన్నారు. భారతీయ రిజర్వ్ బ్యాంకు ఏర్పాటుకు ముందు జరిగిన ద్రవ్య విధాన చర్చల్లో ఆయన ఆర్థిక ఆలోచనలు, సూచనలు విశేష ప్రభావం చూపాయన్నారు. దేశ ఆర్థిక వ్యవస్థకు ప్రతీకగా నిలిచే కరెన్సీ నోట్లపై అంబేద్కర్ చిత్రాన్ని ముద్రించడం ద్వారా రాజ్యాంగ విలువలు, సామాజిక న్యాయం, సమానత్వం పట్ల భారతదేశ నిబద్ధత ప్రపంచానికి మరింత బలంగా చాటిచెప్పినట్లవుతుందన్నారు. మహాత్మా గాంధీకి దేశం ఇచ్చిన గౌరవం మాదిరిగానే రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్‌కూ తగిన జాతీయ గౌరవం దక్కాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు.



దివ్యాంగులతో మాట్లాడుతున్న డా.జి.చిన్నారెడ్డి,విద్యాసాగర్.

## దివ్యాంగులకు అండగా ఉంటా

### సిఎం ప్రజావాణి ఇన్‌చార్జి జి.చిన్నారెడ్డి

**హైదరాబాద్ (బేగంపేట) ఆగస్టు 7, ప్రభాతవార్త:** ప్రమాదాల్లో వెన్నెముక దెబ్బతిని నడవలేని దివ్యాంగులకు ప్రస్తుతం చెల్లిస్తున్న పెన్షన్ ను రూ 4,016ల నుంచి రూ 15,000లకు ఎపి రాష్ట్రంలో మాదిరిగా పెంచాలని కోరుతూ దివ్యాం గులు మూడు చక్రాల సైకిళ్లపై సిఎం ప్రజావాణిలో ఇన్‌చార్జి డా.జి.చిన్నారెడ్డి, స్టేట్ నోడల్ అధికారి కె.విద్యాసాగర్‌కు విజ్ఞప్తి చేసారు. ఈ మేరకు వారు దరఖాస్తును అందజేసారు. శుక్రవారం మహాత్మాజ్యోతిబా పూలే ప్రజాభవన్‌లో నిర్వహించిన 245వ సిఎం ప్రజావాణీ కార్యక్రమంలో పెద్దఎత్తున వెన్నెముక దెబ్బతిన్న దివ్యాంగులు మూడు చక్రాల సైకిళ్లపై సిఎం ప్రజావాణీకి వచ్చారు. ఈ విషయంపై స్పందించిన చిన్నారెడ్డి సంబంధిత సెర్ప్ శాఖ ద్వారా ముఖ్య మంత్రికి ప్రతిపాదనలు పంపే విధంగా చర్యలు తీసుకుంటామని దివ్యాంగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు షఫీ అహ్మద్‌కు భరోసా ఇచ్చారు.

**సిఎం ప్రజావాణికి అందిన దరఖాస్తులు 274**

ప్రజాభవన్‌లో శుక్రవారం నిర్వహించిన 245వ సీఎం ప్రజావాణీ కార్యక్రమంలో మొత్తం 274 దరఖాస్తులు అందాయి. వీటిలో పంచాయితీరాజ్ గ్రామీణాభివృద్ధిశాఖకు సంబంధించి 166 దరఖాస్తులు, రెవెన్యూ శాఖకు సంబంధించి 30, హోంశాఖకు 13, ప్రవాసీ ప్రజావాణీకి 2 దరఖాస్తులు వచ్చాయి. ఈ కార్యక్రమంలో సీఎం ప్రజావాణీ ఇన్‌చార్జి, రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్‌చైర్మన్ డా.జి.చిన్నారెడ్డి, స్టేట్ నోడల్ అధికారి కె.విద్యాసాగర్, దరఖాస్తులను స్వీకరించి ఎండార్స్‌మెంట్ చేసి సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి సమస్యలను పరిష్కరించారు.

## అంబేద్కర్ ఓపెన్ వర్సిటీ డిగ్రీ, పిజి అడ్మిషన్ గడువు పెంపు

### సెప్టెంబరు 9 వరకు రిజిస్ట్రేషన్, ట్యూషన్ ఫీజు చెల్లించడానికి అవకాశం

**హైదరాబాద్, ఆగస్టు 7, ప్రభాతవార్త:** బిఆర్ అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయ డిగ్రీ (బీఏ/బీకాం/బీఎస్సీ) కోర్సులు, పీజీ (ఎంఏ/ ఎంకాం/ ఎంఎస్సీ, ఎంబీఏ) కోర్సులు, బీఎల్ఐఎస్సీ, డిప్లమాతోపాటు పలు సర్టిఫికెట్ కోర్సుల్లో 2026-27 విద్యా సంవత్సరానికి అడ్మిషన్లు పొందడానికి గడువును సెప్టెంబర్ 9 వరకు పొడిగించినట్లు విశ్వవిద్యాలయ అధికారులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. విశ్వవిద్యాలయంలో 2024-25, 2025-26రాల్లో డిగ్రీలో చేరిన ద్వితీయ, తృతీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు, అంతకుముందు చేరిన డిగ్రీ, పీజీ విద్యార్థులు సకాలంలో ఫీజు చెల్లించలేక పోయిన వారు కూడా సెప్టెంబర్ 9 లోపు ట్యూషన్ ఫీజును ఆన్‌లైన్‌లో చెల్లించవచ్చని అలా వీలు కాకపోతే నెట్ బ్యాంకింగ్, క్రెడిట్, డెబిట్ కార్డ్, ఆన్‌లైన్ సెంటర్ల ద్వారా చెల్లించాలని సూచించారు. పూర్తి సమాచారంతోపాటు ఆన్ లైన్‌లో నమోదు తదితర అంశాలపై సందేహాలుంటే సమీపంలోని అధ్యయన కేంద్రంలో సంప్రదించాలని లేదంటే యూనివర్సిటీ హెల్ప్ డెస్క్ నంబర్లు 040-23680 222/333/444/555తోపాటు టోల్‌ఫ్రీ నెం. 18005990101 లో వాటితోపాటుగా యూనివర్సిటీ అధికారిక వెబ్‌సైట్‌లోనూ పొందవచ్చని అధికారులు పేర్కొన్నారు.

# ఎఐ టెక్నాలజీతో జీఎస్టీ వ్యవస్థలో లోపాలకు అడ్డుకట్ట

### లీకేజీలను అరికట్టేలా వివిధ ప్రభుత్వ శాఖల మధ్య మరింత సమన్వయం

### సిఎం రేవంత్‌రెడ్డితో ప్రముఖ ఆర్థికవేత్త అరవింద్ సుబ్రమణియన్ భేటీ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్,ఆగస్టు7:** తెలంగాణ ఆర్థిక వ్యవస్థ వేగంగా విస్తరిస్తున్న నేపథ్యంలో రాష్ట్ర ఖజానాకు జీఎస్టీ రాబడులను పెంచుకోవడంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌ను వినియోగించడం, తద్వారా పటిష్టమైన ప్రణాళికను రూపొందించడంపై ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి విస్తృతంగా చర్చలు జరిపారు. శుక్రవారం ఎంసీఆర్ హెచ్ఆర్డీ బోధి పెవిలియన్‌లో ముఖ్యమంత్రితో ప్రముఖ ఆర్థికవేత్త అరవింద్ సుబ్రమణియన్ భేటీ అయ్యారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి మెరుగుపరచడంలో ప్రణాళికాబద్ధంగా ముందుకు వెళ్లడంపై ఈ సందర్భంగా చర్చ జరిగింది. ముఖ్యంగా జీఎస్టీ, ఎక్సైజ శాఖల్లో చేపట్టాల్సిన సంస్కరణలపై అరవింద్ సుబ్రమణియన్‌తో చర్చించారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి మెరుగుపరుకునేందుకు ప్రణాళికాబద్ధంగా ముందుకు తీసుకెళ్లే దిశగా జీఎస్టీ అధికారులకు ప్రత్యేక ఏఐ ఆధారిత సమాచారంతో ప్రక్రియను సులభతరం చేసే వ్యవస్థను తేనున్నట్టు స్పష్టం చేశారు. ఈ ప్రక్రియతో వ్యాపారాలకు ఎలాంటి ఆటంకాలు, ఇబ్బందులు కలగకుండా ఉండాలని సీఎం సూచించారు.

రాష్ట్ర ఖజానాకు రాబడి పెంచుతూనే సులభతర వాణిజ్యం (ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్)ను మెరుగు పరిచేలా టెక్నాలజీ వాడకం ఉంటోందని సుబ్రమణియన్ వివరించారు. ప్రధానంగా భవన, నిర్మాణ సామాగ్రి విషయంలో లీకేజీలను అరికట్టే విధంగా మున్సిపల్, రేరా, పంచాయతీ రాజ్, విద్యుత్, ఆర్థిక, వాణిజ్య పన్నుల శాఖల మధ్య ఏఐ సాయంతో సమన్వయం చేసుకోవాలని ఈ సందర్భంగా సూచించారు. భారీ భవనాలు, కాంట్రాక్టు పనులకు సంబంధించిన అనుమతుల దరఖాస్తు దశలోనే నిర్మాణ సామాగ్రి అవసరాలను, దానికి అనుగుణంగా పన్నుల అంచనాలు వివరాలను నమోదు చేయాలన్నారు. ఈ డేటా తోపాటు మీసేవా, ఆరోగ్యశ్రీ, సీఎం రిలీఫ్ ఫండ్ వివరాలను సైతం సమీకృతం చేస్తే పరిపాలనలో ఉపయోగ పడుతుందని సీఎం చెప్పారు. ఈ సమావేశంలో సీఎం సలహాదారు కె. రామకృష్ణా రావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, కమర్షియల్ టాక్స్ ఎక్సైజ్ సెక్రటరీ రఘునందన్ రావు, ఎక్సైజ్ కమిషనర్ హరి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## అసెంబ్లీని సందర్శించిన ఒడిశా అసెంబ్లీ స్టాండింగ్ కమిటీ



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్,ఆగస్టు7:** స్టడీ టూర్లో భాగంగా తెలంగాణ శాసనమండలి, శాసన సభను ఒడిశా అసెంబ్లీ శాఖల సంబంధిత స్టాండింగ్ కమిటీ శుక్రవారం సందర్శించింది. ఒడిస్సా స్టాండింగ్ కమిటీ చైర్మన్ సుధీర్ రంజన్ పథజోషి నేతృత్వంలో విచ్చేసిన సభ్యులకు శాసనమండలి సమావేశ మందిరంలో శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, శాసన సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్, మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాష్ పుష్పగుచ్ఛంతో స్వాగతం పలికి, శాలువాలతో సన్మానించి మెమోంటోలు బహుకరించారు. ఈ సందర్భంగా కౌన్సిల్ సెక్రటరీ డాక్టర్ వి.నరసింహాచార్యులు, అసెంబ్లీ సెక్రటరీ రేండ్ల తిరుపతి, లెజిస్లేటివ్ అధికారులు పాల్గొన్నారు. అనంతరం తెలంగాణ, ఒడిస్సా రాష్ట్రాల శాసనసభలలో కమిటీల ఏర్పాటు, పనితీరుపై సమావేశంలో చర్చ జరిగింది.

## సిఎం రేవంత్ ఒత్తిడితోనే పోలవరం-బనకచర్లపై కేంద్రం వెనక్కి

### ఎంపి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి

**హైదరాబాద్, ఆగస్టు 7, ప్రభాతవార్త:** ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఒత్తిడితోనే పోలవరం-బనకచర్ల విషయంలో కేంద్రం వెనక్కి తగ్గిందనీ ప్రతిపక్షాలు చేసే విష ప్రచారంను కాంగ్రెస్ శ్రేణులు తిప్పి కొట్టాలని భువనగిరి ఎంపి చామలకిరణ్‌కుమార్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఢిల్లీలో శక్రవారం విలేఖరులతో మాట్లాడుతూ సామాజిక మాద్యమాలలో ప్రచారంతో తెలంగాణ ప్రజలను మభ్యదుతామని బిఆర్ఎస్ భావించడం మూర్ఖత్వం అని అన్నారు. తెలంగాణకు 200 టిఎంసి ల నీటి విషయంలో వాస్తవాలను ప్రజలకు చెప్పాలని బిఆర్ఎస్ నేతలకు హితవు చెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై జరుగుతున్న ప్రతిపక్షాల తప్పుడు ప్రచారాన్ని తిప్పికొట్టాలని కాంగ్రెస్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. చంద్రబాబు, రేవంత్ రెడ్డి ఒక్కటే అనిప్రతిపక్షాలు చేసే విష ప్రచారం తిప్పకొట్టడం ప్రతి కాంగ్రెస్ నేతకు బాధ్యత ఉందని అన్నారు. జిల్లా, మండల స్థాయిలో స్పోక్స్ పర్సన్లను నియమిస్తామని తెలిపారు. మండల అధ్యక్షులు వారానికి ఓ సారి ప్రెస్ మీట్ పెట్టాలని వారిని ఆదేశించారు.

విద్యా వ్యవస్థలో నాణ్యత, స్కిల్ డెవలప్‌మెంట్ పెంపుపై సిఎం రేవంత్ దృష్టిపెడుతున్నారని చెప్పారు. రేవంత్ రెడ్డి విద్యార్థులకు వ్యతిరేకం కాదనీ విద్యా వ్యవస్థను రేవంత్ రెడ్డి గాడిలో పెడుతున్నారనీ అన్నారు. తెలంగాణలో పరీక్ష పేపేర్లు బిఆర్ఎస్ హయాంలోనే లీక్ అయ్యాయి అంటూ లీకేజిల చిట్టాను చదివారు. గత ప్రభుత్వ హయాంలోనే టిఎస్‌పిఎస్‌సి టెన్త్ పేపర్లు లీకు అయ్యాయని గుర్తు చేశారు. తప్పుడు సమాచారాన్ని సోషల్ మీడియా ద్వారా గంటల్లోనే తిప్పికొట్టాలని పార్టీ శ్రేణులకు ఆయన వివరించారు. బిఆర్ఎస్, బిజెపి తప్పుడు ప్రచారాన్ని ఎదుర్కొనేందుకు కాంగ్రెస్ పార్టీ సిద్ధంగా ఉందన్నారు.

తెలంగాణ పిసిసి మీడియా, పబ్లిసిటీ సెల్ చైర్మన్‌గా తనను నియమించినందుకు ఎఐసిసి అగ్రనేతలు, సిఎం రేవంత్ రెడ్డితోపాటు టిపిసిసి ప్రెసిడెంట్‌కు ఎంపి చామల కిరణ్ కుమార్ రెడ్డి ధన్యవాదాలు తెలిపారు. బావా, బామ్మర్దులు మరోసారి నీళ్ల పేరుతో తెలంగాణ ప్రజలను రెచ్చగొట్టి సెంటిమెంట్ ను తెరపైకి తేవాలని చూస్తున్నారనీ అన్నారు. బిఆర్ఎస్, బిజెపి చెడు ప్రచారాన్ని తిప్పికొడతామనీ ధీమా వ్యక్తం చేశారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం, సిఎం రేవంత్ రెడ్డిపై బురద చల్లడం కెటిఆర్, హరీశ్‌రావు లక్ష్యమని అన్నారు. కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులు తీసుకు రావడంలో బిఆర్ఎస్ ఫెయిల్ అయిందనీనిజాం నవాబులాగా పదేళ్లు కెసిఆర్ పాలన చేశారనీ అన్నారు. ప్రజలకు కష్టాలు వస్తే ఆనందం పొందే బుద్ధి కెటిఆర్, హరీశ్‌రావు మానుకోవాలనీ హితవు చెప్పారు.

## చేనేత కార్మికుల సంక్షేమమే పరమావధి

### జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా ఘనంగా వేడుకలు

### కొండా లక్ష్మణ్ బాపూజీ చేనేత పురస్కార గ్రహీతలకు సత్కారం

### రైతన్న, నేతన్నకు అండగా నిలిచే ప్రభుత్వం మాది: మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్,ఆగస్టు7:** దేశానికి అన్నం అందించే రైతన్నకు, వస్త్రం అందించే నేతన్నకు ఒకేసారి ప్రాతినిధ్యం వహించే అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డికి రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్, చేనేత, జౌళి శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వర రావు కృతజ్ఞతలు తెలిపారు. రైతు సంక్షేమంతో పాటు చేనేత రంగ పునరుజ్జీవనాన్ని కూడా సమాన ప్రాధాన్యంతో ముందుకు తీసుకెళ్తున్న ప్రభుత్వం తెలంగాణ ప్రభుత్వమని ఆయన పేర్కొన్నారు. జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా హైదరాబాద్ నెక్లెస్ రోడ్డులోని పీపుల్స్ ప్లాజాలో నిర్వహించిన రాష్ట్రస్థాయి కార్యక్రమంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కొండా లక్ష్మణ్ బాపూజీ చేనేత పురస్కారాలకు ఎంపికైన చేనేత కళాకారులను ఘనంగా సత్కరించి అభినందించారు. చేనేత రంగ అభివృద్ధికి వారు అందిస్తున్న విశిష్ట సేవలు కొత్త తరానికి ఆదర్శంగా నిలుస్తాయని కొనియాడారు.

అనంతరం పీపుల్స్ ప్లాజాలో ఏర్పాటు చేసిన చేనేత వస్త్ర ప్రదర్శనను మంత్రి ప్రారంభించారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందిన నైపుణ్యమైన చేనేత కళాకారులు ఏర్పాటు చేసిన 100కు పైగా స్టాల్స్ ను సందర్శించి, వారి చేతి పనితనం, సంప్రదాయ నైపుణ్యం, ఆధునిక డిజైన్ల సమన్వయంతో రూపొందించిన వస్త్రాలను పరిశీలించారు. కొండా లక్ష్మణ్ బాపూజీ అవార్డు గ్రహీతలు రూపొందించిన ప్రత్యేక చేనేత ఉత్పత్తులను ఆసక్తిగా వీక్షించి, వారి ప్రతిభను అభినందించారు. ఈ ప్రదర్శన ఆగస్టు 7 నుంచి 16 వరకు కొనసాగుతుందని, ప్రజలు పెద్ద ఎత్తున సందర్శించి చేనేత ఉత్పత్తులను కొనుగోలు చేసి నేతన్నలను ప్రోత్సహించాలని మంత్రి పిలుపునిచ్చారు. చేనేత కార్మికుల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను మంత్రి వివరించారు. రెండేళ్ల కాలపరిమితితో ..నేతన్న పొదుపు పథకం.. అమలవుతోందని, ..నేతన్నకు భద్రత.. పథకం ద్వారా మరణించిన చేనేత కార్మికుడి కుటుంబానికి రూ.5 లక్షల బీమా సాయం అందిస్తున్నామని తెలిపారు. చేనేత రుణమాఫీ కోసం రూ.49.27 కోట్లు విడుదల చేశామని, ..నేతన్న భరోసా.. పథకం కింద చేనేత కార్మికులకు సంవత్సరానికి రూ.18 వేల చొప్పున, అనుబంధ కార్మికులకు రూ.6 వేల చొప్పున ఆర్థిక సాయం అందించేలా రూ.15 కోట్లు విడుదల చేసినట్లు వెల్లడించారు. అదేవిధంగా ..నేతన్నకు చేయూత.. కింద రూ.304 కోట్లు, మరమగ్గ కార్మికుల సంక్షేమం కోసం రూ.44 కోట్లు, ..నేతన్న భద్రత.. కోసం రూ.20 కోట్లు విడుదల చేశామని మంత్రి తెలిపారు. వేములవాడలో రూ.50 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేసిన యార్న్ డిపో ద్వారా ఇప్పటివరకు 3096 మెట్రిక్ టన్నుల నూలును మాక్స్ సంఘాలకు క్రెడిట్ పద్ధతిలో సరఫరా చేశామని చెప్పారు. గత ప్రభుత్వం పెండింగ్‌లో ఉంచిన రూ.500 కోట్ల బకాయిలతో పాటు



మొత్తం రూ.980 కోట్లు విడుదల చేసి చేనేత రంగానికి ఆర్థిక ఊతం కల్పించామని వెల్లడించారు. దశాబ్దకాలంగా పెండింగ్‌లో ఉన్న చేనేత సహకార సంఘాల ఎన్నికలను నిర్వహించి ప్రజాస్వామ్య వ్యవస్థను పునరుద్ధరించామని మంత్రి తెలిపారు. చేనేత కార్మికుల సంక్షేమం, అభివృద్ధి, మార్కెటింగ్, ఆధునికీకరణ, సామాజిక భద్రత వంటి అన్ని అంశాల్లో ప్రభుత్వం సంపూర్ణ అండగా ఉంటుందని, నేతన్నకు ఏ సమస్య వచ్చినా ప్రభుత్వం అండగా నిలుస్తుందని మంత్రి శ్రీ తుమ్మల నాగేశ్వరరావు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా మరియు శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క, జౌళి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సబ్యసాచి ఘోష్, టెస్కో అధికారులు, చేనేత రంగ ప్రముఖులు, అవార్డు గ్రహీతలు, చేనేత సహకార సంఘాల ప్రతినిధులు, పెద్ద సంఖ్యలో చేనేత కార్మికులు పాల్గొన్నారు.

## ముదిరాజ్‌ల ఆత్మగౌరవాన్ని దెబ్బతీస్తున్న ప్రభుత్వం

### పండుగ సాయన్న విగ్రహం తొలగింపుపై తీవ్రఆగ్రహం

### అక్రమ అరెస్టులతో గొంతు నొక్కలేరు: మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు

**ఊర్కొండ, ఆగస్టు 7, ప్రభాతవార్త:** అచ్చంపేట నియోజకవర్గంలో కాంగ్రెస్ ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పూర్తిగా అరాచక పాలన సాగిస్తున్నారని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గువ్వల బాలరాజు ధ్వజమెత్తారు. శుక్రవారం ఊర్కొండ పోలీస్ స్టేషన్ వద్ద ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రభుత్వ తీరుపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. లింగాల మండలం కొత్తకుంటపల్లి గ్రామంలో ఐదు సంవత్సరాల క్రితం ఏర్పాటు చేసుకున్న పండుగ సాయన్న విగ్రహాన్ని ప్రభుత్వ ఆదేశాల మేరకే అక్రమంగా తొలగించారని ఆయన ఆరోపించారు. రాష్ట్రంలోనే అత్యధిక సంఖ్యలో ఉన్న ముదిరాజ్ సోదరుల మనోభావాలను, ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం కక్ష్యగట్టి వ్యవహరిస్తోందని మండిపడ్డారు. లింగాల మండల కేంద్రంలో పండుగ సాయన్న విగ్రహాన్ని తొలగించి ముదిరాజుల గొంతునొక్కాలని చూస్తోందని, శాంతియుతంగా నిరసన తెలుపుతున్న ముదిరాజులకు సంఘీభావం తెలపడానికి వెళ్తున్న తనను కొత్త గేట్ వద్ద ఎలాంటి ముందస్తు సమాచారం ఇవ్వకుండా అక్రమంగా అదుపులోకి తీసుకొని ఊర్కొండ పోలీస్ స్టేషన్‌కు తరలిం చారని తెలిపారు. అచ్చం పేట నియోజక వర్గంలో ఎక్కడ ఏ సమస్య వచ్చినా, ప్రజలు నిరసన తెలిపినా అణచి వేయడమే లక్ష్యంగా రేవంత్ రెడ్డి ప్రభుత్వం పనిచేస్తోందని విమర్శిం చారు. గువ్వల బాలరాజు కనిపిస్తే చాలు, ప్రజల సమస్యలను వెలికితీస్తాడనే భయంతోనే నాయకులను, ప్రజలను అణిచివేసే కుట్రలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేవైయం జిల్లా అధ్యక్షులు నరేష్ చారి, కల్వకుర్తి, ఊర్కొండ మండలాల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు

## చేనేత రంగాభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత

### జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా నేతన్నలకు మంత్రి పొన్నం శుభాకాంక్షలు

**హైదరాబాద్, ఆగస్టు 7, ప్రభాతవార్త:** జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా రాష్ట్రంలోని చేనేత కార్మికులు, వారి కుటుంబ సభ్యులందరికీ బీసీ సంక్షేమం, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. చేనేత మన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అని, మన కళాత్మకతను ప్రపంచానికి చాటిచెప్పే గొప్ప వారసత్వం చేనేత అని కొనియాడారు. ఎన్నో సవాళ్లను ఎదుర్కొంటూ ఈ రంగాన్ని నిలబెడుతున్న ప్రతి చేనేత కార్మికుడి కృషి అభినందనీయమన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజాపాలన ప్రభుత్వం చేనేత రంగ అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని, చేనేత కార్మికుల సంక్షేమం, ఉపాధి భద్రత, ఆదాయ వృద్ధి కోసం అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తూ అన్ని వేళలా చేనేత కార్మికులకు ప్రజా ప్రభుత్వం అండగా నిలుస్తోందని మంత్రి స్పష్టం చేశారు. చేనేత రంగం మరింత అభివృద్ధి చెందాలని, ప్రతి చేనేత కుటుంబం సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షి స్తూ చేనేత కార్మికులు, వారి కుటుంబ సభ్యులకు జాతీయ చేనేత దినోత్సవ శుభాకాంక్షలను తెలిపారు.



## గిరిజన సంక్షేమానికి కేంద్రం మరింత అండగా నిలవాలి

### రూ.452.05 కోట్ల స్కాలర్‌షిప్ బకాయిలు విడుదల చేయాలి

### ఢిల్లీలో కేంద్ర గిరిజన శాఖ మంత్రి జ్యువెల్ ఓరంతో రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ భేటీ

**హైదరాబాద్, ఆగస్టు 7, ప్రభాతవార్త:** రాష్ట్ర గిరిజనుల సంక్షేమం, విద్యాభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పనకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న కీలక అంశాలపై రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ శుక్రవారం ఢిల్లీలో కేంద్ర గిరిజన శాఖ మంత్రి జ్యువెల్ ఓరంను కలిసి విజ్ఞప్తి చేశారు. తెలంగాణ రాష్ట్రానికి రావాల్సిన కేంద్ర నిధులను తక్షణమే విడుదల చేయాలని, గిరిజన సంక్షేమ పథకాలకు పూర్తి స్థాయిలో సహకారం అందించాలని మంత్రి అడ్లూరి కేంద్రాన్ని కోరారు. తెలంగాణ రాష్ట్రానికి విడుదల శాఖకు సంబంధించిన పెండింగ్ నిధులను మొత్తం మంజూరు చేస్తానని హామీ ఇచ్చారని మంత్రి తెలిపారు. కేంద్ర ప్రభుత్వం గిరిజన ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలైన రోడ్లు ఇతర అవసరాల కోసం కేంద్రం నిధులు విడుదల చేయడానికి సిద్ధంగా ఉందని ఈ మేరకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నుంచి గిరిజన ప్రాంతాలలో రోడ్ల నిర్మాణం కోసం ప్రతిపాదనలు పంపించాలని కేంద్ర మంత్రి కోరినట్టు మంత్రి అడ్లూరి లక్ష్మణ్ తెలిపారు. అలాగే హైదరాబాదులో గిరిజన సంక్షేమ శాఖ ఉన్నత అధికారులతో సమావేశాన్ని ఏర్పాటు చేస్తానని హైద్రాబాద్ లో ఏర్పాటు చేస్తానని అడ్దూరి లక్ష్మణ్ కోరగా కేంద్రమంత్రి తప్పకుండా హాజరవుతానని తెలిపారన్నారు. ఆర్టికల్-275(1) కింద అదనంగా రూ.70 కోట్ల నిధులు ఆర్టికల్-275(1) కింద 2024-25 ఆర్థిక సంవత్సరంలో తెలంగాణకు రూ. 98.37 కోట్లు మంజూరయ్యాయని అయితే 2025-26లో రూ.35.26 కోట్లు, 2026-27లో రూ.32.10 కోట్లు మాత్రమే మంజూ రయ్యాయని మంత్రి వివరించారు. గతంతో పోలిస్తే నిధులు గణనీయంగా తగ్గిన నేపథ్యంలో రాష్ట్ర అవసరాలను దృష్టిలో ఉంచుకుని అదనంగా రూ.70 కోట్లు మంజూరు చేయాలని కేంద్రానికి విజ్ఞప్తి చేశారు. గిరిజనులు అధికంగా నివసించే 428 గ్రామాల సమగ్ర అభివృద్ధి కోసం అమలవుతున్న ప్రధాన్ మంత్రి ఆది ఆదర్శ గ్రామ యోజన (పిఏఏజీవై) పథకం కింద మిగిలిన రూ.11.77 కోట్ల నిధులను వెంటనే విడుదల చేయాలని కోరారు. గిరిజన విద్యార్థుల ఉన్నత విద్యకు ఆటంకం కలగకుండా 2024- 25, 2025-26 బకాయిలతోపాటు 2026-27 సంవత్సరానికి సంబంధించిన ప్రతిపాదనల మేరకు రూ. 452.05 కోట్ల కేంద్ర వాటాను విడుదల చేయాలని మంత్రి కోరారు.

## 'ఫీజుల బకాయి - బిజెపి లడాయి' ఉద్యమానికి విద్యార్థుల అపూర్వ స్పందన

### 1,40,985 సంతకాలు సేకరించిన బిజెవైఎం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్, ఆగస్టు 7:** రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్నఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ భారతీయ జనతా యువ మోర్చా (బీజేవైఎం) ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన 'ఫీజుల బకాయి - బిజెపి లడాయి' ఉద్యమానికి విద్యార్థుల నుంచి విశేష స్పందన లభించింది. 'వన్ డే వన్ లాక్ సిగ్నేచర్'లో భాగంగా రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో కళాశాలలు, విశ్వవిద్యాలయాల వద్ద నిర్వహించిన సంతకాల సేకరణ కార్యక్రమంలో విద్యార్థులు స్వచ్ఛందంగా భారీ సంఖ్యలో పాల్గొన్నారు. లక్ష సంతకాల లక్ష్యాన్ని అధిగమిస్తూ ఒక్కరోజులోనే రాష్ట్రవ్యాప్తంగా మొత్తం-1,40,985.. మంది విద్యార్థులు సంతకాలు చేసి కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలకు వ్యతిరేకంగా తమ నిరసనను నమోదు చేశారు. ఈ సందర్భంగా బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షులు గణేష్ కుండే మాట్లాడుతూ ఒక్కరోజులో 1,40,985 మంది విద్యార్థులు చేసిన సంతకాలు కాంగ్రెస్ ప్రభుత్వంపై ఉన్న ప్రజా వ్యతిరేకతకు, విద్యార్థుల ఆవేదనకు నిదర్శనం. ఈ ప్రభుత్వం విద్యార్థుల భవిష్యత్తును నిర్లక్ష్యం చేస్తూ వారి జీవితాలతో చెలగాటమాడుతోందని విమర్శించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు విడుదల కాక వేలాది మంది విద్యార్థులు కళాశాలల్లో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడే ప్రభుత్వాన్ని విద్యార్థులు ఎన్న టికీ క్షమించరని హెచ్చరించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా యువతను మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను వెంటనే విడుదల చేయకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఉధృతమైన విద్యార్థి ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు.

# నీళ్లపై బిఆర్ఎస్‌ది రాజకీయ డ్రామా

## కృష్ణా జలాల్లో తెలంగాణ హక్కులను సాధించి తీరుతాం: మంత్రి జూపల్లి కృష్ణారావు



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఆగస్టు7:** ఉమ్మడి పాలమూరు జిల్లా సాగునీటి ప్రాజెక్టులపై బీఆర్ఎస్ నేతలు చేస్తున్న ఆరోపణలను పర్యాటక, సాంస్కృతిక, పురావస్తు, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు తీవ్రంగా ఖండించారు. ఎల్‌నినో ప్రభావంతో దేశవ్యాప్తంగా వర్షాభావ పరిస్థితులు నెలకొన్నా, సాగునీటి అధికారుల ప్రణాళిక మేరకే జూరాల, నెట్టెంపాడు, భీమా, కోయిల్‌సాగర్ ప్రాజెక్టులకు నీటి నిర్వహణ జరుగుతోందని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సొంత జిల్లాకు నీళ్ల ఇవ్వడం లేదంటూ బీఆర్ఎస్ చేస్తున్న ప్రచారం పూర్తిగా అవాస్తవమని, ప్రజలను తప్పుదోవ పట్టించి రాజకీయ లబ్ది పొందేందుకే ఆ పార్టీ నేతలు ప్రాజెక్టుల వద్ద హంగామా చేస్తున్నారని ఆరోపించారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలో పెండింగ్‌లో ఉన్న అన్ని సాగునీటి ప్రాజెక్టులను కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తి చేస్తుందని, పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని వంద శాతం పూర్తి చేసి రైతులకు సాగునీరు అందిస్తామని చెప్పారు. శుక్రవారం సచివాలయం మీడియా సెంటర్‌లో ఎమ్మెల్యేలు మధుసూదన్‌రెడ్డి, వీర్లపల్లి శంకర్, ఈఎన్సీ (జనరల్) రమేష్‌బాబు, సీఈ విజయ భాస్కర్‌రెడ్డితో కలిసి మీడియాతో మాట్లాడారు. ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాల కారణంగా జూరాలతో పాటు ఇతర ప్రాజెక్టులకు ఇన్‌ఫ్లో పెరుగుతోందని, వచ్చిన నీటికి అనుగుణంగా సాగునీటి అధికారులు ప్రణాళిక ప్రకారం విడుదల చేస్తున్నారని మంత్రి చెప్పారు. ఈ విషయం ముందే తెలిసిన బీఆర్ఎస్ నేతలు ప్రాజెక్టుల వద్ద హంగామా, ఆర్భాటాలు, డ్రామాలు చేస్తున్నారని విమర్శించారు. అధికారులు నీళ్లు విడుదల చేసిన వెంటనే అది తమ ఒత్తిడితో జరిగిందని ప్రచారం చేసుకోవడానికే ఈ రాజకీయ నాటకాలు ఆడుతున్నారని ఆరోపించారు. పాలమూరు బిడ్డ సీఎం రేవంత్‌రెడ్డి, పాలమూరు జిల్లా అల్లుడు సాగునీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి నీళ్లు ఇవ్వడం లేదంటూ బీఆర్ఎస్ నేతలు చేస్తున్న వ్యాఖ్యలు పూర్తిగా నిరాధారమన్నారు. వారి సారథ్యంలోనే ఉమ్మడి పాలమూరు జిల్లా సాగునీటి ప్రాజెక్ట్ లను పూర్తి చేసి తీరుతామని స్పష్టం చేశారు.

# లోక్‌భవన్‌లో ఎట్ హోం కార్యక్రమం

## ఏర్పాట్లపై దానకిశోర్ సమీక్ష

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్,ఆగస్టు7:** స్వాతంత్ర్య దినోత్స వం సందర్భంగా ఈ నెల 15న సాయంత్రం లోక్ భవన్‌లో రాష్ట్ర గవర్నర్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఎట్ హోమ్ కార్యక్రమానికి అన్ని శాఖలు సమన్వయంతో పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని గవర్నర్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం. దానకిశోర్ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు శుక్రవారం లోక్ భవన్‌లో పోలీసు, సాధారణ పరిపాలన, ప్రోటోకాల్, సమాచార, పౌర సంబంధాల శాఖ, దూరదర్శన్, జీహెచ్ఎంసీ, అగ్నిమాపక, విద్యుత్, ఉద్యానవన తదితర శాఖల ఉన్నతాధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. మినిట్ టు మినిట్ కార్యాచరణ, సీటింగ్ ఏర్పాట్లు, పార్కింగ్ ప్రదేశాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అధికారులకు గవర్నర్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వివరించారు. భద్రత, ట్రాఫిక్, బందోబస్తు, వీఐపీ రాకపోకలు, పార్కింగ్, ప్రత్యక్ష ప్రసారం, పారిశుద్ధం, దోమల నివారణ, పూల అలంకరణ, నిరంతర విద్యుత్ సరఫరా, అగ్నిమాపక భద్రత, క్యాటరింగ్, ఆహార నాణ్యత తదితర అంశాల్లో ఎలాంటి లోటుపాట్లు లేకుండా చర్యలు చేపట్టాలని సంబంధిత ప్రభుత్వ శాఖల ఉన్నతాధికారులకు ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం దాన కిషోర్ సూచించారు. అన్ని శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేసి ఖిఎట్ హోమ్ఖి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని స్పష్టం చేశారు. సమావేశంలో ప్రోటోకాల్ డైరెక్టర్ సి హెచ్ లింగయ్య, నగర జాయింట్ పోలీసు కమిషనర్ తఫ్సీర్ ఇక్బాల్, గవర్నర్ సంయుక్త కార్యదర్శి శశికిరాణాచారి, ఏడిసి క్రాంతి లాల్, ఐ అండ్ పి ఆర్ అదనపు సంచాలకులు డి ఎస్ జగన్, చీఫ్ ఇంజనీర్ రాధా కిషన్, డీసీపీ శిల్పవల్లి, డిప్యూటీ సెక్రటరీ జి పల్లవి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ మంత్రులు శ్రీనివాస్‌గౌడ్, లక్ష్మారెడ్డి

# 2047 లక్ష్యాలకు యువత-పరిశోధన-ఆవిష్కరణలే చోదకశక్తి

## కన్హా శాంతివనంలో విజన్ ఇండియా-2047 సదస్సులో మంత్రి జూపల్లి కృష్ణారావు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్,ఆగస్టు7:** స్వాతంత్ర్య శతాబ్ది నాటికి భారత్‌ను అభివృద్ధి చెందిన, స్వావలంబన కలిగిన విజ్ఞాన దేశంగా తీర్చి దిద్దడంలో యువత, శాస్త్ర విజ్ఞానం, ఆవిష్కరణలే ప్రధాన చోదక శక్తులని పర్యాటక, సాంస్కృతిక, పురావస్తు, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. పాలమూరు విశ్వవిద్యాలయం- భారత ప్రభుత్వం విద్యా మంత్రిత్వ శాఖ సంయుక్తంగా నిర్వహిస్తున్న విజన్ ఇండియా-2047: ఇంటిగ్రేటింగ్ సైన్స్, ఇన్నోవేషన్ అండ్ యూత్ ఎంపవర్మెంట్ 2 రోజుల జాతీయ సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. స్వాతంత్ర్య శతాబ్ది నాటికి భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దాలంటే శాస్త్రీయ పరిశోధనలు, సాంకేతిక ఆవిష్కరణలు, యువశక్తి సమన్వయంతో ముందుకుసాగాలని మంత్రి పేర్కొన్నారు. కృత్రిమ మేధస్సు (ఏఐ), డేటా సైన్స్, బయోటెక్నాలజీ, సెమీకండక్టర్లు, పునరుత్పాదక ఇంధనం, అంతరిక్ష సాంకేతికత, స్టార్టప్‌లు వంటి రంగాలే భవిష్యత్ ఆర్థిక వ్యవస్థను నిర్దేశిస్తాయని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలోని ప్రజా ప్రభుత్వం 2047 నాటికి తెలంగాణను మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దే లక్ష్యంతో సమతుల్య, సుస్థిర అభివృద్ధికి కట్టుబడి పనిచేస్తోందని మంత్రి తెలిపారు. ఇందుకోసం క్యూర్, ప్యూర్, రేర్, మహిళల ఆధ్వర్యంలోని అభివృద్ధి అనే నాలుగు అభివృద్ధి స్తంభాలపై ప్రభుత్వం ముందుకు సాగుతోందని చెప్పారు. ఇవి ప్రాంతీయ సమతుల్య అభివృద్ధి, వ్యవసాయ ప్రగతి, పారిశ్రామిక వృద్ధి, సామాజిక సమగ్రతకు దోహదపడతాయని పేర్కొన్నారు. ఆర్థికాభివృద్ధి మాత్రమే సరిపోదని, సమాజంలో ఆలోచనా విధానంలో కూడా మార్పు రావాల్సిన అవసరం ఉందని మంత్రి అన్నారు. గ్రామీణ భారతం ఇప్పటికీ అప్పుల ఊబిలో కూరుకుపోయి ఉండటం ఆందోళన కలిగించే అంశమన్నారు. దేశంలో ఆశించిన స్థాయిలో అక్షరాస్యతను పెంచలేకపోయామని చెప్పారు కార్పొరేట్ విద్య, కార్పొరేట్ వైద్యం వైపు అధికంగా మొగ్గు చూపడం, సామాజిక అనుకరణలో భాగంగా వివాహాలు, ఇతర కుటుంబ వేడుకలను ఆడంబరంగా నిర్వహించడం వల్ల అనేక కుటుంబాలు అప్పుల పాలవుతున్నాయని మంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలకు నాణ్యమైన ప్రభుత్వ విద్య, వైద్య సేవలను అందిస్తూ, వాటిని మరింత బలోపేతం చేయడం ద్వారానే వికసిత్ భారత్-2047, రైజింగ్ తెలంగాణ-2047 లక్ష్యాలను సాధించవచ్చని స్పష్టం చేశారు. సామాజిక రుగ్మతలపై ప్రజల్ని చైతన్యవంతం చేసే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని, త్వరలోనే ప్రభాత భేరి కార్యక్రమాన్ని ప్రారంభిస్తామని తెలిపారు.



కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామితో జరిగిన చర్చలు ఫలప్రదం కావడంతో కృతజ్ఞతలు తెలుపుతున్న తెలంగాణ గిగ్ అండ్ ప్లాట్‌ఫామ్ వర్కర్స్ యూనియన్ వ్యవస్థాపక అధ్యక్షుడు షేక్ సలాహుద్దీన్ బృందం

# గిగ్ వర్కర్ల సమ్మె వాయిదా

## మంత్రి వివేక్‌వెంకటస్వామి సానుకూల హామీతో నిర్ణయం

### సిజెసి సమక్షంలో ప్లాట్‌ఫామ్ కంపెనీలు, యూనియన్లతో ఫలప్రదమైన చర్చలు

**హైదరాబాద్ (చిక్కడపల్లి; ఆగస్టు 7, ప్రభాతవార్త :** రాష్ట్రంలో శనివారం నుంచి చేపట్టాలనుకున్న గిగ్, ప్లాట్‌ఫామ్ కార్మికుల నిరవధిక సమ్మె తాత్కాలికంగా వాయిదా పడింది. కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి ఇచ్చిన సానుకూల హామీ మేరకు సమ్మె నిర్ణయాన్ని వాయిదా వేస్తున్నట్లు తెలంగాణ గిగ్ అండ్ ప్లాట్‌ఫామ్ వర్కర్స్ యూనియన్ వ్యవస్థాపక అధ్యక్షుడు షేక్ సలాహుద్దీన్ శుక్రవారం రాత్రి ప్రకటించారు. ఆర్టీసీ క్రాస్ రోడ్స్‌లోని టి. అంజయ్య కార్మిక సంక్షేమ భవన్‌లో శుక్రవారం కార్మిక శాఖ అదనపు కమీషనర్ డాక్టర్ జి. గంగాధర్, కార్మిక శాఖ జాయింట్ కమిషనర్ శ్యామ్‌సుందర్ రెడ్డి, రవాణా శాఖ అదనపు కమిషనర్ రమేష్‌ల ఆధ్వర్యంలో సుదీర్ఘ చర్చలు జరిగాయి. ఈ సమావేశంలో ఉబెర్, స్విగ్గీ, జొమాటో తదితర యాప్ ఆధారిత కంపెనీల ప్రతినిధులు ఆన్‌లైన్ (కాల్) ద్వారా హాజరయ్యారు. ప్రభుత్వం రూపొందించే మోటార్ వెహికల్ అగ్రిగేటర్ గైడ్‌లైన్స్ అమల్లోకి రాగానే, ప్రభుత్వం నిర్దేశించే ఛార్జీలను (ఫేర్) తప్పక పాటిస్తామని కంపెనీల ప్రతినిధులు స్పష్టం చేశారు. అధికారులతో చర్చల అనంతరం, కార్మిక సంఘాల ప్రతినిధులు మంత్రి వివేక్ వెంకటస్వామితో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గిగ్ వర్కర్ల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం అత్యంత సానుకూలంగా ఉందన్నారు. గిగ్ వర్కర్ల సంక్షేమ బోర్డు ఏర్పాటు, పాలసీ ఫ్రేమ్‌వర్క్ రూపకల్పనపై త్వరలోనే విధాన పరమైన నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు.

# తాండూరు మార్కెట్ యార్డు చైర్మన్‌గా శ్రీనివాస్

**హైదరాబాద్, అగస్టు 7, ప్రభాతవార్త:** వికారాబాద్ జిల్లాలోని తాండూరు వ్యవసాయ మార్కెట్ యార్డుకు నూతన పాలకవర్గానిన నియమిస్తూ వ్యవసాయ శాఖ నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు దీనికి సంబంధించి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. తాండూరు మార్కెట్ కమిటీకి మేస్త్రీ శ్రీనివాస్‌ను చైర్మన్ గా, షేక్ ఖాసీం అలీని వైస్ చైర్మన్ గా నియమిస్తూ ఈ ఉత్తర్వుల్లో వెల్లడించింది.

నూతన పాలకవర్గానికి రెండేళ్ల పదవీకాలం ఉండనుంది. కాగా తాండూరు మార్కెట్ కమిటీల తొలి పాలకవర్గాల పదవీకాలం గత నెల 4వ తేదీతో ముగిసింది. ఈ సందర్భంగా వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ, రైతులకు మార్కెట్ వ్యవస్థ మరింత సమర్థవంతంగా పనిచేయాలన్నారు. వ్యవసాయ ఉత్పత్తుల కొనుగోలు, నిల్వ, విక్రయ ప్రక్రియల్లో పారదర్శకతను పెంపొందించడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. మార్కెట్ యార్డులు రైతులకు సేవలందించే కీలక వేదికలని, వాటి ద్వారా రైతులు తమ పంటలకు సరైన ధరలు పొందేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.

# 42శాతం బిసి రిజర్వేషన్‌కు వెంటనే ఆమోదం తెలపాలి

## పిసిసి ఒబిసి సెల్ ఆధ్వర్యంలో గాంధీభవన్‌లో మండల్ కమిషన్ డే

**హైదరాబాద్, ఆగస్టు 7, ప్రభాతవార్త:** సామాజిక న్యాయం అన్ని వర్గాలకు అందాలంటే 42శాతం ఒబిసి రిజర్వేషన్ల అమలు చేయడానికి కేంద్ర ప్రభుత్వం చొరవతీసుకోవాలని టిపిసిసి ఒబిసి రాష్ట్ర కన్వీనర్ డా. కేతూరి వెంకటేష్ డిమాండ్ చేశారు. శుక్రవారం గాంధీభవన్‌లో మండల్ కమిషన్ డే ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా డా. కేతూరి వెంకటేష్ మండల్ కమిషన్ రూపశిల్పి, సామాజిక న్యాయ యోధుడు బిందేశ్వరి ప్రసాద్ మండల్ చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో డా. కేతూరి వెంకటేష్ మాట్లా డుతూ, భారతదేశంలో వెనుకబడిన వర్గాల సామాజిక, విద్యా, ఉద్యోగ హక్కుల సాధనలో మండల్ కమిషన్ చారిత్రాత్మక మైలురాయి అని పేర్కొన్నారు. దేశంలో సామాజిక న్యాయం, సమాన అవకాశాలు, రాజ్యాంగబద్ధమైన హక్కుల సాధనకు బలమైన పునాది వేసింది మండల్ కమిషనేనని అన్నారు. బిసిల ఆత్మగౌరవానికి, సాధికారతకు దిశానిర్దేశం చేసిన మహనీయుడు బి.పి. మండల్ అని కొనియాడారు. ఆయన దూరదృష్టి, కృషి ఫలితంగానే లక్షలాది మంది వెనుకబడిన వర్గాల యువతకు విద్యా, ఉద్యోగ రంగాల్లో అవకాశాలు లభించాయని, భారత ప్రజాస్వామ్యంలో సామాజిక న్యాయానికి శాశ్వత స్థానం కల్పించిన మహోన్నత వ్యక్తిగా ఆయన చిరస్థాయిగా నిలిచిపోతారని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ ఆయన ఆశయాలను ఆచరణలో పెట్టి సామాజిక న్యాయం కోసం ఐక్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో లైవ్ స్టాక్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ చరణ్ కౌశిక్, బోయ కార్పొరేషన్ వైస్ చైర్మన్ బోయ నాగేష్, టిపిసిసి ఫిషరీస్ సెల్ చైర్మన్ మెట్టు సాయికుమార్, టిపిసిసి ఒబిసి విభాగం రాష్ట్ర నాయకులు మేకల వీరన్న, ఆలోక్‌నాథ్, రాజేష్ శామీర్‌పేట్, అరుణ్ కుమార్ గౌడ్, దేరంగుల కృష్ణ, వరికుప్పల సుధాకర్, తిరుపతి రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

## మెడికో ప్రియాంకను కారుతో ఢీ కొట్టిన కేసు

# ఇద్దరు నిందితుల అరెస్టు

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి,ఆగస్టు7, ప్రభాతవార్త:** వైద్య విద్యార్థిని ప్రియాంకను కారుతో ఢీకొట్టిన కేసులో అరెస్టు చేసిన ఇరువురు నిందితులను పోలీసులు శుక్రవారం కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి వారిద్దరికీ 14 రోజులు రిమాండ్ విధించారు. ఈమేరకు రాజ మహేంద్రవరం ప్రకాష్ నగర్ సిఐ బాజీ లాల్ తెలిపారు. ఈనెల మూడో తేదీన ప్రసాదిత్య మాల్ వద్ద జరిగిన కారు ప్రమాద ఘటనలో ఇద్దరు యువకులపై కేసు నమోదు చేసి అరెస్టు చేశారు. జీఎస్ఎల్ మెడికల్ కాలేజ్ విద్యార్థి మలి వెంకట దుర్గా సాయి ఉమేష్ హాస్పిటల్ స్టేట్మెంట్ ప్రకారం అలాగే ప్రసాదిత్య మాల్ మేనేజర్ విజయ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేశారు. నిందితుడు సురావరపు ద స్వంత మద్యం మత్తులో కారును నిరక్ష్యంగా నడిపి స్కూటర్ను వెనకనుంచి రెండుసార్లు ఢీ కొట్టి మరల మూడోసారి మెయిన్ రోడ్డు పై బలంగా గుద్దడంతో ప్రియాంక అక్కడికక్కడే రోడ్డుపై పడిపోయి తీవ్రగాయాలు పాలయ్యింది. ఉమేష్ కూడా గాయాలు కావడంతో వారి ఇద్దరిని స్వతంత్ర హాస్పిటల్ లో జాయిన్ చేశారు. ప్రియాంక పరిస్థితి విషమంగా ఉండటంతో కుటుంబ సభ్యులు హైదరాబాద్ తీసుకెళ్లి అక్కడ మెరుగైన వైద్యం అందిస్తున్నారు. ప్రియాంక బ్రెయిన్ డెడ్ అయిందని వైద్యులు నిర్ధారించారు. ఆమెకు హైదరాబాద్ లోనే వైద్యం అందిస్తున్నారు. ఈ కేసులో సురావరపు దస్వంత్, ఆంద్రు జోసెఫ్ ఆడ్ వర్డ్స్ లపై ప్రకాష్ నగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. ప్రియాంక, ఉమేష్ ఇద్దరు స్నేహితులు. ఇద్దరు సోమవారం ప్రసాదిత్య మాలలో మొదట షో సినిమా చూసి వెళుతుండగా ఈ సంఘటన జరిగింది. రాజమహేంద్రవరంలో వాహనం ఢీ కొట్టిన ఘటనలో ఇద్దరు వైద్య విద్యార్థులు తీవ్రంగా గాయపడిన విషయం తెలిసి రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. మద్యం మత్తులో వాహనం నడిపి ప్రమాదానికి కారణమైన నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు స్పష్టం చేశారు. ఏలూరు రేంజ్ డిఐజితో మాట్లాడి ప్రమాద ఘటనను సీరియస్ గా తీసుకోవాలన్నారు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వైద్య విద్యార్థులు ప్రియాంక ,ఉమేష్ ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. ఈ ప్రమాద ఘటనపై కూడా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సీరియస్ గా తీసుకున్నారు. ప్రియాంకకు మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు. నిందితులపై చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

# పాలిమర్ రంగానికి ప్రభుత్వం అండ

## హిప్లెక్స్ ప్రదర్శనను ప్రారంభించిన శ్రీధర్‌బాబు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్, ఆగస్టు7::** ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న ఆర్థిక, భౌగోళిక రాజకీయ అనిశ్చితులను సవాళ్లుగా కాకుండా కొత్త అవకాశాలుగా మలుచుకోవాలని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పారిశ్రామికవేత్తలకు పిలుపునిచ్చారు. సంక్షోభ సమయాల్లోనే కొత్త సాంకేతికత, నాణ్యత, ఆవిష్కరణలపై పెట్టుబడులు పెట్టే పరిశ్రమలే భవిష్యత్తులో మార్కెట్‌ను శాసిస్తాయని అన్నారు. పరిశ్రమల అభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. శుక్రవారం హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో శుక్రవారం నిర్వహించిన హిప్లెక్స్-2026 (హైదరాబాద్ ఇంటర్నేషనల్ ప్లాస్టిక్స్ ఎక్స్‌పో) ప్లాస్టిక్స్, పాలిమర్స్, ప్రాసెసింగ్ టెక్నాలజీ, యంత్రాల అంతర్జాతీయ ప్రదర్శనను మంత్రి ప్రారంభించి ప్రసంగించారు. పరిశ్రమల ప్రదర్శనల్లో తనకు యంత్రాలు మాత్రమే కనిపించవని, వాటి వెనుక వేలాది కుటుంబాల జీవనోపాధి, దేశాభివృద్ధికి కృషి చేస్తున్న పారిశ్రామికవేత్తల సంకల్పం, యువత భవిష్యత్తు కనిపిస్తాయని మంత్రి పేర్కొన్నారు. ఎన్ని ప్రతికూల పరిస్థితులు ఎదురైనా పెట్టుబడులు, విస్తరణ, ఆవిష్కరణలను కొనసాగిస్తున్న పరిశ్రమల ఆత్మవిశ్వాసమే భారతదేశ బలమని అన్నారు.

ప్లాస్టిక్స్, పాలిమర్ పరిశ్రమ దేశ తయారీ రంగంలో అత్యంత కీలకమైందని తెలిపారు. గృహనిర్మాణం, తాగునీటి సరఫరా, వ్యవసాయం, వైద్యరంగం, ఔషధ తయారీ, ఆటోమొబైల్, ఎలక్ట్రానిక్స్, ఆహార ప్రాసెసింగ్, మౌలిక సదుపాయాల రంగాలకు అవసరమైన ముడి పదార్థాలను ఈ రంగమే అందిస్తోందన్నారు. దేశవ్యాప్తంగా ఈ పరిశ్రమ ద్వారా 50 లక్షల మందికి ప్రత్యక్షంగా, కోటికి పైగా మందికి పరోక్షంగా ఉపాధి లభిస్తోందని, తెలంగాణలోనే సుమారు 2 లక్షల మంది జీవనోపాధి ఈ రంగంపై ఆధారపడి ఉందని వివరించారు.

# ప్రైవేట్ స్కూళ్ల ఫీజు వివరాలను బహిర్గతం చేయకుంటే చర్యలు

## స్కూల్ నోటీస్ బోర్డులో ఫీజు వివరాలను పొందుపరచాలి

### ఆదేశాలు జారీ చేసిన పాఠశాల విద్య శాఖ డైరెక్టర్

**హైదరాబాద్, ఆగస్టు 7, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ప్రైవేటు స్కూల్స్‌పై పట్టుబిగించడం కోసం ప్రభుత్వం ప్రాథమిక చర్యలు ప్రారంభించింది. ప్రైవేటు స్కూల్స్‌లో ఇష్టానుసారంగా ఫీజులను వసూలు చేస్తున్నారనే విమర్శలు రావడంతో.. ఫీజు నియంత్రణ కోసం చట్టం చేయాలని భావించిన రాష్ట్ర సర్కార్.. చట్టం రూపకల్పన తుది దశలో ఉన్నట్టు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో ఇపుడు ప్రైవేటు స్కూల్స్ ప్రస్తుతం వారు వసూలు చేస్తున్న ట్యూషన్ ఫీజుల వివరాలను బహిర్గత పరచాలని పాఠశాల విద్య శాఖ ఆదేశాలు జారీ చేసింది. ఇందుకు సంబంధించిన ఉత్తర్వులను పాఠశాల విద్య శాఖ డైరక్టర్ నవీన్ నికోలస్ జారీ చేశారు. రాష్ట్రంలోని ప్రైవేటు, అన్ ఎయిడెడ్ పాఠశాలలన్నీ కూడా తమ పాఠశాలలో వసూలు చేస్తున్న ట్యూషన్ ఫీజు వివరాలను బహిర్గత పరచాలని పేర్కొన్నారు. అన్ని ప్రైవేటు స్కూల్స్ ఫీజుల వివరాలను డిస్‌ప్లే చేయాలని పాఠశాల విద్య శాఖ ఆదేశించింది. అన్ని ప్రైవేటు స్కూల్స్ 2026-27 విద్యా సంవత్సరానికి సంబంధించిన తరగతి వారీ ఫీజుల వివరాలను ప్రతి ప్రైవేట్ పాఠశాల నోటీసు బోర్డులో, పాఠశాల వెబ్‌సైట్‌తోపాటు రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ పోర్టల్‌లో తప్పనిసరిగా అప్‌లోడ్ చేయాలని పాఠశాల విద్యాశాఖ ఆదేశాలు జారీ చేసింది. ఫీజులను ఎలా నిర్ణయించారు అనే అంశాలకు సంబంధించి పాఠశాల గవర్నింగ్ బాడీ సభ్యుల సంతకాలతో కూడిన డాక్యుమెంట్లను కూడా పోర్టల్‌లో పొందుపరచాలని స్పష్టం చేసింది. ఫీజు వివరాలను డిస్‌ప్లే చేయని పాఠశాలలకు షోకాజ్ నోటీసులు జారీ చేసి నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారులను ఆదేశించారు

# సైబర్ నేరాల నియంత్రణలో దేశంలోనే తెలంగాణకు ప్రథమ స్థానం

## సైబర్ సెక్యూరిటీ బ్యూరో అధికారులకు డిజిపి సివి ఆనంద్ అభినందనలు

### జాతీయ ప్రగతి సమీక్షలో 9 కీలక మూల్యాంకన ప్రమాణాల్లో అగ్రస్థానం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్,ఆగస్టు7:** సైబర్ నేరాల నియంత్రణ, బాధితులకు న్యాయం, అత్యాధునిక సాంకేతికత విని యోగం, ప్రజల్లో అవగాహన కల్పించడం వంటి అంశాల్లో తెలంగాణ పోలీసు శాఖ మరోసారి దేశానికి ఆదర్శంగా నిలిచింది. ఈ సందర్భంగా శుక్రవారం రాష్ట్ర డీజీపీ సీవీ ఆనంద్ తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్ శిఖా గోయల్, సిపిలను, ఎస్పీలతో పాటు సైబర్ సెక్యూరిటీ బ్యూరో అధికారులు, సిబ్బందిని అభినందించారు. ప్రధానమంత్రి కార్యాలయం (పిఎంఓ) ఆధ్వర్యంలో గురు వారం నిర్వహించిన జాతీయ ప్రగతి సమీక్షలో సమావేశంలో రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల సైబర్ నేరాల పనితీరును 9 కీలక మూల్యాంకన ప్రమాణాల ఆధారంగా పరిశీలించగా, తెలంగాణ దేశంలోనే ప్రథమ స్థానం సాధించింది.

సైబర్ నేరాల నియంత్రణ కోసం స్టేట్ సైబర్ క్రైమ్ కోఆర్డినేషన్ సెంటర్ (ఎస్4సి) కింద ప్రత్యేక తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (టిజిసిఎస్‌బి)....ను ఏర్పాటు చేసిన దేశంలో తొలి రాష్ట్రంగా తెలంగాణ నిలిచింది. రూ.5 లక్షలు లేదా అంతకంటే ఎక్కువ విలువైన సైబర్ మోసాల కేసుల్లో 49 ఈజీరో ఎఫ్ఐఆర్‌లు నమోదు చేస్తుంది. సైబర్ నేరాల ఫిర్యాదుల పరిష్కారంలో 88 శాతం, బాధితుల డబ్బు తిరిగి పొందే ప్రక్రియలో 81 శాతం పనితీరు నమోదు చేసింది. సహయోగ్ పోర్టల్ ద్వారా అభ్యంతరకర, నేరాలకు సంబంధించిన ఆన్‌లైన్ కంటెంట్ తొలగింపులో 88 శాతం పని తీరుతో



మెరుగైన ఫలితాలను నమోదు చేసింది. అంతర్రాష్ట్ర సమన్వ యంలో 97 శాతం సిపిఏఆర్ అభ్యర్థనలను పూర్తి చేయడంతో పాటు, 79 శాతం రాష్ట్రాల మధ్య అభ్యర్థనలను పరిష్కరించింది. అలాగే 5,500 మంది నేరస్థుల ప్రొఫైళ్ల అప్‌లోడ్ చేయగా, 15 వేల అంతర్రాష్ట్ర నేర లింకులను గుర్తించింది. మరో వైపు సైబర్ నేరాల కట్టడికి పోలీసు సిబ్బంది లో సామర్థ్య పెంపు కోసం 524 మంది అధికారులకు సైట్రెయిన్ పోర్టల్ ద్వారా శిక్షణా సదుపాయాలు కల్పించింది. దేశవ్యాప్తంగా గుర్తించిన 15 తీవ్రమైన సైబర్ హాట్‌స్పాట్ రాష్ట్రాల జాబితాలో తెలంగాణ లేకపోవడం రాష్ట్ర సైబర్ నేరాల నియంత్రణ సామర్థ్యాన్ని ప్రతిబింబిస్తోంది. పోలీసులు ప్రజల్లో సైబర్ భద్రతపై విస్తృత అవగాహన కల్పించేందుకు చేపట్టిన కార్యక్రమాల ద్వారా 8.5 లక్షల మందికి పైగా చేరుకోగా, డిజిటల్ అరెస్ట్ మోసాలపై మరో 2 లక్షల మందికి ప్రత్యేక అవగాహన కల్పించింది. సైబర్ నేరాల నియంత్రణలో దేశస్థాయిలో తెలంగాణ మరోసారి ప్రథమ స్థానం సాధించడం తెలంగాణ పోలీసు శాఖ సమిష్టి కృషికి నిదర్శనమని అధికారులు పేర్కొన్నారు.

# 11లోగా మోటార్లు ప్రారంభించాలి

## కల్వకుర్తి, ఎల్లూరు, పాలమూరు-రంగారెడ్డి నర్లాపూర్ పంపుల నుంచి నీటిని విడుదల చేయాలి

### లేదంటే వేలాదిమంది రైతులతో ఆందోళన చేపడతాం

### మాజీ మంత్రులు శ్రీనివాస్‌గౌడ్, సి.లక్ష్మారెడ్డి అల్టిమేటం

**మహబూబ్‌నగర్ బ్యూరో, ఆగస్టు 7, ప్రభాతవార్త:** శ్రీశైలం జలాశయం 162 టీఎంసీలకు చేరినా, కల్వకుర్తి ఎత్తిపోతల పథకం రిజర్వాయర్ల నుంచి సాగునీరు విడుదల చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం మొద్దు నిద్ర పోతోందని మాజీ మంత్రి వి. శ్రీనివాస్ గౌడ్ మండిపడ్డారు. తక్షణమే కల్వకుర్తి ఎత్తిపోతల పథకంలోని మోటార్లను, పాలమూరురంగారెడ్డి ప్రాజెక్టు నార్లాపూర్ పంపులను ఆన్ చేసి, నీటిని ఎత్తిపోసి రిజర్వాయర్ల కింద ఉన్న ఆయకట్టుకు సాగునీరు విడుదల చేయాలని ఈ సందర్భంగా మాజీ మంత్రులు శ్రీనివాస్ గౌడ్ లక్ష్మారెడ్డి డిమాండ్ చేశారు. ప్రవాహాలు నమోదై వారం రోజులు గడిచినా, శ్రీశైలం జలాశయం నిండుతున్నా రైతులకు నీళ్ల ఇవ్వాలనే నిర్ణయం ప్రభుత్వం తీసుకోకపోవడం దారుణమన్నారు. తెలంగాణకు అందుబాటులో ఉన్న నీటిని వినియోగించుకోకుండా ఆంధ్రప్రదేశ్‌కు తెలంగాణ నీళ్లను ధారాదత్తం చేయడమే అవుతుందని విమర్శించారు. ఒకవైపు పోతిరెడ్డి పాడు హెడ్‌రెగ్యులేటర్, మాల్యాల పంప్ హౌస్‌ల ద్వారా ఆంధ్రప్రదేశ్ వేలాది క్యూసెక్కుల నీటిని తరలించుకుంటుంటే, మరోవైపు తెలంగాణ ప్రభుత్వం శ్రీశైలం నుంచి నీటిని ఎత్తిపోసుకోకుండా చేతులు ముడుచు కొని కూర్చోవడం కాంగ్రెస్ ప్రభుత్వ అసమర్థతకు నిదర్శనమని శ్రీనివాస్‌గౌడ్ అన్నారు.

**మరోసారి పోరుకు సిద్ధం : మాజీమంత్రి లక్ష్మారెడ్డి**

పాలమూరు రైతులకు సాగునీరు అందించేందుకు పోరు బాటకు సిద్ధమని మాజీ మంత్రి లక్ష్మా రెడ్డి పేర్కొన్నారు. కృష్ణా నదికి ఎగువ నుండి భారీగా వరద వస్తున్నా... నీళ్లే లేవంటూ రైతాంగాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేస్తుందని అన్నారు. ఈ నెల 11 వరకు డెడ్‌లైన్ విధిస్తున్నామని.. అప్పటి లోగా ప్రారంభించకుంటే బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తో కలిసి లక్షలాది మంది రైతులతో నార్లాపూర్‌ను ముట్టడిస్తామని మాజీ శాసన సభ్యులు అల వెంకటేశ్వర్ రెడ్డి, రాజేందర్ రెడ్డి పేర్కొన్నారు. అక్కడ రైతులు.. ప్రజలతో మాట్లాడి భవిష్యత్తు కార్యాచరణ రూపకల్పన చేస్తామన్నారు.

## సైబర్ నేరగాళ్లపై హైదరాబాద్ పోలీసుల ప్రత్యేక ఆపరేషన్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్,ఆగస్టు7:** సైబర్ నేరగాళ్లపై హైదరాబాద్ పోలీసులు ప్రత్యేక ఆపరేషన్ చేపట్టారు. 15 రాష్ట్రాల్లో దాడులు చేపట్టి 49 మంది నిందితులను అరెస్ట్ చేశారు. వారి నుంచి రికవరీ చేసిన రూ.98.89 లక్షలు బాధితులకు పోలీసులు రీఫండ్ చేశారు. జులైలో హైదరాబాద్ పోలీసులు 70 సైబర్ క్రైమ్ ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశారు.



# అక్రమ మైనింగ్ చేసేవారిని వదిలిపెట్టి అమాయక కాంట్రాక్టర్లపై దౌర్జన్యమా?

## మంత్రి వివేక్ వెంకటస్వామితో కలిసి మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి సమీక్ష

**హైదారబాద్,ఆగస్టు 7,ప్రభాతవార్త:** అక్రమ మైనింగ్ చేసేవారిని వదిలిపెట్టి అమాయక చిన్న కాంట్రాక్టర్లపై దౌర్జన్యంగా వ్యవహరించడమా?! రాష్ట్ర ప్రభుత్వం నిర్ధేశించిన నిర్మాణాలు చేపడుతున్నా కాంట్రాక్టర్లను ఇలా వేధించడం సరైనది కాదని ఆర్ అండ్ బి మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఆగ్రహం వ్యక్తంచేశారు. శుక్రవారం బిఆర్ అంబెద్కర్ సచివాలయలంలో మైనింగ్ సమస్యలపై రోడ్లు భవనాలు శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి, మైనింగ్ శాఖ మంత్రి వివేక్ వెంకట స్వామి, ఎమ్మెల్సీ దామోదర్ రెడ్డి, ఎమ్మెల్యే మేఘా రెడ్డి, తెలంగాణ మైనింగ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎండి అనుదీప్ దురిశెట్టి, ఆర్ అండ్ బి హ్యామ్ రోడ్ల సిఇ బి.వి రావు, మైనింగ్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ ప్రతినిధులు సమావేశమైనారు. ఈ సమావేశంలో కాంట్రాక్టర్స్ ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చ జరిగింది. తాము ఎదుర్కొంటున్న సమస్యలు మంత్రుల దృష్టికి తీసుకువచ్చిన కాంట్రాక్టర్స్ అసోసియేషన్ తీసుకొచ్చింది. కోమటిరెడ్డి వెంకటరెడ్డి మాట్లా డుతూ రోడ్డు వర్క్ చేసే చిన్న కాం ట్రాక్టర్స్‌కు మైనింగ్స్ వారు 10రెట్ల పెనాల్టీలు వేయడం సరైంది కాదని అభిప్రాయపడ్డారు. కాంట్రాక్టర్ శ్రీనివాస్ రెడ్డి ఆత్మహత్యకు కారణమైన అధికారిపై చర్యలు తీసుకోవాలని మైనింగ్ శాఖ మంత్రి వివేక్ నుమంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి కోరారు. అక్రమ మైనింగ్ చేసేవారిపై కఠిన చర్యలు తీసుకోవాల్సిన అధికారులుప్రభుత్వ అభివృద్ధి పనులు చేస్తున్న చిన్న కాంట్రాక్టర్లపై దౌర్జన్యంగా వ్యవహరించడం సరికాదన్నారు. కాంట్రాక్టర్లు అగ్రిమెంట్ ప్రకారం ప్రభుత్వ పనులు నిర్వహిస్తున్నారని, నిర్మాణ పనులకు అవసరమైన మెటీరియల్ విషయంలో వారిని అనవసరంగా ఇబ్బందులకు గురిచేయ కూడదని మంత్రి సూచించారు.

# సంక్షేమ పథకాల ప్రయోజనాలు ప్రతి లబ్ధిదారుడికి అందాలి

• జాతీయ ఎస్సీ కమిషన్ చైర్మన్ కిషోర్ మక్వానా

**తిరుపతి, ఆగస్టు 7 ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుపతి జిల్లాలో షెడ్యూల్డ్ కులాల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ఇతరత్రా సౌకర్యాలను సమర్ధవంతంగా అమలు చేయాలని జాతీయ ఎస్సీ కమిషన్ చైర్మన్ కిషోర్ మక్వానా స్పష్టం చేశారు. సామాజిక, ఆర్థిక అభివృద్ధి, విద్య, ఉపాధి, వసతి సౌకర్యాలు, హక్కుల పరిరక్షణకు ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాలను లబ్ధిదారులకు చేరేలా చూడాలన్నారు. శుక్రవారం మధ్యాహ్నం తిరుపతి లోని పద్మావతి అతిథి గృహంలో భారత జాతీయ షెడ్యూల్డ్ కులాల కమిషన్ చైర్మన్ కిషోర్ మక్వానా, తిరుపతి ఎంపి డాక్టర్ మద్దిల గురుమూర్తి, జాతీయ ఎస్సీ కమిషన్ కార్యదర్శి శ్రీనివాస్, డైరెక్టర్ సునీల్ కుమార్ బాబు, రీసర్చ్ అధికారి వరప్రసాద్, జిల్లా కలెక్టర్ డాక్టర్ సలిజామల వెంకటేశ్వర్, జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడుతో కలసి జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషన్ చైర్మన్ కిషోర్ మక్వానా మాట్లాడుతూ జిల్లాలో షెడ్యూల్డ్ కులాల సంక్షేమం రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను,



హక్కుల పరిరక్షణకు ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాలను సమర్ధవంతంగా అమలు చేయాలన్నారు. అర్హులైన ప్రతి ఎస్సీ కుటుంబానికి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల ప్రయోజనాలు సకాలంలో చేరేలా క్షేత్రస్థాయిలో అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. లబ్ధిదారుల ఎంపికలో పారదర్శకత పాటిస్తూ, అర్హత ఉన్న ఏ ఒక్కరూ ప్రభుత్వ ప్రయోజనాలకు దూరం కాకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. జిల్లాలో ఖాళీగా ఉన్న ఎస్.సి. బ్యాక్ లాగ్ పోస్టులను భర్తీ చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు.

అలాగే షెడ్యూల్డ్ కులాల కుటుంబాల ఆర్థిక స్థితిగతులను మెరుగుపరిచేందుకు ప్రభుత్వం అమలు చేస్తున్న స్వయం ఉపాధి, జీవనోపాధి, నైపుణ్యాభివృద్ధి, ఆర్థిక సహాయం తదితర కార్యక్రమాల అమలుపై సమీక్షించారు. ఎస్సీలపై జరుగుతున్న దాడులు, వివక్ష, అట్రాసిటీ కేసుల నమోదు, దర్యాప్తు, బాధితులకు పరిహారం, న్యాయ సహాయం తదితర అంశాలపై సమీక్షిస్తూ బాధితులకు చట్టపరమైన రక్షణ కల్పించడంతో పాటు, ప్రభుత్వం ద్వారా అందాల్సిన పరిహారం, ఇతర సహాయాలను సకాలంలో అందేలా సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని జాతీయ ఎస్సీ కమిషన్ చైర్మన్ కిషోర్ మక్వానా సూచించారు.

జిల్లా కలెక్టర్ డాక్టర్ సలిజామల వెంకటేశ్వర్ మాట్లాడుతూ జిల్లాలోని ఎస్సీ వర్గాల ప్రజలకు ప్రభుత్వ పథకాలపై పూర్తి అవగాహన కల్పించి, అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ సమావేశంలో సాంఘిక సంక్షేమ శాఖ అధికారులు, రెవెన్యూ, పోలీసు, విద్య, సంక్షేమం, జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



## టిడిపి నేతలపై దాడి.. వైసిపి నేతలపై కేసు

**తిరుపతి, ఆగస్టు 7 ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుపతి నియోజకవర్గ ఇన్‌ఛార్జి జెబి శ్రీనివాస్ ఇంటిపై దాడికి పాల్పడిన వైసిపి అనుచరులపై తిరుపతి రూరల్ పోలీసులు హత్యాయత్నం కేసు నమోదు చేశారు. వైసిపి అనుచరులు వాసు యాదవ్, సంజీవ్ సునీల్ కుమార్, సుకుమార్, ప్రేమ కుమార్, కృష్ణమూర్తితో మరికొందరు కత్తులు, రాడ్లు, పెట్రోల్‌తో గురువారం వెళ్ళి దాడిచేసే ప్రయత్నం చేశారని, ఈ ఘటనలో అక్కడే ఉన్న శేఖర్, ప్రభు, లోకేష్ గాయపడ్డారని ఫిర్యాదు అందింది. ఈ ఫిర్యాదు మేరకు జెబి శ్రీనివాస్‌పై, అనుచరులపై హత్యా యత్నానికి పాల్పడ్డారని రాఘవేంద్ర ఇచ్చిన ఫిర్యాదుతో హత్యాయత్నం కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు.

## తిరుపతిలో ఐటియాక్ట్ కేసు

**తిరుపతి(క్రైమ్), ఆగస్టు 7 ప్రభాతవార్త:** కోట్లలో డబ్బులు ఇవ్వకుంటే కుటుంబాన్ని హతమారుస్తామని బెదిరించిన ఘటనపై బాధితుడు ఇచ్చిన ఫిర్యాదుతో తిరుపతి తూర్పు పోలీస్‌స్టేషన్‌లో పోలీసులు ఐటి యాక్టు కింద కేసు నమోదు చేశారు. తిరుపతి నగరంలోని పోస్టల్ కాలనీలో వంశీ నివాసముంటున్నాడు. ఇతనికి తమిళనాడు విజయ్ హాస్పిటల్‌లో సైంటిస్ట్‌గా విధులు నిర్వహిస్తున్న ఏఆర్ వంశీ, హైదరాబాద్ వనస్థలిపురంకు చెందిన నమ్రత న్యూ ఇండియా ఇన్సూరెన్స్ కంపెనీలో డిప్యూటీ మేనేజర్‌గా పనిచేస్తున్నట్లు బుంబుల్ డేటింగ్ యాప్ ద్వారా పరిచయమయ్యారు. ఇరువురి పరిచయం ప్రేమగా మారి పెద్దల అంగీకారంతో హైదరాబాద్ వనస్థలిపురంలో నిశ్చితార్థం జరుపుకున్నారు. నమ్రత వంశీల మధ్య నగదు, ఆస్తి విషయాలలో గొడవలు రావడంతో ఆపై నిశ్చితార్థం రద్దు చేసుకున్నారు. ఆమె ఈ విషయంపై వనస్థలిపురం పోలీస్ స్టేషన్ ఫిర్యాదు చేయడంతో గత ఏడాది వంశీపై కేసు నమోదైంది. పోలీసుల నుండి నోటీసులు అందుకున్న వంశీ తిరుపతి పోస్టల్ కాలనీలో ఉంటున్న ఫ్రెండ్స్‌తో కలిసి నివాసముంటున్నాడు. ఈ పరిచయంతో రూ.3 కోట్లు ఇవ్వాలంటూ వంశీని నమ్రత బెదిరించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నాడు. డబ్బు ఇవ్వకపోతే నిన్ను నీ కుటుంబాన్ని చంపేస్తానంటూ బెదిరింపు మెయిల్స్ చేయడంతో భయంతో బాధితుడు పోలీసులను ఆశ్రయించాడు. ఈస్ట్ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు కేసు నమోదు చేశారు.

## రైతుల సేవలో ఎస్‌పిడిసిఎల్

### మొబైల్ యాప్ ద్వారా విద్యుత్ సర్వీసు దరఖాస్తు సీనియారిటీ



**తిరుపతి, ఆగస్టు 7 ప్రభాతవార్త ప్రతినిధి:** ఎస్‌పిడిసిఎల్ పరిధిలో వ్యవసాయ విద్యుత్ వినియోగదారులకు మెరుగైన, సత్వర సేవలు అందించేందుకు కృషి చేస్తున్నామని ఆ సంస్థ సిఎండి శివశంకర్ లోతేటి శుక్రవారం తెలిపారు. గతంలో రైతులు వ్యవసాయ విద్యుత్ సర్వీసుకు దరఖాస్తు చేసి, మెటీరియల్, పనుల నిర్వహణ కోసం నగదును చెల్లించినప్పటి నుండి విద్యుత్ శాఖ కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితి ఉండేదన్నారు. ప్రస్తుతం వ్యవసాయ విద్యుత్ సర్వీసుల మంజూరు ప్రక్రియలో జాప్యాన్ని అరికట్టడంతోపాటు నిబంధనల ఉల్లంఘనకు అవకాశం లేకుండా చర్యలు చేపడుతున్నా మన్నారు. వ్యవసాయ విద్యుత్ సర్వీసుల మంజూరులో పారదర్శకతను పెంపొందించడంతోపాటు రైతులకు సకాలంలో సర్వీసులను మంజూరు చేయాలనే ఉద్దేశంతో ఈ అంశంలో సంస్కరణలను చేపడుతున్నా మన్నారు. ఎస్‌పిడిసిఎల్ మొబైల్ యాప్ ద్వారా రైతులు వ్యవసాయ విద్యుత్ సర్వీసు దరఖాస్తు సీనియారిటీని తెలుసుకునే సదుపాయాన్ని కల్పించామని తెలిపారు. తద్వారా రైతులు విద్యుత్ శాఖ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా ఎప్పుడైనా, ఎక్కడినుంచైనా దరఖాస్తు నంబరును మొబైల్ యాప్లో నమోదు చేయడం ద్వారా స్థితిని తెలుసు కోవచ్చని సిఎండి శివశంకర్ వివరించారు.

**వ్యవసాయ విద్యుత్ సర్వీసు దరఖాస్తు ఇలా:**

మొదటగా ఎస్‌పిడిసిఎల్ మొబైల్ యాప్‌ను స్మార్ట్ ఫోన్‌లో డౌన్‌లోడ్ చేసుకోవాలి. యాప్ లాగిన్ కావాలి. న్యూ కనెక్షన్స్‌పై క్లిక్ చేయాలి. ఆ తరువాత ఎల్‌టి అప్లికేషన్ స్టేటస్‌ను క్లిక్ చేయాల్సి ఉంటుంది. అప్లికేషన్ నంబర్‌ను నమోదు చేయాలి. తద్వారా అప్లికేషన్ ప్రస్తుత స్థితిని తెలుసుకోవచ్చని, స్మార్ట్ ఫోన్ అందుబాటులో లేని రైతులు విద్యుత్ శాఖ కార్యాలయాల వద్ద అందుబాటులో ఉంచిన సీనియారిటీ జాబితాను పరిశీలించి తమ దరఖాస్తు స్థితిని తెలుసుకోవచ్చని సిఎండి వివరించారు.

## కూటమి ప్రభుత్వంలో ప్రజలకు పారదర్శక పాలన

**తిరుపతి, ఆగస్టు 7 ప్రభాతవార్త ప్రతినిధి:** కూటమి ప్రభుత్వం రెండేళ్ళ పాలనలో పారదర్శకతతో ముందుకు సాగుతుందని తిరుపతి నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి జెబి శ్రీనివాస్ అన్నారు. తిరుపతి పార్లమెంట్ కార్యాలయంలో శుక్రవారం ప్రజాదర్బార్ నిర్వహించారు. తిరుపతి పార్లమెంట్ అధ్యక్షురాలు పనబాక లక్ష్మి, యాదవ కార్పొరేషన్ ఛైర్మన్ నరసింహ యాదవ్‌తో కలిసి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. వచ్చిన అర్జీలను సంబంధిత శాఖల వారీగా విభజించి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నారు. గతంలో అధికారులు చుట్టూ తిరిగిన ప్రజల సమస్యలు పరిష్కారం అయ్యేవి కాదని, వాలంటీర్లు పేరుతో ప్రజలకు పరిపాలన అధికారులకు, నాయకులకు అడ్డుగోడ కట్టారన్నారు. వారి ఇష్టానుసారం లంచాలు పొంది పనులు చేయకుండా ఇబ్బంది పెట్టేవారు. కూటమి ప్రభుత్వం వచ్చాక 'ప్రజలే నా కుటుంబం' అనే చంద్రబాబు సిద్ధాంతంతో ప్రజా దర్బార్ నిర్వహిస్తున్నామని జెబి తెలిపారు.

తిరుపతి నగరంలో ప్రజలు రోడ్డు సమస్య లు, విద్యుత్ స్తంభాలు మార్చుట, తిరుమలకు సంబంధించి, టిడ్కో ఇళ్లకు కట్టి ఇల్లు లేకుండా ఉన్న లబ్ధిదారుల డబ్బు తిరిగి ఇప్పించాలని పలు సమస్యలు వచ్చాయి. వాటన్నింటినీ అధికారులకు అప్పగించి త్వరితగతిన పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో తాతయ్యగుంట ఆలయ చైర్మన్ మహేష్ యాదవ్, నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ రుద్రకోటి సదాశివం, కాపు కార్పొరేషన్ డైరెక్టర్ తోట వాసుదేవ, రాష్ట్ర రజక కార్పొరేషన్ డైరెక్టర్ కరాటే చంద్ర, రాష్ట్ర కార్యదర్శి అన్నా అనిత, కుమారమ్మ, క్లస్టర్ ఇన్‌చార్జ్ శ్రీధర్ వర్మ, దంపూరి భాస్కర్ యాదవ్, నాయకులు యశ్వంత్ రెడ్డి, మన్నెం శ్రీనివాసులు, బివి సంజయ్, ఆముదాల తులసీ, కంకణాల రజనీకాంత్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.





## డిఎస్సీ అక్రమాలపై సిబిఐ విచారణ జరిపించాలి

**తిరుపతి, ఆగస్టు 7 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం నిర్వహించిన డిఎస్సీలో జరిగిన అక్రమాలపై సిబిఐతో నిష్పాక్షిక విచారణ చేయాలని, యువతకిచ్చిన హామీలు అమలుచేయాలని మాజీ మంత్రి, వైసిపి రీజనల్ కో ఆర్డినేటర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి డిమాండ్ చేశారు. నిరుద్యోగ భృతి బకాయిలు వెంటనే చెల్లించాలని, ప్రతి నిరుద్యోగికి నెలకు 3వేలు రూపాయలు ఇస్తామని హామీ ఇచ్చి ఇప్పటివరకు ఒక్కొక్కరికి సుమారు రూ.90 వేలు బకాయి పడిందని అన్నారు. ఈ మొత్తాన్ని వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. సూపర్ సిక్స్ పేరుతో ప్రజలను మోసం చేశారని ఆయన ఘాటుగా వ్యాఖ్యానించారు. డిఎస్సీ అక్రమాలపై నిగ్గుతేల్చాలని వైసిపి అధిష్టానం పిలుపుతో తిరుపతిలో చేపట్టిన రిలే నిరాహారదీక్షల్లో శుక్రవారం రెండవరోజు మాజీమంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పాల్గొని సంఘీభావం తెలిపారు. ఎన్నికల సమయంలో యువతను మభ్యపెట్టి ఇచ్చిన హామీలు తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. డిఎస్సీ 2025 పై తక్షణమే సిబిఐతో విచారణ చేపట్టాలని ఆయన కోరారు. ఉమ్మడి చిత్తూరుజిల్లా వైసిపి అధ్యక్షుడు భూమన కరుణాకర్‌రెడ్డి మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నమ్మి రాష్ట్ర ప్రజలు, ముఖ్యంగా యువత తీవ్రంగా మోసపోయారని అన్నారు. వెంటనే సిబిఐతో విచారణ చేయాలన్నారు. వైసిపి తిరుపతి నియోజకవర్గ సమన్వయకర్త భూమన అభినయ్‌రెడ్డికి మాజీ విద్యాశాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ పాల్గొని మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే, రాష్ట్ర ఎస్సీ సెల్ అధ్యక్షుడు సుధాకర్ బాబు, మాజీ ఎమ్మెల్సీ శ్రీనివాసులు రెడ్డి సంఘీభావం తెలియజేశారు. ఈ దీక్షలో మాజీ మేయర్ డాక్టర్ శిరీష, నగర అధ్యక్షుడు మల్లం రవిచంద్ర రెడ్డి, పార్టీ నాయకులు ఉదయ్‌వంశీ, ఆరే అజయ్, కేతం జయచంద్రారెడ్డి, పసుపులేటి సురేశ్, ప్రవీణ్, ఇమామ్, రాకేశ్. కార్యకర్తలు, యువత, విద్యార్థులు పాల్గొన్నారు.

## తిరుమల సమాచారం



### ఎస్వీ అన్నప్రసాదం ట్రస్ట్‌కు రూ.10.10 లక్షలు

**తిరుమల, ఆగస్టు 7 ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుమలలో భక్తులకు ఆకలి తెలియకుండా రుచిగా శుచిగా అన్నప్రసాదాలు అందిస్తున్న అన్నప్రసాదం ట్రస్ట్‌కు దాతలు విరాళాలు ఇస్తున్నారు. శుక్రవారం హైదరాబాద్‌కు చెందిన డాక్టర్ ఎస్‌విఎన్ విజయేంద్ర అన్నదానం ట్రస్ట్‌కు రూ.10.10 లక్షలు విరాళాన్ని అందజేశారు. ఈ మొత్తాన్ని డిడి రూపంలో తిరుపతిలో పంజాబ్ నేషనల్ బ్యాంక్ అసిస్టెంట్ మేనేజర్ భానుకు అందజేశారు. విజయేంద్ర మైసూర్‌లో సిఎస్ఐఆర్‌లో సీనియర్ సైంటిస్ట్‌గా పనిచేస్తున్నారు. ఆయన తన పదవీవిరమణ తర్వాత తిరుమలలో ల్యాబ్‌లో గానీ శ్రీవారి సేవలో ఉచితంగా సేవలు అందిస్తానని ఆశాభావం వ్యక్తం చేశారు.

### కపిలేశ్వరస్వామి ఆలయంలో వైభవంగా ఆడికృత్తిక మహోత్సవం



**తిరుమల, ఆగస్టు 7 ప్రభాతవార్త ప్రతినిధి:** టిటిడి ఆధ్వర్యంలోని ప్రసిద్ధ శైవాలయం తిరుపతిలోని కపిలేశ్వరస్వామి ఆలయంలో ఆడికృత్తిక పర్వదినం సందర్భంగా శుక్రవారం వేడుకలు జరిపించారు. ఆలయం లోపల అత్యంత వైభవంగా భక్తిశ్రద్ధల మధ్య అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం నుండి రాత్రి వరకు ఆలయం భక్తజన సందోహంతో ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. ఉదయం వళ్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామివారి ఉత్సవమూర్తులకు స్నపన తిరుమంజనం నిర్వహించారు. పాలు, పెరుగు, తేనె, చందనం తదితర సుగంధ ద్రవ్యాలతో శాస్త్రోక్తంగా విశేష అభిషేకం చేశారు. అనంతరం మధ్యాహ్నం మూలమూర్తులకు అభిషేకం నిర్వహించారు. సాయంత్రం వళ్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి తిరువీధుల్లో విహరిస్తూ భక్తులకు అనుగ్రహించారు. ఈ తిరువీధి ఉత్సవాన్ని తిలకించేందుకు అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారికి కర్పూర హారతులిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఇఒ నాగరత్న, సూపరింటెండెంట్ చంద్రశేఖర్, ఆలయ అర్చకులు, అధికారులు, సిబ్బంది, భక్తులు పాల్గొని స్వామివారి కృపాకటాక్షాలను పొందారు.

## పట్టీ వ్యవస్థ ద్వారా భక్తులకు అన్నప్రసాదాలు!

• తిరుమలలో ప్రయోగాత్మకంగా పరిశీలన





**తిరుమల, ఆగస్టు 7 ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనార్థం విచ్చేస్తున్న భక్తుల సంఖ్య సాధారణ రోజుల్లోనూ అనూహ్యంగా రెట్టింప వడంతో ఆలయం వెలుపల వ్యాపించిన క్యూలైన్లలో భక్తులకు సులభంగా అన్నప్రసాదాలు అందించేందుకు పట్టీవ్యవస్థ (ఫుడ్ సర్వింగ్ కన్వేయర్ వ్యవస్థ)ను అందుబాటులోకి తీసుకువస్తున్నారు. దీనివల్ల భక్తులకు మరింత సులభంగా అన్నప్రసాదాలు అందుకునేందుకు మార్గం సుగమమవుతుందని టిటిడి అధికారులు అంచనా వేస్తున్నారు. ఇప్పటికే తిరుమలలో వేలాది మంది శ్రీవారి సేవకులు రోజువారీగా భక్తుల సేవకు అంకితభావంతో సేవలందిస్తున్న విషయం విదితమే. ప్రతిరోజూ లక్షమందికిపైగా భక్తులు దేశం నలుమూలల నుండి ఇష్టదైవమ్ దర్శనం కోసం తరలివస్తున్నారు. వీరిలో తమిళనాడు, కర్నాటక, తెలుగు రాష్ట్రాలతో బాటు మహారాష్ట్ర భక్తులు కూడా ఉండటం విశేషం. ఇలా వస్తున్న భక్తులు 20వేల మంది దాటితే వైకుంఠమ్ 2 క్యూకాంప్లెక్స్ కంపార్టుమెంట్లు 32 నిండిపోయి ఆలయం వెలుపల ఎంబిసి, ఎటిసి, నారాయణగిరి ఉద్యానవనాల్లోని షెడ్లు నుండి శిలాతోరణం వరకు క్యూలైన్లు వ్యాపిస్తున్నాయి. సుమారు మరో 40వేల మంది వరకు భక్తులు వెలుపల క్యూలైన్లలోనే గంటల తరబడి నిలబడి నిరీక్షించాల్సిన పరిస్థితులు కనిపిస్తుంటాయి. ఈ సమయంలో భక్తులకి నిరంతరాయంగా అన్నప్రసాదాలు, అల్పాహారం, తాగునీరు, పాలు, మజ్జిగ, కాఫీ వంటి ఆహార పదార్థాలు శ్రీవారి సేవకులతో అందించడం కొంత కష్టంగా మారింది. ఒక ప్రాంతంలో క్యూలైన్లలో భక్తులకు అన్నప్రసాదాలు అందిస్తే మరోచోట గంటల తరబడి ఆలస్యమవుతోందనే ఫిర్యాదులు భక్తుల నుండి వ్యక్తమవుతున్నాయి. ఇందుకోసం టిటిడి ఇప్పుడు వినూత్న ఆలోచనకు శ్రీకారం చుట్టింది. తిరుమలలో రోజువారీగా 1.60లక్షల మంది వరకు భక్తులు తరిగొండ వెంగమాంబ అన్నప్రసాదం భవనం, పిఎసి 4, పిఎసి 5, ఫుడ్‌కేంద్రాలలో అన్నప్రసాదాలు స్వీకరిస్తున్నట్లు టిటిడి గణాంకాలు. మరీ ప్రత్యేక పర్వదినాల్లో, విశేషమైన రోజుల్లో వారాంతం రోజుల్లో రద్దీపెరిగితే 2లక్షల మంది నుండి 2.30లక్షల మంది వరకు భక్తులకు అన్నప్రసాదాలు అందిస్తున్నారు. కొన్ని సందర్భాల్లో వీటిని అందించడం కూడా ఆలస్యమై భక్తుల్లో అసహనం అసంతృప్తి వ్యక్తమవుతోంది.

**పట్టీ వ్యవస్థ ద్వారా సులభంగా పంపిణీ:** తిరుమలలో ప్రస్తుతం ఆలయం వెలుపల క్యూలైన్లు విస్తరించిన సమయంలో 40వేల మంది వరకు భక్తులకు శ్రీవారి సేవకులతోనే సేవలందిసున్నారు. దీనివల్ల శ్రీవారి సేవకులు కూడా కిలోమీటర్ల మేర నడిచి సేవలు అందించాల్సిన పరిస్థితి ఉంది. దీనివల్ల క్యూలైన్లలో భక్తులు గంటల తరబడి వేచి ఉన్నపుడు వారికి శ్రీవారి సేవకులు ఎప్పటికప్పుడు అన్నప్రసాదాలను చేర వేస్తున్నా, రద్దీ ఎక్కువగా ఉన్న సమయంలో క్యూ లైన్లలో ఉన్న భక్తులకు వేగంగా ప్రసాదాలు అందించటం కష్టమవుతోంది. దీంతో టిటిడి సరికొత్త సాంకేతికతకు శ్రీకారం చుట్టింది. క్యూలైన్లలో గంటల తరబడి వేచి ఉండే భక్తులకు అన్నపానీయాలు అందించేందుకు ఫుడ్ సర్వింగ్ కన్వేయర్ వ్యవస్థను (పట్టీ వ్యవస్థ) ప్రయోగాత్మకంగా అందుబాటులోకి తీసుకు వచ్చింది. రద్దీ రోజుల్లో దాదాపు నాలుగు కిలో మీటర్ల మేర భక్తుల క్యూ లైన్లు విస్తరించినపుడు వారికి సేవకులు పాలు, మజ్జిగ, తాగునీరుతో బాటు ఉప్మా, పులిహోర, సాంబారన్నం, టమోటా రైస్ వంటి ఆహార పదార్థాలను యాభై అరవై వేల వరకు భక్తులకు అందజేస్తున్నారు. నూతనంగా ఏర్పాటైన ఫుడ్ సర్వీసింగ్ కన్వేయర్ వ్యవస్థ ద్వారా అన్నప్రసాద వితరణ మరింత సలభంగా మారనుంది. దాతల సహకారంతో ఈ మూవింగ్ డైనింగ్ (కదిలే) వ్యవస్థను శిలాతోరణం సమీపంలోని 45వ గేటు వద్ద క్యూలైన్లో అందుబాటులోకి తీసుకొచ్చారు. ఈ ఫుడ్ సర్వింగ్ కన్వేయర్ పనితీరును టిటిడి అధికారులు ప్రయోగాత్మకంగా పరిశీలించారు. శ్రీవారి సేవకులు ఈ కన్వేయర్ యంత్ర సహాయంతో భక్తులకు మరింత సులువుగా ప్రసాదాలను పంపిణీ చేస్తుండటంతో ఈ పట్టీవ్యవస్థ విధానం మరిన్ని ప్రాంతాల్లోనూ అమలు చేయాలని నిర్ణయించారు. ఇది నిరంతరాయంగా గుండ్రంగా కదులుతూనే ఉంటుంది.

ఈ విధానం వల్ల అటు భక్తులకు, ఇటు అన్నప్రసాదాలు పంపిణీ చేసే సేవకులకు ఎంతో సమయం కూడా ఆదా అవుతుంది. పంపిణీ సమయంలో ఎలాంటి తోపులాటలకు అవకాశం లేదు. వెలుపల క్యూలైన్లలోని మిగిలిన కీలక ప్రాంతాల్లో కూడా రానున్న రోజుల్లో మరిన్ని ఫుడ్ సర్వింగ్ కన్వేయర్లను అందుబాటులోకి తీసుకువచ్చేందుకు టిటిడి అధికారులు కార్యాచరణ సిద్ధం చేస్తున్నారు.

## అంగరంగ వైభవంగా కార్తీకేయుని రథోత్సవం

**శ్రీకాళహస్తి, ఆగస్టు 7 ప్రభాతవార్త:** శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా వెలసిన కుమారస్వామితిప్ప ఆలయంలోని చెంగల్వరాయస్వామి ఆలయంలో జరుగుతున్న మహోత్సవాలు, బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం 'రథోత్సవం'ను అంగరంగ వైభవంగా నిర్వహించారు. అలంకార మండపంలో అలంకార గురుకుల్ రాజేష్, సూరిలు చక్కగా ముస్తాబు చేసారు. బోయిలు మోసుకుంటూ శివయ్య గోపురం, రాజగోపురం గుండా వాహనాల మండపం వద్దకు చేర్చారు. అక్కడ రథంలో ప్రతిష్టించారు.



శ్రీకాళహస్తిలో రథోత్సవం

ధర్మకర్తల మండలి చైర్మన్ కొట్టె సాయిప్రసాద్, ఇఒ బికె వెంకటేశులు, ధర్మకర్తల మండలి సభ్యుడు వాకచర్ల గుర్రప్పశెట్టి, కుమారస్వామి ఆలయ మండలి చైర్మన్ నెమళ్ళూరు బుజ్జి, సభ్యులు సుమతి, సతీష్, శ్రీలక్ష్మిలు హారతులిచ్చి గ్రామోత్సవానికి శ్రీకారం చుట్టారు. తేరువీధి, నెహ్రూవీధి, సినిమా వీధి, బాబూ అగ్రహారం, నగరి వీధి, బజారువీధుల్లో ఊరేగింపు జరిపారు. ఉత్సవంతో పాటు ఆర్చకులు షణ్ముగం పాల్గొన్నారు.



## తలుపులమ్మ సేవలో మంత్రి అనిత

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి, ఆగస్టు 7 ప్రభాతవార్త:** కాకినాడ జిల్లా తుని మండలం లోవలో వేంచేసి ఉన్న శ్రీ తలుపులమ్మ అమ్మవారిని రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత శుక్రవారం దర్శించుకున్నారు. అమ్మవారికి చీర, సారె సమర్పించి మొక్కులు తీర్చుకునేందుకు వచ్చిన హోం మంత్రి అనితకు దేవస్థాన ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ పెంటకోట భాస్కర్ సత్యనారాయణ, దేవస్థాన కార్యనిర్వాహణాధికారి విశ్వనాథరాజు ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు. శ్రీ తలుపులమ్మ అమ్మవారిని దర్శించుకున్న అనంతరం ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సామూహిక కుంకుమ పూజలలో మంత్రి పాల్గొని అమ్మవారికి పూజలు చేశారు. అనంతరం చైర్మన్ భాస్కర్ సత్యనారాయణ, ఇఒ విశ్వనాథరాజు హోం మంత్రి అనితను అమ్మవారి శేషవస్త్రంతో సత్కరించగా, దేవస్థానం వేదపండితులు వేద ఆశీర్వచనం అందించారు. ఈ సందర్భంగా హోంమంత్రి అనిత మాట్లాడుతూ ఆషాడమాస ఉత్సవాలలో శ్రీ తలుపులమ్మ అమ్మని దర్శించుకోవడం ఆధ్యాత్మిక ఆనందాన్ని కలిగించిందన్నారు. ప్రజలంతా సుఖసంతోషాలతో వుండాలని అమ్మవారిని కోరుకున్నారు.

## కళలను ఆదరిస్తూ భావితరాలకు అందించాలి

**తిరుపతి, ఆగస్టు 7 ప్రభాతవార్త ప్రతినిధి:** అంతరించిపోతున్న కళారూపాలను ఆదరించి వాటిని భావితరాలకు అందించాలన్న సంకల్పంతో తిరుమల తిరుపతి దేవస్థానం, హిందూ ధర్మ ప్రచార పరిషత్ సంయుక్త సౌజన్యంతో ప్రతి ఏడాది జాతీయస్థాయి నాటకోత్సవాలను నిర్వహించడం అభినందనీయ మని రాయలసీమ రంగస్థలం ఛైర్మన్ గుండాల గోపీనాథరెడ్డి తెలిపారు. తిరుపతిలో శ్రీవెంకటేశ్వర నాట్య కళాపరిషత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 72వ వార్షిక జాతీయ నాటకోత్సవాలులో శుక్రవారం సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి. తెనాలి స్వరాజ్యలక్ష్మి సేవా సమితి బృందం ప్రదర్శించిన 'లీలాకుశుడ్ను పద్య నాటకం ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది. కళాకారుల అద్భుత నటన, పద్య పఠనం, సంగీతం, రంగస్థల ప్రదర్శనకు ప్రేక్షకుల నుంచి మంచి స్పందన లభించింది. రాయలసీమ రంగస్థలం చైర్మన్ గుండాల గోపీనాథ్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. నాటకాన్ని వీక్షించిన అనంతరం నాటక బృందంలోని కళాకారులను అభినందిస్తూ ప్రశంసా పత్రం, షీల్డ్ అందజేశారు. అనంతరం వెంకటేశ్వర నాట్య కళాపరిషత్ నిర్వాహకులు గుండాల గోపీనాథ్‌రెడ్డిని ఘనంగా సత్కరించారు. నాట్య కళాపరిషత్ కార్యదర్శి కొత్తపల్లి మునిరత్నం, సంయుక్త కార్యదర్శి కొలత్తూర్ భాస్కర్ రెడ్డి, మర్థం గజేంద్ర, కళాకారులు పామూరు సుబ్రహ్మణ్యం, ఇరుముని శేఖర్, చంద్రబాబు నాయుడు, విద్వాన్ కస్పా పద్మనాభం, పొన్నాల జేజిరెడ్డి, లోక ప్రభాకర్ నాయుడు, తొండమనాటి సుబ్రహ్మణ్యంరెడ్డి, పోలే జనార్దన్‌రెడ్డి పాల్గొన్నారు.



ఫ్యాషన్ ఫ్యాషన్


# పరికిణీకి పూల ఓణీ



అప్పుడే కాలేజీలో అడుగుపెట్టన అమ్మాయైనా.. ఇద్దరు పిల్లల తల్లయినా.. మనవళ్లు, మనవరాళ్లని చూసుకుని మురిసిపోయే బామ్మయినా.. మనసు పారేసుకునే దుస్తులేవంటే లంగాఓణీ పేరు చెప్పాల్సిందే! దాని అందమే వేరు. అందుకే తరాలెన్ని మారినా ఫ్యాషన్ ప్రపంచంలో రారాణిలా వెలుగుతోందీ వస్త్ర శ్రేణి. అమ్మాయిలే లక్ష్మీదేవిలా నట్టింట తిరిగితే చక్కని అనందం. చటుక్కున కట్టేసుకోవాలన్నా.. బుట్టబొమ్మలా కనిపించాలన్నా లంగాఓణీ కాకుండా మరొకటి ఉంటుందా? అలాగని ఎప్పుడూ పట్టేనా? మరీ మెడ్రన్‌గా కనిపించినా బాగోదు. కాబట్టి కొత్తగా కోరుకునేవారు మనసు పారేసుకుంటోందీ ఈ పూల ఓణీలపైనే! పరికిణీ పట్టుదైనా, కాటన్, రేయాన్, నెట్ వంటి ఆధునిక రకానిదైనా వీటిని జతచేసి మరిసిపోతున్నారు మెత్తని సిల్క్ ఓణీ.. దానిపై ఆకర్షించే కలంకారీ, పిచ్‌వాయీ, మధుబనీ.. వంటి ఏళ్లనాటి కళలతోపాటు మోడరన్ ఆర్ట్‌నీ అద్దుకున్న పూలు.. చూడచక్కగా లేవూ? పూల సుకుమారం ఉన్న అమ్మాయిలు వాటినే చుట్టుకుని మరింత మెరవడం ఖాయమనిపించట్లేదు? సందర్భమేదైనా చక్కగా ఇమిడిపోవాలి అనుకునే అమ్మాయిలకు ఈ మినిమల్ ఫ్యాషన్ మరింత నప్పడం ఖాయం. పైగా సందర్భాన్ని బట్టి.. దీన్నే లెహెంగా స్టైల్‌లోనూ వేసుకోవచ్చు. □







రాచరిక పాలనలో పాలనా చాణిక్యం యుద్ధ నైపుణ్యం తెలిసిన వారికి వారసత్వం దొరకుతుంది. అందుకే రాజకుటుంబంలోని వారసులు తొలుత గురుకులాల్లో యుద్ధ విద్యనభ్యసించడం తెలిసిందే రాజులు మారినా రాజ్యాలు పోయినా మిగిలివున్న రాజకుటుంబాలు సైతం వంశ పారంపర్య విధానాలను ఇంకా కొన సాగిస్తూనే ఉన్నాయి.

# ఈ తెగువరి ఓ రాకుమారి



డెన్మార్క్ రాజ కుటుంబంలో ఒక సరికొత్త చారిత్రక అధ్యాయం మొదలైంది. ఆ దేశ రాజు ఫ్రెడెరిక్ ఎక్స్, రాణి మేరీల కుమార్తె, 19 ఏళ్ల ప్రిన్సెస్ ఇసాబెల్లా సైన్యంలో చేరారు. పూర్తిస్థాయి సైనిక సేవల్లోకి అడుగుపెట్టిన తొలి మహిళా రాజవంశీకు రాలిగా ఆమె చరిత్ర సృష్టించారు. డెన్మార్క్ ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన 11 నెలల తప్పనిసరి సైనిక శిక్షణలో భాగంగా ఆమె ఈ నిర్ణయం తీసుకున్నారు. హైస్కూల్ విద్య పూర్తికాగానే, స్లాగెల్సే లోని ఆంట్ వోర్స్కవ్ బ్యారెక్స్‌లో ఉన్న 'గార్డ్ హుస్సార్ రెజిమెంట్'లో ఆమె రిపోర్ట్ చేశారు. ఎలాంటి ప్రత్యేక హంగులు లేకుండా ఆమె సాధారణ సైనికురాలిగా విధుల్లో చేరడం విశేషం. అయితే శిక్షణ సమయంలో సాధారణ సైనికులకు ఇచ్చే జీతభత్యాలను తీసుకోకూడదని ప్రిన్సెస్ ఇసాబెల్లా నిర్ణయించుకున్నారు. తన తల్లిదండ్రుల ఆర్థిక అండతోనే ఉంటానని, ప్రభుత్వ వేతనం తనకు వద్దని స్పష్టం చేసిందామె! ఆమె సోద రుడు, యువరాజు క్రిస్టియన్ కూడా గతంలో ఇదే రెజిమెంట్‌లో శిక్షణ పూర్తి చేసుకు న్నారు. యూరప్, ఆర్కిటిక్ ప్రాంతాల్లో మారుతున్న భద్రతా పరిస్థితుల నేపథ్యంలో డెన్మార్క్ తన రక్షణ వ్యవస్థను పటిష్ఠం చేస్తోంది. ఇందులో భాగంగానే సైనిక సేవా కాలాన్ని 4 నెలల నుంచి 11 నెలలకు పెంచింది. అంతేకాకుండా, తొలిసారిగా మహిళలకు కూడా తప్పని సరి సైనిక సేవను వర్తింపజేసింది. ఈ కొత్త సంస్కరణల కింద శిక్షణ పొందుతున్న తొలి బ్యాచ్‌లోనే ప్రిన్సెస్ ఇసాబెల్లా చేరడం విశేషం. □

**చిట్కా:**

**చింతా జరానామ్ మనుష్యానమ్:** చింతించడం అనేది వృద్ధాప్యాన్ని వేగవంతం చేస్తుంది. కనుక అనవసరపు చింతలతో ఆరోగ్యాన్ని పాడుచేసుకోకండి.

**సతం విహాయ భోక్తవ్యం:** ఆహారం తీసు కొనే సమయం వచ్చినప్పుడు, ఎంతటి పనినైనా కూడా పక్కన పెట్టండి. నిదానంగా భోజనం చేయం డి. వేగంగా తినడం, పని ఉందని అసలు భోజనమే మానివేయడం చాలా అనర్థదాయకం. □

# వేంకటేశ్వరస్వామి పూజ

విష్ణు స్వరూపమైన వేంకటేశ్వరస్వామి కలియుగ దైవంగా భక్తుల పూజలు అందుకుంటున్నాడు. ఆ స్వామిని పూజించడం వలన కష్టాల నుంచి గట్టెక్కడం జరుగుతుంది. కష్టాలను తీర్చువాడే వేంకటేశ్వరుడు అని ఆధ్యాత్మిక గ్రంధాలు చెబుతున్నాయి. వేంకటేశ్వర స్వామి దర్శన మాత్రం చేతనే పాపాలు



పటాపంచలైపోతాయి .. దోషాలు తొలగిపోతాయి. అలాంటి ఆ స్వామిని ఆరాధించడం వలన లక్ష్మీదేవి ప్రీతి చెందుతుంది. వేంకటేశ్వరస్వామి హృదయ స్థానంలో లక్ష్మీదేవి కొలువై ఉంటుంది. కనుక వేంకటేశ్వరస్వామి దర్శనం చేసుకున్న ప్రతి వారికి లక్ష్మీదేవి దర్శన భాగ్యం కూడా లభిస్తుంది. ఆ తల్లి కరుణా కటాక్ష వీక్షణాలు కూడా భక్తులపై ప్రసరించబడ తాయి. ఇక తనని పూజించడం వలన సంతోషించే అమ్మవారు, స్వామివారిని పూజించేవారి పట్ల మరింత కరుణ చూపుతుందట. స్వామిని అంకితభావంతో సేవించేవారి ఇంట లేమి అనేది లేకుండా చూస్తుందట. అలాంటివారి దరిదాపులకు దారిద్రం .. దుఃఖం రాకుండా చేస్తుందనేది మహర్షుల మాట. అమ్మవారి ప్రాణనాథు డైన స్వామివారిని పూజించడం వలన, ఆ తల్లి అనుగ్రహం కూడా లభిస్తుంది.

# కొల్లార్డ్ గ్రీన్స్



నూతన సంవత్సర రోజున కొల్లార్డ్ గ్రీన్స్ తినడం వల్ల ఏడాది పొడవునా ఆర్థిక శ్రేయస్సు లభిస్తుందనే నమ్మకం ఉంది. అనేక దేశాల్లో కొల్లార్డ్ గ్రీన్స్ సంప్రదాయ ఆహార వంటకం. దక్షిణ యుఎస్‌లో ప్రజల ఆరోగ్యకరమైన ప్రధాన ఆహారాలలో ఇది ఒకటి. ముఖ్యంగా సెప్టెంబర్–ఫిబ్రవరి నెలలో మొక్క పిండి పదార్థాల్ని చక్కెరలుగా మార్చడం, కొన్ని ప్రోటీన్‌ల్ని పునరుద్ధరించడం ద్వారా చలికి ప్రతిస్పందించడం వల్ల ఆకులు రుచికరంగా ఉంటాయి. క్యాబేజీలో లాగా ఆకులు టైట్ హెడ్స్ కాకుండా లూజ్ లీఫ్‌గా ఉంటాయి. ఈ ఆకులు మందంగా, మృదువుగా, పెద్దగా 10–12 అంగుళాల పొడవుతో లేతరంగు సిరలతో విశాలమైన కాండాలతో ఉండి కొద్దిగా ముడతలు పడి ఆకులు 1.25 మీటర్ల ఎత్తులో వెడల్పుగా ఉండా కనిష్ట కాండం మీద రొసెట్టేగా ఏర్పడి చూడడానికి కాలే లాగా ఉంటుంది. కొల్లార్డ్ గ్రీన్స్ హెడ్ క్యాబేజిలాగా ఒక గుత్తిలా కాకుండా, వదులు గా ఆకులతో పెరుగు తాయి. వీటిని సలాడ్స్, స్లావ్‌లు, స్మూతీ లు, సూప్‌లు, ఆమ్లెట్‌లో, శాండ్‌విచ్‌లు చుట్టలలో చుట్టి తాజాగా తినడం సులభం. వీటిని సలాడ్స్, స్లావ్‌లు, స్మూతీలు, సూప్‌లు, ఆమ్లెట్‌లో శాండ్‌విచ్‌లు చుట్టలలో చుట్టి తాజగా తినడం సులభం. పచ్చి కొల్లార్డ్ ఆకుకూరలు ఘాటైన, ఉప్పగా ఉండే రుచిని కల్గి ఉంటాయి. వీటిని వండినప్పుడు లేదా ఆవిరి మీద ఉడికంచి నప్పుడు తేలికపాటి రుచిన కలిగి మట్టి రుచిని కల్గి ఉంటాయి.

**ఆరోగ్య ప్రయోజనాలు:** కొల్లార్డ్ ఆకుకూరలో కాల్షియం విటమిన్ 'కె' ఎక్కుగా ఉండడం వల్ల దంతాల ఎముకల ఆరోగ్యానికి ఉపయోగ పడుతుంది. దీని వల్ల కాల్షియం శోషణ జరిగి ఆస్టియోఫోరొసిస్ రాకుండా కీళ్ళ ఆరోగ్యానికి మంచి చేస్తుంది. ఈ ఆకుకూరలోని విటమిన్‌లు, ల్యూటిన్ జియాక్సంతిన్ అనే కెరోటినాయిడ్స్ రేచీకటి, కంటి శుక్లాలు డయాబెటిక్ రెటినోపతి, గ్లకొమా వంటి కంటి వ్యాధులు 57% తగ్గుతాయని ఒక అధ్యయనంలో తెలిసింది. ఈ క్రూసి ఫెరస్ ఆకుకూరల్ని తినడం వల్ల చెడు కొలెస్ట్రాల్ తగ్గడం వల్ల రక్త ప్రసరణ మెరుగై 16% గుండె జబ్బులు, స్ట్రోక్ వ్యాధుల్ని ఆరికట్టివచ్చు. ఇది గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. ఫైబర్ ఆరోగ్యకరమైన గట్ బాక్టీరియాని పెంచి జీర్ణకోశ ఆరోగ్యాన్ని పెంపొదించడం వల్ల హెలికో బాక్టీరియా వంటి జీర్ణకోశ ఇన్ఫెక్షన్స్‌ని ఆరికట్టవచ్చు. వీటిలోని అధిక ఐరన్ ఎర్రరక్త కణాల్ని ఉత్పత్తి చేసి రక్తహీనతని నివారిస్తుంది. అధిక ఫోలేట్స్ వల్ల గర్భధారణ సమ యంలో పుట్టుకతొ వచ్చే లోపాల నివారణలో సహాయపడుతుంది. కొల్లార్డ్ గ్రీన్స్‌లోని గ్లూకోసినోలేట్స్, సల్ఫర్ సమ్మేళనాలు శరీరంలో ఫ్రీ రాడికల్స్‌ని తగ్గించి పాంక్రియాటిక్, అన్నవాహిక కేన్సర్, రొమ్ము, లంగ్, పెద్దప్రేగు కేన్సర్‌ల్ని నివారించి దెబ్బతినకుండా కేన్సర్ కణాల వ్యాప్తిని నిరోధించగలవు. వీటిలోని విటమిన్ కె, ఒమేగా 3 కొవ్వు ఆమ్లాలు శరీరంలోని మంటల్ని, వాపుల్ని తగ్గిస్తాయి. తక్కువ గ్లైసెమిక్ ఇండెక్స్ ఉన్న ఆహారాలు జీర్ణం కావడానికి ఎక్కువ సమయం పడు తుంది. కాబట్టి ఎక్కువ సేపు కండుపు నిండినట్లుండి అతిగా తినలేదు. దీనివల్ల బరువు తగ్గుతాయి. డయాబెటిక్స్‌లో చక్కెర స్థాయులు తగ్గుతాయి. దీనిలోని కొలిన్స్ శరీరంలోని క్రొవ్వుని గ్రహించి శరీరంలో హోమోసిస్టీన్ ఎక్కువ ఏర్పడకుండా చేస్తుంది. కొల్లార్డ్ గ్రీన్ ఊపిరితిత్తుల ఆరోగ్యానికి మేలు చేస్తాయి. వీటిలోని ఆంటీ, ఆక్సిడెంట్స్ మెనోపాజ్ సమస్యలకి స్త్రీల వ్యాధులకి, నరాల, కండరాల సంకోచాలకు ఉపయోగపడుతుంది. హార్మోన్ల, అసమతుల్యతని తగ్గించి నిద్రలేమి సమస్యల్ని దూరం చేస్తుంది. చర్మం, జుట్టు సమస్యల్ని నివారిస్తుంది. హార్మోన్ల అసమతుల్యతని తగ్గించి నిద్రలేమి సమస్యల్ని దూరం చేస్తుంది. వీటిలోని అధిక ఆక్సలేట్స్ జింక్, కాల్షియం, ఐరన్, ఖనిజాల శోషణకు ఉపయోగపడుతుంది. ఒక కప్పులో 10 మిగ్రా ఆక్సలేట్స్ ఉంటాయి. ఇవి ఎక్కువైతే వీటి శోషణ లోపం ఏర్పడి శారీరక వ్యాధులేర్పడతాయి. ఇది పిల్లల్లో ఆటిజం, హైపర్ ఆక్టివిటీని తగ్గించి ఏకాగ్రత, జ్ఞాపకశకి ని పెంచి మెదడు ఆరోగ్యాని కుపయోగపడుతుంది. వీటిలో విటమిన్ కె, రక్తం గడ్డకట్టడాన్ని ప్రోత్స హిస్తుంది. కొల్లార్డ్ గ్రీన్స్ జీవితకాలం 3–5 సంవత్సరాలుంటుంది. □



డాక్టర్ కె.ఉమాదేవి
తిరుపతి

# 'డీసీ' వైల్డ్ గ్యాంగ్‌స్టర్ కథ : అరుణ్ మాథేశ్వరన్



**డిసి కథ ఆలోచన ఎప్పుడు మొదలైంది?**
నేను ఎప్పటినుంచో చెప్పాలనుకున్న కథ ఇది. ఒక పార్టీలో లోకేష్‌ని కలిశాను. ఈ ఆలోచన ఆయనకు చెప్పి, మనిద్దరం కలిసి చేస్తే బాగుంటుందని అన్నాను.

**టైటిల్‌లో దేవదాస్, చంద్ర, పార్వతి కనిపిస్తున్నారు. కానీ ట్రైలర్‌లో పూర్తిగా గ్యాంగ్‌స్టర్ కథలా ఉంది.**
దేవదాస్, చంద్ర, పార్వతి అనే మూడు పాత్రల కోర్ ఐడియా మాత్రమే దేవదాస్ నుంచి తీసుకున్నాం.

**లోకేష్ కనగరాజ్ చాలా బిజీ డైరెక్టర్. ఆయనను హీరోగా ఎలా ఒప్పించారు?**
లోకేష్ ఇండియాలోనే బిగ్గెస్ట్ డైరెక్టర్. నేను కథ చెప్పిన వెంటనే ఆయనకు బాగా నచ్చింది. అయితే అప్పటికి ఆయన కూలీ సినిమాతో బిజీగా ఉన్నారు.


**ఒక దర్శకుడిని డైరెక్ట్ చేయడం ఎలా అనిపించింది?** ఇది నాకు కొత్త కాదు. భారతీరాజా, సెల్వరాఘవన్‌ని డైరెక్ట్ చేశాను. అలాగే ధనుష్ గారు కూడా దర్శకుడే. దర్శకులతో పని చేయడం ఈజీగా ఉంటుంది.

**డీసీ ప్రేక్షకులకు ఎలాంటి అనుభూతిని ఇస్తుంది?**
ఇది హోప్ ఇచ్చే సినిమా. ఎలాంటి అంచనాలు పెట్టుకోకుండా థియేటర్‌కి వచ్చి సినిమా చూడాలని కోరుకుంటున్నాను. తప్పకుండా కొత్త అనుభూతిని ఇస్తుంది.

**వామికా గబ్బి పాత్ర గురించి చెప్పండి?**
ఈ సినిమాలో వామికా సెక్స్ వర్కర్ పాత్రలో కనిపిస్తుంది. దేవదాస్‌ను కలిసిన తర్వాత ఆమె జీవితం ఎలా మారుతుంది అనేదే ఆమె పాత్ర ప్రయాణం.


**సన్ పిక్చర్స్ గురించి?**
సన్ పిక్చర్స్ చాలా ప్రతిష్టాత్మకమైన సంస్థ. ఈ కథను కళానిధి మారన్‌కి చెప్పినప్పుడు ఆయనకు చాలా నచ్చింది.

# 'ది ప్యారడైజ్' టీజర్ రిలీజ్



నేచురల్ స్టార్ నాని ప్రతిష్టాత్మక 'పాన్ వరల్డ్' చిత్రం 'ది ప్యారడైజ్'పై భారీ అంచనాలు నెలకొన్నాయి. ప్రతి ప్రమోషనల్ కంటెంట్ కి అద్భుతమైన స్పందన లభించింది. పోస్టర్, టైటిల్ గ్లింప్స్‌తో పాటు, చిత్రంలోని మొదటి పాట 'ఆయా షేర్' బ్లాక్‌బస్టర్ విజయాన్ని అందుకుంది. దర్శకుడు శ్రీకాంత్ ఒడెల ఈ చిత్రాన్ని అత్యంత భారీ స్థాయిలో, ప్రతిష్టాత్మకంగా రూపొందిస్తున్నారు. ఎస్ఎల్‌వి సినిమాస్ బ్యానర్ పై సుధాకర్ చెరుకూరి ఈ చిత్రాన్ని భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. ఎంతగానో ఎదురుచూస్తున్న ప్యారడైజ్ టీజర్ ని మేకర్స్ రిలీజ్ చేశారు. "ఇక నుంచి ఈ జాగా ఎవరిది... ఈ దేశం ఎవరిది?' అనే నాని పవర్‌ఫుల్ డైలాగ్‌తో ప్రారంభమైన టీజర్ మొదటి ఫ్రేమ్ నుంచే ప్రేక్షకులను 'ది ప్యారడైజ్' ప్రపంచం లోకి తీసుకెళ్తుంది. నాని తన కెరీర్‌లో ఎన్నడూ కనిపించని రగ్డ్, ఫెరోషియస్ అవతార్‌లో ప్రేక్షకులను సర్ ప్రైజ్. జడలతో కనిపించిన ఆయన లుక్, కళ్లలోని క్రూరత్వం, బాడీ లాంగ్వేజ్, యాక్షన్ మటలో చూపించిన ఇంటెన్సిటీ... ఇవన్నీ కలిసి ఆయన కెరీర్‌లో మరో మైలురాయిగా నిలిచే పాత్రను సూచిస్తున్నాయి. చివర్లో "ఇరుగు దిష్టి... పొరుగు దిష్టి..." అంటూ నాని చెప్పిన డైలాగ్ టీజర్‌కు పర్ఫెక్ట్ క్లైమాక్స్‌లా నిలిచింది. దర్శ కుడు శ్రీకాంత్ ఓడెల 'ది ప్యారడైజ్' ఎంత డీటైల్డ్ ప్రపంచాన్ని సృష్టించారో ఈ టీజర్ స్పష్టంగా తెలియజేస్తోంది.


# వసూళ్ల రాణి జెండాయా!



2026లో హాలీవుడ్‌లో అత్యధిక వసూళ్లు సాధించిన నటిగా జెండాయా ప్రపంచ ప్రసిద్ధి చెందింది. విడుదలైన ఆమె అన్ని చిత్రాలు కలిపి దాదాపు 2 బిలియన్ డాలర్లు వసూలు చేసిన ఆమె చిత్రాలు'స్పైడర్ మ్యాన్','ది ఒడిస్సీ' చిత్రాల భారీ విజయం సాధించినట్లే ఈ ఘనభర్త టామ్ హాలాండ్‌తో కలిసి అత్యధిక వసూళ్లు సాధించిన జంటగా రికార్డు విడుదలకు సిద్ధమవుతున్న 'డ్యూన్: పార్ట్ 3'తో హవా కొనసాగే అవకాశం బాక్సాఫీస్ వద్ద సరికొత్త చరిత్ర సృష్టించింది. ఈ ఏడాది విడుదలైన తన చిత్రాలతో ప్రపంచవ్యాప్తంగా దాదాపు 2 బిలియన్ డాలర్లు (సుమారు రూ. 16,000 కోట్లు) వసూలు చేసి 'అత్యధిక వసూళ్లు సాధించిన నటి'గా అగ్రస్థానంలో నిలిచింది. డిస్నీ చానెల్ బాలనటి స్థాయి నుంచి ప్రపంచ స్థాయి స్టార్‌గా ఎదిగిన జెండాయా, ఇప్పుడు బాక్సాఫీస్‌ను శాసిస్తోంది.ఈ ఏడాది ఆమె కెరీర్‌ను శిఖరాగ్రానికి చేర్చిన రెండు చిత్రాలు 'స్పైడర్ మ్యాన్: బ్రాండ్ న్యూ డే', క్రిస్టోఫర్ నోలన్ దర్శకత్వం వహించిన 'ది ఒడిస్సీ'. ఈ రెండు బ్లాక్‌బస్టర్ చిత్రాలలోనూ ఆమె తన భర్త, నటుడు టామ్ హాలాండ్‌తో కలిసి నటించడం విశేషం. 'స్పైడర్ మ్యాన్' తొలి వారాంతంలోనే 927 మిలియన్ డాలర్లు సాధించగా, 'ది ఒడిస్సీ' కేవలం మూడు వారాల్లో 911 మిలియన్ డాలర్ల మార్కును దాటింది.ఈ రెండు సినిమాల అసాధారణ విజయంతో జెండాయాటామ్ హాలాండ్ జంట ఈ ఏడాదికి 'హాలీవుడ్‌లో అత్యధిక వసూళ్లు సాధించిన ప్రముఖ దంపతులుగా నిలిచారు. వీరి చిత్రాల జోరుతో నార్త్ అమెరికా బాక్సాఫీస్ చరిత్రలోనే ఒక వీకెండ్‌లో అత్యధిక వసూళ్లు నమోదయ్యాయి. ఈ ఏడాది చివర్లో 'డ్యూన్: పార్ట్ 3' కూడా విడుదల కానుంది, బాక్సాఫీస్ వద్ద జెండాయా హవా మరింత పెరిగే అవకాశం ఉందని విశ్లేషకులు అంచన.

తెర

# 1 బిలియన్ వ్యూస్ దాటిన 'రామాయణ' ట్రైలర్



రణ్‌బీర్ కపూర్ కథానాయకుడిగా, నితేష్ తివారి దర్శకత్వంలో తెరకెక్కుతున్న ప్రతిష్టాత్మక చిత్రం 'రామాయణ: పార్ట్ 1' ట్రైలర్ ప్రపంచ వ్యాప్తంగా సంచలనం సృష్టిస్తోంది. రామాయణ ట్రైలర్‌కు అరుదైన ఘనత సాధించింది. 1 బిలియన్ వ్యూస్ దాటిన తొలి భారతీయ సినిమా ట్రైలర్‌గా రికార్డ్ క్రియేట్ చేసింది. ట్రైలర్‌కు సినీ అభిమానులు, విమర్శ కులు, సెలబ్రిటీలు అన్ని వర్గాల ప్రేక్షకుల నుంచి ప్రశంసలు వెల్లువెత్తు తున్నాయి. సినిమా భారీ స్థాయి విజువల్స్, వరల్డ్ క్లాస్ జునీశ్రీ, భావోద్వేగభరితమైన కథనం, అద్భుత మైన బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారాయి. ముఖ్యంగా అనే థీమ్ ప్రేక్షకులను బలంగా ఆకట్టుకుంది. ట్రైలర్‌లో మరో ప్రధాన ఆకర్షణ స్టార్ కాస్టింగ్. శ్రీరాముడిగా రణ్‌బీర్ కపూర్ శక్తివంతమైన నటనతో ఆకట్టుకోగా, రావణుడిగా యష్ తన పవర్‌ఫుల్ స్క్రీన్ ప్రెజెన్స్‌తో అందరి దృష్టిని ఆకర్షించారు. సీతగా సాయి పల్లవి తన హుందాతనం, అమాయకత్వం, భావోద్వేగాలతో ప్రశంసలు అందుకుంటున్నారు. శూర్పణఖగా రకుల్ ప్రీత్ సింగ్ లుక్ కూడా మంచి ఆసక్తిని రేకెత్తించింది. ఈ స్టార్ కాస్టింగ్ ట్రైలర్‌కు మరో పెద్ద బలంగా మారింది. టెక్నికల్‌గా మాత్రమే కాదు... భారతీయుల అత్యంత పవిత్రమైన ఇతిహాసాన్ని ఎంతో నిజాయితీగా, గౌరవంతో, అత్యున్నత స్థాయిలో తెరకెక్కించారనే అభిప్రాయం కూడా వ్యక్తమవుతోంది. భక్తి, భావోద్వేగం, విజువల్ గ్రాండియర్‌ను అద్భుతంగా మేళవించిన ఈ ట్రైలర్ అన్ని తరాల ప్రేక్షకులను ఆకట్టుకుంటూ పూర్తి సినిమాను థియేటర్లలో చూడాలనే ఆసక్తిని పెంచుతోంది.1 బిలియన్ వ్యూస్ దాటిన తొలి భారతీయ సినిమా ట్రైలర్‌గా రికార్డ్ క్రియేట్ చేసిన రామాయణ సినిమాపై ఉన్న అంచనాలను మరో స్థాయికి తీసుకెళ్లింది. నితేష్ తివారి దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని నమిత్ మల్హోత్రాకు చెందిన ప్రైమ్ ఫోకస్ స్టూడియోస్, ఎనిమిది ఆస్కార్ అవార్డులు గెలుచుకున్న డీఎన్ఈజీ , యష్కు చెందిన మాన్‌స్టర్ మైండ్ క్రియేషన్స్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి.

# ప్రేక్షకుల డబ్బులకు న్యాయం చేయాలనే లక్ష్యం: 'దందా' దొర సాయి తేజ



**మీ సినీ జర్నీ గురించి చెప్పండి?..**
ప్రభాస్'అడవి రాముడు' సినిమాలో హీరో చిన్నప్పటి చైల్డ్ కారెక్టర్‌కి డబ్బింగ్ చెప్పాను. 'కొత్తబంగారులోకం', హై స్కూల్ అనే సిరీస్‌లో నటించాను. 'అలా మొదలైంది' సినిమాలోనూ ఓ చిన్న పాత్రను పోషించాను.

**ఇంత చిన్న వయసులోనే వ్యాపారస్థుడిగా, నటుడిగా, కంటెంట్ క్రియేటర్‌గా సాధించడం ఎలా అనిపిస్తుంది?..**
నేను నిద్ర లేచిన క్షణం నుంచి ఒక కంటెంట్ క్రియేటర్‌గా, డైరెక్టర్‌గా, యాక్టర్‌గా, ప్రొడ్యూసర్‌గా ఆలోచిస్తూనే ఉంటాను. నన్ను నేను కొత్తగా పరిచయం చేసుకోడానికి ఇదొక మార్గం.

**సోషల్ మీడియాలో వచ్చే ప్రశంసలు, విమర్శల్ని ఎలా తీసుకుంటారు?..**
సోషల్ మీడియాలో అన్నీ ఉంటాయి. ప్రతీ వీడియోకి కొన్ని కొత్త ప్రశంసలు, కొన్ని తిట్లు వస్తుంటాయి. ఈ కంటెంట్ క్రియేషన్ అనే దాన్ని నేను ఒక బ్రిడ్జిలా వాడతాను.

**అరవింద్ పాత్రకు అద్భుతమైన రెస్పాన్స్ వస్తోంది. మిమ్మల్ని విమర్శించే వారు కూడా పొగిడేస్తున్నారు కదా?..**
కంటెంట్ క్రియేషన్స్‌లో ఒకే రకమైన పాత్రను పోషించగలను. కానీ సిరీస్, సినిమా వరకు వచ్చే సరికి రకరకాల పాత్రలను పోషించే అవకాశం వస్తుంది.

**దర్శకుడు ఆదిత్య దేవులపల్లి మీ గురించి ఎంతో గొప్పగా చెప్పారు?..**
నాకు మానిటర్ చూసే అలవాటు ఉండదు. కెమెరామెన్‌ని చూస్తేనే విషయం తెలుస్తుంది. ఫస్ట్ టేక్‌లోనే సీన్‌ను పూర్తి చేయాలని అనుకుంటాను.

**సోషల్ మీడియాలో మీకోసం నిలబడే మీ ఫ్యాన్స్ గురించి చెప్పండి?..**
ఇదంతా ఒక్క రోజులో సంపాదించింది కాదు. నేను చేసిన కంటెంట్‌లో వాళ్లని వాళ్లు చూసుకున్నారు. అలా చూసుకుని కనెక్ట్ అయ్యారు.

**.ఖాళీ టైంలో దొర సాయి తేజ ఎలా ఉంటాడు?..**
నేను కూడా అందరిలో ఒకడినే. కాకపోతే నాకంటూ ఓ దారి క్రియేట్ చేసుకున్నాను. అది నా ఆర్థిక పరిస్థితుల వల్ల కావొచ్చు, చిన్నప్పటి నుంచి నాకున్న ప్యాషన్ వల్ల కావొచ్చు. ఇక ముందు నన్ను అందరూ కొత్తగా చూస్తారు.

**'దందా' టీం గురించి చెప్పండి?..**
ఆదిత్య గారు వంద శాతం సక్సెస్ అయ్యారు. పేపర్ మీద రాసుకున్నది అవుట్ పుట్‌గా తీసుకు రావడం అన్నది మామూలు విషయం కాదు. ఆ విషయంలో ఆదిత్య అన్నకు ప్రశంసలు వస్తున్నాయి.

**ఫ్యూచర్ ప్లానింగ్ ఏంటి?..**
ప్రతీ ఒక్క సాధారణ వ్యక్తి రిలేట్ అయ్యే కథల్ని థియేటర్‌లో చూపించాలని అనుకుంటున్నాను. జీరో టు హీరో అనే పాత్రలను పోషించాలని కోరుకుంటున్నాను.

# 'స్టువర్టుపురం స్టూడెంట్స్' ట్రైలర్ విడుదల..



బిగ్ బాస్ ఫేమ్ దివి యాక్షన్ అండ్ డాన్స్ హైలెట్ గా తెరకెక్కిన చిత్రం.. శివ సాయి ప్రొడక్షన్స్ పతాక పై డి. నిరీక్షణ సమర్పణలో, నిఖిల్, దివి ప్రధాన పాత్రలో డి. రామకృష్ణ దర్శకత్వంలో నిర్మాతలు ప్రవీణ్ కుమార్ శ్రీనివాస్‌రెడ్డి నిర్మిస్తున్న ఎమోషనల్ యాక్షన్ ఎంటర్టైనర్ స్టువర్టుపురం స్టూడెంట్స్. 80 షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు జరుపుకుంటుంది. కాగా ఈ చిత్ర ట్రైలర్ ను ప్రముఖ దర్శకులు వేణు ఉడుగుల లాంచ్ చేశారు. ట్రైలర్ తో పాటు ఆయన సాంగును కూడా విడుదల చేశారు. ఈ సందర్భంగా వేణు ఉడుగుల మాట్లాడుతూ స్టువర్టుపురం స్టూడెంట్స్ ట్రైలర్ చూశాను .అలాగే సాంగ్స్ కూడా చూశాను. చాలా బాగున్నాయి.ఈ సాంగ్, ఈ ట్రైలర్ నా చేతుల మీదుగా రిలీజ్ చేయటం సంతో షంగా ఉంది. ట్రైలర్ చాలా బాగుంది . అన్నారు. చిత్ర దర్శకుడు రామకృష్ణ మాట్లాడుతూ మా సినిమా ట్రైలర్ విడుదల కోసం అడిగిన వెంటనే కాదనకుండా తన ఆఫీస్ కు పిలిపించుకుని మా ట్రైలరు సాంగ్ ను ఆవిష్కరించిన దర్శకులు వేణు ఉడుగులకి ప్రత్యేక కృతజ్ఞులు తెలుపు కుంటున్నాను. హీరోయిన్ దివి మాట్లాడుతూ మేము అడిగిన వెంటనే ఎంతో రెస్పెక్ట్ ఇచ్చి మా ట్రైలరు సాంగ్‌ని రిలీజ్ చేసిన వేణు ఉడుగులకి ప్రత్యేక కృతజ్ఞులు తెలుపుకుంటున్నాను.

# 'పళ్ళ బురుసు' నవ్వులు పూయించే ట్రైలర్



అన్నపూర్ణ స్టూడియోస్, నిశిది స్టూడియోస్ సంయుక్తంగా సమర్పిస్తూ నిర్మిస్తున్న కుటుంబ కథా చిత్రం 'పళ్ళ బురుసు'. ఆదిత్య పిట్టీ, వివేక్ కృష్ణాని నిర్మాతలు. ఉదయ్ చౌహాన్ రచన, దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో సుధాకర్ రెడ్డి, మురళీధర్ గౌడ్, గోమతి, ప్రజ్వల్ యాద్మ, సుజాత కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా ఆగస్టు 14న సినిమా విడుదల కానుండగా, తాజాగా కింగ్ నాగార్జున అక్కినేని ఈ చిత్ర ట్రైలర్‌ను లాంచ్ చేశారు.ఈ సందర్భంగా కింగ్ నాగార్జున మాట్లాడుతూ.. సిద్ధిపేట జిల్లా దుబ్బాక మండలం లచ్చపేట గ్రామ ప్రజలందరికీ నా నమస్కారం. 'పళ్ళ బురుసు' సినిమా షూటింగ్ లచ్చపేట గ్రామంలోనే జరిగింది. అందుకే ఈ ట్రైలర్‌ను ముందుగా మీ అందరికీ చూపించి విడుదల చేయాలనుకున్నాం. ట్రైలర్ లాంచ్ సందర్భంగా లచ్చపేట గ్రామంలో సందడి వాతావరణం నెలకొంది. గ్రామస్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఓ తండ్రి తన కొడుకుపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో ట్రైలర్ ఆసక్తికరంగా ప్రారంభమవుతుంది. కారణం ఏమిటంటే... తనకు టూత్‌బ్రష్ కొనివ్వలేదని కొడుకుపై కేసు పెట్టడం. ఇంత చిన్న విషయానికి ఫిర్యాదు చేయడమేంటని పోలీసులు సర్ ప్రైజ్ గురవుతారు. ట్రైలర్ ముందుకు సాగేకొద్దీ తండ్రికొడుకుల మధ్య పెరిగిన భావోద్వేగ, ఒకరినొకరు అర్థం చేసుకోలేని పరిస్థితి హృదయాన్ని తాకేలా చూపించారు. సినిమా టోగ్రాఫర్ వినోద్ కె. బంగారి గ్రామీణ నేపథ్యాన్ని సహజత్వంతో అద్భుతంగా ఆవిష్కరించగా, పవన్ సీహెచ్ అందించిన బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ వినోదం, భావోద్వేగాలను ఎలివేట్ చేసింది.

వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్..

# టీమిండియాకు డూ ఆర్ డై




## మిగిలిన 9 మ్యాచ్‌లూ కీలకం

**న్యూఢిల్లీ:** వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ (డబ్ల్యూటిసి) 2025-27 ఫైనల్ రేసులో భారత్ నిలవడం అత్యంత సంక్లిష్టంగా మారింది. ప్రస్తుతం టీమిండియా ఆడిన 9 టెస్టుల్లో 4 విజయాలతో 48.15 శాతం పాయింట్లతో (డబ్ల్యూటిసి) ఐదో స్థానానికి పరిమితమైంది. అంతేకాకుండా, పాయింట్ల పట్టికలో బంగ్లాదేశ్ కంటే కూడా వెనుకబడి ఉండటం గమనార్హం. ప్రస్తుతం ఆస్ట్రేలియా 87.50 గెలుచుకున్న పాయింట్ల శాతంతో అగ్రస్థానంలో ఉండగా, సౌతాఫ్రికా (75), న్యూజిలాండ్ (72.22), బంగ్లాదేశ్ (58.33) వరుసగా భారత్ కంటే మెరుగైన స్థానాల్లో ఉన్నాయి. భారత్ ఖాతాలో ఇంకా 9 టెస్టు మ్యాచ్‌లు మిగిలి ఉండటంతో ఇకపై ఎలాంటి పొరపాట్లకు తావులేదు. టీమిండియా తన మిగిలిన అన్ని మ్యాచ్‌ల్లోనూ విజయం సాధిస్తే పాయింట్ల శాతం 74.07కు చేరి ఫైనల్ బెర్త్ దాదాపు ఖాయమవుతుంది. అయితే, ఒక మ్యాచ్ ఓడితే పాయింట్ల శాతం 68.5కు, రెండు ఓటములతో 62.9కు, మూడు ఓటములు ఎదురైతే 57.41కి పడిపోతుంది. డబ్ల్యూటిసి నిబంధనల ప్రకారం ప్రతి విజయానికి 12 పాయింట్లు, డ్రాకు 4 పాయింట్లు లభిస్తాయి, కాబట్టి ఒక్క ఓటమి కూడా భారీ ప్రభావం చూపుతుంది. టీమిండియా ముందున్న షెడ్యూల్ ఎంతో సవాలుతో కూడుకున్నది. ఇక టీమిండియా మొదట శ్రీలంక పర్యటనలో రెండు టెస్టులు ఆడనుంది. అక్కడ స్పిన్ ఎదుర్కోవడం పెద్ద పరీక్షగా మారనుంది. ఆ తర్వాత న్యూజిలాండ్ పర్యటనలో మరో రెండు టెస్టుల్లో పోటీపడాల్సి ఉంటుంది. చివరగా, ప్రపంచ నంబర్1 టెస్ట్ జట్టు ఆస్ట్రేలియాతో స్వదేశంలో 5 మ్యాచ్‌ల సుదీర్ఘ సిరీస్ ఆడాల్సి ఉంది. ఈ పరిస్థితుల్లో భారత్ కేవలం తన మ్యాచ్‌లను గెలవడమే కాకుండా, ఇతర జట్ల ఫలితాలపై కూడా ఆధారపడాల్సిన పరిస్థితి ఏర్పడింది. శుభమన్ గిల్ సారథ్యంలోని టీమిండియా ఇకపై ఆడే ప్రతి మ్యాచ్ నాకౌట్‌గా భావించి వరుస విజయాలు సాధిస్తేనే వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ ఫైనల్ కలను నిజం చేసుకోగలదు.

సెయింట్ లూయిస్ రాపిడ్..

# బ్లిట్జ్ ఛాంపియన్‌గా ప్రజ్ఞానంద



**న్యూఢిల్లీ:** భారత చెస్ గ్రాండ్‌మాస్టర్ ఆర్. ప్రజ్ఞానంద, జవోఖిర్ సిందరోవ్‌తో జరిగిన చివరి ముఖాముఖి పోరులో కీలకమైన డ్రా సాధించి, ఒక రౌండ్ మిగిలి ఉండగానే గ్రాండ్ చెస్ టూర్ సెయింట్ లూయిస్ రాపిడ్, బ్లిట్జ్ ఛాంపియన్‌గా నిలిచి టైటిల్‌ను కైవసం చేసుకున్నారు. శుక్రవారం జరిగిన ఈ చెస్ టోర్నమెంట్‌లో 20 యేళ్ల భారత స్టార్ 35 పాయింట్లకు గాను 23 పాయింట్లతో ఛాంపియన్‌షిప్‌ను ముగించగా, సిందరోవ్ 22 పాయింట్లతో టోర్నమెంట్‌లో రెండో స్థానంలో నిలిచాడు. ఐదురోజుల పాటు జరిగిన ఈ టోర్నమెంట్ అంతటా ప్రజ్ఞానంద తన పట్టును కొనసాగించాడు. చివరి దశలలో సిందరోవ్ గట్టి పోటీ ఇచ్చినప్పటికీ, ఈ ఉజ్బెక్ గ్రాండ్‌మాస్టర్ భారత ఆటగాడి కంటే కేవలం 1.5 పాయింట్ల తేడాతో ఓటమి పాలయ్యాడు. ఈ బ్లిట్జ్ టోర్న మెంట్‌లో 10మంది అగ్రశ్రేణి గ్రాండ్‌మాస్టర్లు పోటీపడ్డారు. ఈ ఈవెంట్‌లో తొమ్మిది రాపిడ్ రౌండ్లు, 18 బ్లిట్జ్ రౌండ్లు జరిగాయి. సింక్ఫీల్డ్ కప్, జిసిటి గ్రాండ్ ఫైనల్స్‌కు ముందు విలువైన గ్రాండ్ చెస్ టూర్ పాయింట్లకోసం మొత్తం 135గేమ్‌లు ఆడబడ్డాయి. ఈ పోటీలో రెండు ఫార్మా ట్‌లలో మొదటిది, 25నిమిషాల కాలపరిమితి, మొదటి ఎత్తునుండి 10సెకన్ల అదనపు సమయంతో కూడిన 9 రౌండ్ల సింగిల్ రౌండ్‌రాబిన్ ర్యాపిడ్ ఈవెంట్, రెండవది ఐదు నిమిషాల కాలపరిమితి, ప్రతి ఎత్తుకు రెండు సెకన్ల అదనపు సమయంతో ఆడే 18 రౌండ్ల డబుల్ రౌండ్‌రాబిన్ బ్లిట్జ్ ఈవెంట్. స్కోరింగ్ విధానంలో వేగవంతమైన విజయాలకు రెండు పాయింట్లు, డ్రాలకు ఒక పాయింట్ లభించగా, బ్లిట్జ్ విజయాలకు ఒక పాయింట్, డ్రాలకు అర పాయింట్ లభించింది.





# కొరియా మాస్టర్స్.. సెమీఫైనల్‌కు అష్మిత, రక్షిత

**న్యూఢిల్లీ:** భారత్ ప్లేయర్లు అష్మిత, రక్షిత కొరియా మాస్టర్స్ సెమీఫైనల్‌కు చేరుకున్నారు. శుక్రవారం ఇక్కడ జరిగిన తమతమ క్వార్టర్ ఫైనల్స్‌లో ప్రపంచ 50వ ర్యాంకర్ అష్మిత, ఆసన్ యి సన్‌సిన్ జిమ్నాసియంలో జరిగిన ఉత్కంఠభరితమైన క్వార్టర్ ఫైనల్‌లో, టాప్ సీడ్ మరియు ప్రపంచ 22వ ర్యాంకర్ అయిన జపాన్‌కు చెందిన హినా అకేచిని 20-22, 21-15, 21-19 తేడాతో ఓడించి, ఈ టోర్నమెంట్‌లో ఇప్పటివరకు జరిగిన అతిపెద్ద సంచలనాన్ని సృష్టించింది. గంటకు పైగా సాగిన పోరులో, ఒక గేమ్ వెనుకబడిన స్థితి నుండి పుంజుకున్న రక్షిత, మూడో సీడ్, తన స్వదేశీయురాలైన తన్వి శర్మను 18-21, 21-19, 21-18 స్కోరుతో ఓడించి సంచలనం సృష్టించింది. అష్మిత ఎండ్స్ తర్వాత అష్మిత బలంగా పుంజుకుంది. స్కోరు 7-7తో సమంగా ఉన్నప్పుడు, ఆమె వరుసగా ఆరు పాయింట్లు సాధించి 13-7 ఆధిక్యానికి దూసుకెళ్లింది. హినా తేడాను 14-16కు తగ్గించినప్పటికీ, భారత క్రీడాకారిణి సంయమనం కోల్పోకుండా, తర్వాతి ఆరు పాయింట్లలో ఐదింటిని కైవసం చేసుకుని మ్యాచ్‌ను నిర్ణయాత్మక గేమ్‌కు దారితీసింది. నిర్ణయాత్మక గేమ్ కూడా అష్మిత అదే రీతిలో సాగి చిరస్మరణీయ విజయాన్ని సొంతం చేసుకుంది. అలాగే తొలి గేమ్‌లో రక్షిత 138 ఆధిక్యంతో దూసుకెళ్లగా, ఆ తర్వాత తన్వి అద్భుతంగా పుంజుకుని, తర్వాతి తొమ్మిది పాయింట్లలో ఎనిమిదింటిని వరుసగా సాధించి 8-13 నుంచి 16-14కు చేరుకుని గేమ్‌ను ముగించింది. తర్వాత గేమ్ కూడా మరో హోరాహోరీ పోరుగా సాగింది. కీలక దశలో తన్వి తడబడి, మూడు అనవసర తప్పిదాలు చేయడంతో రక్షిత 19-16 ఆధిక్యాన్ని సాధించి విజయాన్ని ఖాయం చేసుకుంది.

# టీమిండియా బౌలర్లు విఫలం

## భారీగా 363 పరుగులు చేసిన శ్రీలంక



**న్యూఢిల్లీ:** శ్రీలంక ఎలెవన్‌తో జరుగుతున్న ప్రాక్టీస్ మ్యాచ్‌లో భారత బౌలర్లు తేలిపోయారు. కొలంబో వేదికగా తొలి రోజు శుక్రవారం ఆట ముగిసే సమయానికి శ్రీలంక జట్టు తమ మొదటి ఇన్నింగ్స్‌లో 8 వికెట్లు నష్టానికి 363 పరుగుల భారీ స్కోర్ సాధించింది. ఆతిథ్య జట్టు వికెట్లు పడగొట్టేందుకు టీమిండియా బౌలర్లు తీవ్రంగా శ్రమించారు. టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్‌కు దిగిన శ్రీలంకకు ఓపెనర్లు నిశాన్ మధుష్క (66), రవిందు రసంత (71) అద్భుతమైన ఆరంభాన్ని ఇచ్చారు. వారిద్దరూ వన్డే తరహాలో బ్యాటింగ్ చేసి తొలి వికెట్‌కు ఏకంగా 110 పరుగు భాగస్వామ్యం నెలకొల్పి భారత్ బౌర్లను ఒత్తిడిలోకి నెట్టారు. అయితే సమన్వయ లోపం కారణంగా మధుష్క రనౌట్ కావడంతో భారత్‌కు తొలి వికెట్ దక్కింది. నిశాన్ స్థానంలో క్రీజులోకి వచ్చిన వన్‌డౌన్ బ్యాటర్ పసిందు సూరియబండారా కూడా రాణించాడు. అయితే రసతంత, సూరియబండరా (35)లను వరుస ఓవర్లలో ఔట్ చేసి టీమిండియా కాస్త కమ్‌బ్యాక్ ఇచ్చినట్లు కన్పించింది. కానీ ఆ తర్వాత వచ్చిన పవన్ రత్నాయకే (39), అహన్ విక్రమ సింఘే( 31), కెప్టెన్ సోనల్ దినుష (52), రమేష్ మెండిస్ (32) నిలకడగా ఆడి జట్టు స్కోర్‌ను 350 పరుగుల మార్క్ దాటించారు. ప్రస్తుతం క్రీజులో కేశర సువాంత (9), సుదీరా (1) ఉన్నారు. భారత్ బౌలర్లలో రవీంద్ర జడేజా, కుల్దీప్ యాదవ్, మానవ్ సుతార్ తలా రెండు వికెట్లు పడగొట్టారు. వీరితో పాటు గుర్నూర్ బ్రార్ఫు ఓ వికెట్ తీశాడు. సీనియర్ పేసర్ మహ్మద్ సిరాజ్ 13 ఓవర్లు బౌటింగ్ చేసినప్పటికీ ఒక్క వికెటను కూడా తీయలేదు.

వరల్డ్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్..

# ఫైనల్‌కు అష్ఫాక్, బసంత్






**న్యూఢిల్లీ:** భారత్‌కు చెందిన మహమ్మద్ అష్ఫాక్, 2026 ప్రపంచ అథ్లెటిక్స్ అండర్20 ఛాంపియన్‌షిప్ పురుషుల 400 మీటర్ల పోటీలో ఫైనల్‌కు చేరుకున్నాడు. అలాగే హై జంప్‌లో బంసత్ విజయంతో ఫైనల్‌కు అర్హత సాధించాడు. శుక్రవారం నాడు ఈ పోటీల్లో 19 యేళ్ల అష్ఫాక్ హీట్ 5లో 45.81 సెకన్ల సమయం నమోదు చేసి రెండో స్థానంలో నిలిచాడు. సెమీఫైనల్ హీట్ 3లో 46.00 సెకన్ల పరుగుతో మూడవ స్థానంలో నిలిచి ఫైనల్‌లో తన స్థానాన్ని సురక్షితం చేసుకున్నాడు.

మరో భారత్ అథ్లెట్ పీయూష్ రాజ్, హీట్ 6లో 47.78 సెకన్ల టైమింగ్‌తో ఐదవ స్థానంలో నిలిచి తదుపరి రౌండ్‌కు అర్హత సాధించలేకపోయాడు. ఇక పురుషుల హై జంప్‌లో, బసంత్ 2.14 మీటర్ల ఎత్తును అధిగమించి ఫైనల్‌కు అర్హత సాధించగా, 2.05 మీటర్ల అత్యుత్తమ జంప్ చేసిన ఏకే అంబ్రీష్ గ్రూప్ బిలో 12వ స్థానంలో నిలిచి అర్హతను కోల్పోయాడు. ఇక అన్షు మహిళల షాట్‌పుట్ ఫైనల్‌కు తృటిలో అర్హత కోల్పోయింది. ఆమె 15.24 మీటర్ల అత్యుత్తమ ప్రదర్శనతో అర్హత మార్కుకు 21 సెం.మీ. దూరంలో నిలిచింది. తను చౌదరి కూడా మహిళల 400 మీటర్ల హార్డిల్స్‌లో తన హీట్‌లో 1:00.03 సమయంతో తదుపరి రౌండ్‌కు అర్హత సాధించలేకపోయింది. పురుషుల 400 మీటర్ల హార్డిల్స్‌లో, అమిత్ కుమార్ తన హీట్‌లో 54.01 సెకన్ల సమయంతో చివరి స్థానంలో నిలిచాడు.

# మరింత పెరిగిన వెండి, బంగారాలు

## వెండి రూ.8,000 పెరుగుదల, బంగారం రూ.1.50 లక్షలకు చేరిక




**న్యూఢిల్లీ, ఆగస్టు 7:** దేశీయ కమోడిటీ మార్కెట్‌లో విలువైన లోహాల ధరలు శుక్రవారం భారీగా పెరిగాయి. అంతర్జాతీయ మార్కెట్లలో బంగారం, వెండి ధరలు బలపడటం, అమెరికాఇరాన్ మధ్య ఉద్రిక్తతలు తగ్గుముఖం పడతాయన్న అంచనాలు దేశీయ మార్కెట్‌పై ప్రభావం చూపాయి. మల్టీ కమోడిటీ ఎక్స్ఛేంజ్ (ఎంసీఎక్స్)లో సెప్టెంబర్ గోల్డ్ ఫ్యూచర్స్ కాంట్రాక్ట్ ధర 1.54 శాతం లేదా రూ.2,271 పెరిగి 10 గ్రాములకు రూ.1,49,793కు చేరింది. సెప్టెంబర్ సిల్వర్ ఫ్యూచర్స్ ఏకంగా 3.56 శాతం లేదా రూ.8,040 ఎగిసి కిలోకు రూ.2,33,876 వద్ద ట్రేడయ్యాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో స్పాట్ గోల్డ్ ధర సుమారు 1.9 శాతం పెరిగి ఔన్సుకు 4,300 డాలర్లకు చేరువైంది. దీంతో బంగారం, వెండి వరుసగా బలమైన వారపు పనితీరును నమోదు చేసే దిశగా సాగుతున్నాయి. బ్రెంట్ క్రూడ్ ధర బ్యారెల్‌కు 81.74 డాలర్లకు తగ్గింది. వెస్ట్ టెక్సాస్ ఇంటర్మీడియట్ సుమారు 76 డాలర్ల వద్ద ఉంది. క్రూడ్ ధరలు తగ్గడం ద్రవ్యోల్బణ ఆందోళనలను తగ్గిస్తుంది. దీంతో అమెరికా ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లను తక్కువగా ఉంచడం లేదా తగ్గించే అవకాశాలు పెరుగుతాయని మార్కెట్ భావిస్తుంది. వడ్డీ ఆదాయం ఇవ్వని బంగారానికి తక్కువ వడ్డీ రేట్లు అనుకూలంగా ఉంటాయి. అమెరికా కరెన్సీ విలువ స్వల్పంగా తగ్గడం కూడా బంగారం ధరలకు మద్దతుగా నిలిచింది. బంగారం అంతర్జాతీయంగా డాలర్లలో ధర నిర్ణయించబడుతుంది. డాలర్ బలహీనపడితే ఇతర కరెన్సీల కొనుగోలుదారులకు బంగారం చౌకగా మారడంతో డిమాండ్ పెరుగుతుంది. హార్ముజ్ ద్వారా నౌకాయానాన్ని పునరుద్ధరించేందుకు ఒప్పందం సమీపంలో ఉందన్న సంకేతాలు మార్కెట్‌లో కనిపిస్తున్నాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కూడా అమెరికా ఇరాన్ యుద్ధం త్వరలో ముగిసే అవకాశం ఉందని వ్యాఖ్యానించారు. చమురు ధరల తగ్గుదల బంగారం ధరలకు మద్దతునిచ్చింది. ఇక మార్కెట్ దృష్టి ఇప్పుడు అమెరికా నాన్‌ఫార్మ్ పేరోల్స్ గణాంకాలపై ఉంది. ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్ల నిర్ణయాలపై ఈ డేటా కీలక ప్రభావం చూపనుంది. అంచనాల కంటే బలహీనమైన ఉద్యోగ గణాంకాలు వెలువడితే వడ్డీ రేట్ల తగ్గింపుపై అంచనాలు పెరిగి బంగారం, వెండి ధరలకు మరింత మద్దతు లభించే అవకాశం ఉంది. అదే సమయంలో బలమైన ఉద్యోగ గణాంకాలు వెలువడితే ఇటీవలి లాభాల్లో కొంత లాభాల స్వీకరణ చోటుచేసుకోవచ్చని మార్కెట్ నిపుణులు భావిస్తున్నారు.

# ఆర్థిక, ప్రైవేట్ బ్యాంకింగ్ రంగాల ఒత్తిడి



## నష్టాల్లో ముగిసిన సెన్సెక్స్ నిఫ్టీ

**ముంబయి, ఆగస్టు 7:** దేశీయ స్టాక్ మార్కెట్లు వారాంతంలో నష్టాలు చవిచూసాయి. ఫైనాన్షియల్, ప్రైవేట్ బ్యాంకింగ్ స్టాక్స్‌లో అమ్మకాల ఒత్తిడి, పెరుగుతున్న భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు ఇన్వెస్టర్ల సెంటిమెంట్‌ను దెబ్బతీశాయి. ఫలితంగా మార్కెట్ ప్రారంభం నుంచి ఒడిదొడుకులకు లోనైంది. దిగ్గజ ఫైనాన్షియల్ స్టాక్స్‌లో బలహీనత కారణంగా ప్రధాన సూచీలు నష్టాల్లోకి జారుకున్నాయి. శుక్రవారం ట్రేడింగ్ ముగిసే సమయానికి, సెన్సెక్స్ 455.59 పాయింట్లు క్షీణించి 78,499.17 వద్ద స్థిరపడింది. ఇక, నిఫ్టీ 65.35 పాయింట్లు నష్టపోయి 24,570.65 వద్ద ముగిసింది. ఫైనాన్షియల్ స్టాక్స్‌లో ఇన్వెస్టర్లు తమ పెట్టుబడులను తగ్గించుకోవడంతో మార్కెట్ సెంటిమెంట్ రోజంతా బలహీనంగానే ఉంది. ముఖ్యంగా నిఫ్టీ ఫైనాన్షియల్ సర్వీసెస్, నిఫ్టీ ప్రైవేట్ బ్యాంక్ సూచీలు అత్యధికంగా నష్టపోయి మార్కెట్‌పై తీవ్ర ఒత్తిడిని పెంచాయి. నిఫ్టీ షేర్లలో బజాజ్ ఫైనాన్స్, బజాజ్ ఫిన్‌సర్వ్, ట్రెంట్ టాప్ లూజర్లుగా నిలిచాయి. ప్రధాన సూచీలు నష్టపోయినప్పటికీ బ్రాడర్ మార్కెట్ కొంతమేర తట్టుకుని నిలబడింది. నిఫ్టీ మిడ్‌క్యాప్ ఇండెక్స్ 0.22 శాతం లాభపడగా, నిఫ్టీ స్మాల్‌క్యాప్ ఇండెక్స్ 0.05 శాతం స్వల్పంగా నష్టపోయింది. రంగాల వారీగా చూస్తే ఆటో, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐటీ) షేర్లు మార్కెట్‌కు కొంత మద్దతు నిచ్చాయి. నిఫ్టీ ఆటో, నిఫ్టీ ఐటీ సూచీలు ప్రధాన రంగాల్లో టాప్ గెయినర్లుగా నిలిచి, సూచీల నష్టాలను కొంతవరకు పరిమితం చేశాయి. బిఎస్‌ఇలో మిడ్‌క్యాప్‌సూచీ 0.18 పెరిగితే స్మాల్‌కాప్ సూచీ స్థిరంగాను కొనసాగాయి. కమోడిటీ మార్కెట్‌లోబ్రెంట్ ముడిచమురు అక్టోబరు సెటిల్‌మెంట్‌దర 33 సెంట్లు క్షీణించి బ్యారెల్‌కు 82.16 డాలర్లుగా కొనసాగింది. విదేశీ కరెన్సీ మార్కెట్‌లో భారత్ రూపాయి 95.19 వద్ద ముగిసింది. అంతకుముందురోజు 95.22కంటే కొంతమేర మెరుగుపడింది. ఎంసిఎక్స్‌లో పసిడి ఫ్యూచర్లు అక్టోబరు ఐదునాటి ధరలు 1.56శాతంపెరిగి రూ.1,51,176కి చేరాయి.




# ఇఎంఐ బకాయిలున్నా ఫోన్ లాక్‌కు ఆర్బీఐ నో

**ముంబయి, ఆగస్టు 7:** స్మార్ట్‌ఫోన్‌కోసం తీసుకున్న రుణాలు బకాయిలుంటే ఫోన్ లాక్‌చేసే సంస్థలకు ఆర్బీఐ కొత్త మార్గదర్శకాలు జారీచేసింది. ఇవి వచ్చే యేడాది జనవరి 1 నుంచి అమల్లోకి వస్తాయి. ఇఎంఐ చెల్లించలేదని వెంటనే ఫోన్‌ను లాక్ చేయడానికి వీల్లేదు. ఫోన్ కొనుగోలు కోసం తీసుకున్న రుణం 30 రోజుల పాటు బకాయిగా ఉంటేనే పరిమితులు విధించవచ్చు. పూర్తిగా ఫోన్‌ను లాక్ చేయాలంటే బకాయి 60 రోజులు దాటాలి. ఈ నిబంధనలు ఫోన్, ట్యాబ్లెట్, ల్యాప్‌టాప్ కొనుగోలు కోసం తీసుకున్న రుణాలకే వర్తిస్తాయి. వ్యక్తిగత రుణం లేదా ఇతర రుణాల పేరుతో ఇప్పటికే ఉన్న ఫోన్‌ను రిమోట్ ద్వారా లాక్ చేసే అధికారం రుణదాతలకు ఉండదని ఆర్బిఐ స్పష్టం చేసింది. ఫోన్‌పై పరిమితులు విధించినా కొన్ని సేవలు తప్పనిసరిగా పనిచేయాలని ఆదేశించింది. ఇన్‌కమింగ్ కాల్స్, ఎస్ఎంఎస్, అత్యవసర ఎస్‌వోఎస్ సదుపాయం, ఉద్యోగానికి అవసరమైన కీలక ఫీచర్లు అందుబాటులో ఉండాలి. దీంతో రుణగ్రహీత పూర్తిగా ఇబ్బంది పడకుండా చూడాలని సూచించింది.

# 682.35 బిలియన్ డాలర్లకు ఫారెక్స్ ఖజానా




**న్యూఢిల్లీ, ఆగస్టు 7:** భారత్ విదేశీ మారక నిల్వలు మరోసారి భారీగా పెరిగాయి. జూలై 31తో ముగిసిన వారంలో దేశ ఫారెక్స్ నిల్వలు 8.75 బిలియన్ డాలర్లు పెరిగి 682.354 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి. అంతకుముందు వారంలో నిల్వలు 6.118 బిలియన్ డాలర్లు పెరిగి 682.354 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి. ఈ ఏడాది ఫిబ్రవరి 27తో ముగిసిన వారంలో దేశ విదేశీ మారక నిల్వలు 728.494 బిలియన్ డాలర్ల ఆల్‌టైమ్ గరిష్ఠ స్థాయిని తాకాయి. ఆ తర్వాత పశ్చిమాసియా ఘర్షణల నేపథ్యంలో రూపాయి ఒత్తిడికి గురికావడంతో నిల్వలు పలు వారాల పాటు తగ్గాయి. రూపాయి విలువను కాపాడేందుకు ఆర్‌బీఐ ఫారెక్స్ మార్కెట్లో డాలర్లను విక్రయించాల్సి వచ్చింది. జూలై 31తో ముగిసిన వారంలో ఫారెక్స్ నిల్వల్లో ప్రధాన భాగమైన విదేశీ కరెన్సీ ఆస్తులు 8.75 బిలియన్ డాలర్లు పెరిగి 564.68 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి. డాలర్ విలువలో లెక్కించే ఎఫ్‌సిఎల్లో యూరో, పౌండ్, యెన్ వంటి అమెరికాయేతర కరెన్సీల విలువల్లో చోటుచేసుకునే మార్పుల ప్రభావం కూడా ఉంటుంది. దేశంలోకి మరిన్ని విదేశీ మారకద్రవ్య ప్రవాహాలను ఆకర్షించేందుకు కేంద్ర ప్రభుత్వం, ఆర్‌బీఐ గత నెలలో పలు చర్యలు చేపట్టాయి. ఇందులో ఎఫ్‌సీఎన్‌ఆర్(బీ) డిపాజిట్లకు సంబంధించిన చర్యలు కూడా ఉన్నాయి. ఈ పథకాల ద్వారా ఇప్పటివరకు భారత్‌కు సుమారు 32 బిలియన్ డాలర్ల విదేశీ మారకద్రవ్య ప్రవాహం వచ్చినట్లు నివేదికలు పేర్కొంటున్నాయి. వారంలో బంగారం నిల్వల విలువ 1.685 బిలియన్ డాలర్లు పెరిగి 104.743 బిలియన్ డాలర్లకు చేరింది. ప్రత్యేక డ్రాయింగ్ రైట్స్ 48 మిలియన్ డాలర్లు పెరిగి 18.666 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి. అంతర్జాతీయ ద్రవ్య నిధిసంస్థలో భారత్ రిజర్వ్ పొజిషన్ కూడా 28 మిలియన్ డాలర్లు పెరిగి 4.778 బిలియన్ డాలర్లకు చేరుకున్నట్లు ఆర్‌బీఐ వెల్లడించింది.

# మెటాకు అమెరికా కోర్టు రూ.5400 కోట్ల జరిమానా

**న్యూమెక్సికో, ఆగస్టు 7:** సోషల్ మీడియా దిగ్గజం మెటాకు అమెరికా కోర్టులో భారీ ఎదురుదెబ్బ తగిలింది. ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ ప్లాట్‌ఫామ్‌ల వల్ల యువత మానసిక ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం పడుతోందని నిర్ధారించిన న్యూ మెక్సికో కోర్టు, కంపెనీకి భారత కరెన్సీలో సుమారు రూ. 5,400 కోట్లకు పైగా జరిమానా విధిస్తూ సంచలన తీర్పు ఇచ్చింది. ఈ కేసు విచారణలో భాగంగా రెండో దశలో జడ్జి బ్రయాన్ బీడ్‌షీడ్ ఈ ఆదేశాలు జారీ చేశారు. జరిమానా మొత్తంలో 420 మిలియన్ డాలర్లు సోషల్ మీడియా వల్ల ప్రభావితమైన యువతకు చికిత్సా సేవల కోసం కేటాయించాలని న్యాయస్థానం స్పష్టం చేసింది. మిగిలిన నిధులను రాబోయే ఐదేళ్లలో అవగాహన, నివారణ కార్యక్రమాలు, స్క్రీనింగ్ సేవలు, ఇతర సంబంధిత ఖర్చుల కోసం వినియోగించాలని ఆదేశించింది. ఈ కేసులో గత మార్చి నెలలో వెలువడిన తీర్పునకు ఇది కొనసాగింపు కావడం గమనార్హం. ఆ సమయంలో మెటా ఉద్దేశపూర్వకంగానే పిల్లల మానసిక ఆరోగ్యానికి హాని కలిగించిందని, లైంగిక దోపిడీకి సంబంధించిన సమాచారాన్ని దాచిపెట్టిందని నిర్ధారించిన జ్యూరీ, కంపెనీకి 375 మిలియన్ డాలర్ల సివిల్ పెనాల్టీ విధించింది. ఈ కేసు విచారణలో ప్రాసిక్యూటర్లు మెటా ప్లాట్‌ఫామ్‌లలో కీలక మార్పులు చేయాలని కోరారు. ముఖ్యంగా యువతను వ్యసనపరులుగా మార్చే ఫీచర్లను నియంత్రించాలని, వయసు నిర్ధారణ పద్ధతులను కఠినతరం చేయాలని, పిల్లల లైంగిక దోపిడీని అరికట్టేందుకు డిఫాల్ట్ ప్రైవసీ సెట్టింగులను మెరుగుపరచాలని వాదించారు. ప్రాసిక్యూటర్ల అభ్యర్థనలను కోర్టు పాక్షికంగానే అంగీకరించింది. 13 ఏళ్లలోపు పిల్లలకు వయసు నిర్ధారణను తప్పనిసరి చేయాలన్న వాదనను తోసిపుచ్చింది.

# అగ్రిబిజినెస్ సన్‌ఫ్లవర్ ఆయిల్‌పై ఎఫ్ఎస్ఎస్ఎఐ జరిమానా

**న్యూఢిల్లీ, ఆగస్టు 7:** ప్రముఖ వంటనూనెల తయారీ సంస్థ ఎడబ్ల్యుఎల్ అగ్రి బిజినెస్‌కు ఆహార నియంత్రణ సంస్థ ఎఫ్ఎస్ఎస్ఎఐ జరిమానా విధించింది. నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా లేని ఫోర్టిఫైడ్ సన్‌ఫ్లవర్ వంటనూనెను తయారు చేసి, విక్రయించినందుకు ఈ చర్య తీసుకుంది. ఎడబ్ల్యుఎల్ అగ్రి బిజినెస్ ఫార్చ్యూన్ బ్రాండ్ పేరుతో వంటనూనెలను విక్రయిస్తోంది. గోవాలో సేకరించిన ఫార్చ్యూన్ ఫ్రయోలా రిఫైన్డ్ సన్‌ఫ్లవర్ సీడ్ ఆయిల్ నమూనా ప్రయోగశాల పరీక్షల్లో విఫలమైంది. నూనెలో విటమిన్ డి స్థాయి నిర్దేశిత ప్రమాణాల కంటే గణనీయంగా తక్కువగా ఉన్నట్లు తేలింది. ఈ విషయాన్ని ఎఫ్ఎస్ఎస్ఎఐ శుక్రవారం సోషల్ మీడియా పోస్టు ద్వారా వెల్లడించింది. ఎడబ్ల్యుఎల్ అగ్రి బిజినెస్ లిమిటెడ్ (మంగళూరు) పై అడ్జుడికేషన్ ఆర్డర్ జారీ చేసి జరిమానా విధించినట్లు తెలిపింది. గోవాలోని తాజ్ ఫోర్ట్ అగ్వాడా రిసార్ట్ అండ్ స్పా నుంచి ఎఫ్ఎస్ఎస్ఎఐ అధికారులు ఒక లీటర్ ఫార్చ్యూన్ ఫ్రయోల్హా రిఫైన్డ్ సన్‌ఫ్లవర్ ఆయిల్ నమూనాను సేకరించారు. ప్రాథమిక ఆహార ప్రయోగశాల పరీక్షల్లో ఈ ఫోర్టిఫైడ్ నూనె ఫోర్టిఫికేషన్ ఆఫ్ ఫుడ్స్ రెగ్యులేషన్స్, 2018లో నిర్దేశించిన ప్రమాణాలకు అనుగుణంగా లేదని తేలింది. నమూనాలో విటమిన్ ఎ, విటమిన్ డి స్థాయిలు నిర్దేశిత పరిమితుల కంటే తక్కువగా ఉన్నట్లు ఎఫ్ఎస్ఎస్ఎఐ తెలిపింది. దీంతో ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ యాక్ట్, 2006లోని సెక్షన్ల ప్రకారం ఉత్పత్తిని నాసిరకంగా గుర్తించారు. కంపెనీ అప్పీల్ చేయడంతో నమూనాను రెఫరల్ లేబొరేటరీలో మరోసారి పరీక్షించారు. ఈ పరీక్షల్లోనూ విటమిన్ డి పరిమాణం నిర్దేశిత స్థాయి కంటే గణనీయంగా తక్కువగా ఉన్నట్లు నిర్ధారణ అయింది. దీంతో సెంట్రల్ లైసెన్సింగ్ అథారిటీ ప్రాసిక్యూషన్‌కు అనుమతి ఇవ్వగా, అడ్జుడికేషన్ దరఖాస్తు దాఖలైంది. అనంతరం గోవా అడ్జుడికేటింగ్ అధికారి అగ్రి బిజినెస్‌పై చర్యలు తీసుకుని, నాసిరకం ఫోర్టిఫైడ్ ఎడిబుల్ ఆయిల్ తయారీ, మార్కెటింగ్‌కు సంబంధించి జరిమానా విధించారు. అయితే జరిమానా మొత్తం ఎంత అన్నది ఎఫ్ఎస్ఎస్ఎఐ వెల్లడించలేదు. ఆహార భద్రతా నిబంధనల ఉల్లంఘనలపై గత కొన్ని నెలలుగా ఎఫ్ఎస్ఎస్ఎఐ కఠిన చర్యలు చేపడుతోంది. ఫుడ్ బిజినెస్ ఆపరేటర్లు, ఈకామర్స్ ప్లాట్‌ఫామ్‌లతో పాటు ఎనర్జీ డ్రింక్స్, ఆల్కహాలిక్ బెవరేజెస్ తయారీదారులపైనా నియంత్రణ సంస్థ దృష్టి సారించింది

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.